


# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



## ఏపీ దేశానికే ఆదర్శం

- ఏఐ ఆధారిత జీఎస్టీపై కౌన్సిల్ ప్రశంసలు
- సీఎం చంద్రబాబును కలిసిన అధికారులు

- వివరాలు 2 లో.



## రాజధానికి రయ్ రయ్...

- అమరావతిలో కీలక ఘట్టానికి రెడీ
- నేడు సీఎం చంద్రబాబు చేతులమీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ వంతెనల ప్రారంభం
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్ల పరిశీలన

4



*ప్రజా రాజధాని అమరావతి ప్రగతిలో కీలక ఘట్టం ఆవిష్కారం కానుంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న ఇ-3 రెండో దశలో పూర్తయిన సీడ్ యాక్సెస్ రోడ్డును ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రారంభించనున్నారు. దాంతో పాటు బకింగ్‌హామ్ కెనాల్‌పై స్టీల్ బ్రిడ్జి, కొండవీటి వాగుపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించనున్నారు. ఇక రాజధానిలోకి రాకపోకలు మరింత వేగవంతం, సులభతరం కానున్నాయి. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహ సముదా యాలను సీఎం పరిశీలిస్తారు. ఇందుకు సంబంధించి భారీగా ఏర్పాట్లు చేశారు. స్టీల్ బ్రిడ్జి దగ్గర ప్రత్యేక ఆకారంలో పైలాన్ ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతాన్ని మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దారు.*

## నేరాలకు అడ్డుకట్ట వేయాలి




- దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం
- శాంతిభద్రతల్లో అత్యుత్తమంగా నిలపాలి
- ఇక నెల వారీగా పెర్ఫార్మెన్స్ రిపోర్టు ఇస్తాం
- పరామర్శల పేరుతో రోడ్లపై రచ్చతోనే ఇబ్బందులు
- 94 శాతం మంది ఒక పార్టీ నుంచే అరాచకాలు
- రాజకీయ ముసుగులో నేరాలపై కఠినంగా ఉండండి
- సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాన్ని కట్టడి చేయాలి
- మహిళలు, చిన్నారులపై నేరాలను అదుపు చేయాలి
- బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లపై ఉక్కుపాదం మోపాలి
- సైబర్ మోసాలు, డ్రగ్స్‌పై విస్తృత ప్రచారం
- శాంతిభద్రతలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

*మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల తీరు మారింది.. దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాలి..నేరాలకు అడ్డుకట్ట వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో డీజీపీ నుంచి క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల వరకు శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతి భద్రతలు ముఖ్యం.. ఇందులో ఏపీ అత్యుత్తమ రాష్ట్రంగా ఉండాలన్నదే లక్ష్యం. ఇక నుంచి ప్రతీనెలా పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్టును విడుదల చేయాలని స్పష్టం చేశారు.*

5

## 25 ప్రాజెక్టులు.. రూ.2,08,406 కోట్ల పెట్టుబడులు



- 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు
- అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్
- విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా
- ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్‌కు ప్రతిపాదనలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఆమోదం

3

*ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో రూ.2,08,406కోట్ల విలువైన 25 ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. వీటిలో ప్రధానంగా అనకాపల్లిలో రెన్యూ ఏపీ గ్రీన్ డేటా సెంటర్ రూ.85,200 కోట్లు, విశాఖలో డేటా సెంటర్ హోల్డింగ్స్ ఇండియా రూ.58,743కోట్లు, ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ రూ.31, 387కోట్ల కీలక పెట్టుబడుల ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ25 ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలుకల్పించనున్నారు. డిసెంబరు నుంచి పారిశ్రామిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాల ద్వారా అందించాలని సీఎం సమావేశంలో ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాలకు పరిశ్రమలను విస్తరించాలని సూచించారు.*

## ఖనిజాన్వేషణకు కీలక ఒప్పందం

- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు చర్యలు
- సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూలు



*రాష్ట్రంలో కీలక లిథియం, గాలియం ఖనిజాల అన్వేషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌జీఆర్ఐ-రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నుంచి 100 శాతం నిధులతో రూ.140కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. రాష్ట్రంలో గనులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్ ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించి మరో ఒప్పందం కుదిరింది.*

6




## బీచ్‌శాండ్ మినరల్స్‌కు విలువ జోడింపు

- దేశ, రాష్ట్రాభివృద్ధికి ఉపకరించేలా ఉండాలి
- రాష్ట్రంలోనే ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం
- అదానీ ప్రతినిధులతో భేటీలో సీఎం చంద్రబాబు

6

## గ్రూప్ 1లో అక్రమాలపై.. వైసీపీని నిలదీయాలి

- ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగించారు
- దారుణంగా జవాబు పత్రాల మూల్యాంకనం
- సిట్ నివేదికపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి
- మంత్రులతో సమావేశంలో సీఎం చంద్రబాబు




3

చైతన్యరథం

# పన్నుల పరిపాలనలో ఏపీ దేశానికే ఆదర్శం

- ఏఐ ఆధారిత జీఎస్టీపై కౌన్సిల్ ప్రశంసలు
- దేశవ్యాప్త అమలు నమూనాగా అభివర్ణన
- సీఎం చంద్రబాబును కలిసిన అధికారులు



అమరావతి(చైతన్యరథం): ఢిల్లీలోని జీఎస్టీ కౌన్సిల్ సెక్రటేరియ ట్‌కు చెందిన అదనపు కార్యదర్శి పంకజ్‌కుమార్ సింగ్, సంయుక్త కార్యదర్శి డి.పి.మిశ్రా రెండురోజుల పర్యటనలో భాగంగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర పన్నుల ప్రధాన కమిషనర్ బాబు, శాఖకు చెందిన సీనియర్ అధికారులు వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శాఖ అమలుచేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రిటర్నుల పరిశీలన, ఆడిట్, తనిఖీలు, ఏఐ ఆధారిత న్యాయ కేసుల నిర్వహణ వంటి వినూత్న కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా పరిశీలించారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత డ్యాష్ బోర్డులు, జీఎస్టీ డేటాను ఉపయోగించి రియల్‌టైమ్‌లో ఆర్థిక విశ్లేషణ (జీఎస్‌డీపీ) వంటి కార్యక్రమాలను తెలుసుకున్నారు. విజయవాడ-1 డివిజన్‌ను కూడా ప్రతినిధి బృందం సందర్శించింది. అక్కడ ఏఐ ఆధారిత దర్యాప్తు, న్యాయ కేసుల నిర్వహణను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించింది. అనంతరం జీఎస్టీ సువిధ కేంద్రాన్ని సందర్శించి పన్ను చెల్లింపుదారులకు అందిస్తున్న సేవలను పరిశీలించింది. పర్యటన ముగింపు సందర్భంగా సీఎంను కలిసిన వారు ఏఐ ఆధారిత వినూత్న కార్యక్రమాల ద్వారా పన్నుల పరిపాలనను మరింత బలోపేతం చేయడంతోపాటు రాష్ట్ర ఆదాయాన్ని పెంచేందుకు ఏపీసీటీడీ చేస్తున్న మార్గదర్శక ప్రయత్నాలను ప్రశంసించారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖ సాధించిన స్థాయిలో ఏఐ ఆధారిత సాంకేతిక ఆవిష్కరణలు మరెక్కడా కనిపించడం లేదని వారు అభినందించారు. ఆంధ్రప్రదేశ్ అనుసరిస్తున్న ఏఐ ఆధారిత పన్నుల పరిపాలన విధానం కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించదగిన విలువైన నమూనాగా నిలు స్తుందని పేర్కొన్నారు.





ఏఐ ఆధారిత పన్నుల పరిపాలన వల్ల వ్యాపార నిర్వహణ మరింత సులభతరం కావడంతోపాటు ప్రక్రియలు వేగవంతమై రాష్ట్రంతోపాటు దేశ ఆదాయాలు కూడా పెరిగేందుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

## కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలి

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఏఐ ఆధారిత పన్నుల పరిపాలనను మరింత విస్తృతస్థాయికి తీసుకెళ్లేందుకు జీఎస్టీఎన్ నుంచి అవసరమైన డేటా, వ్యవస్థల అనుసంధానంపై రాష్ట్ర అవసరాలను వివరించారు. రాష్ట్రంతో డేటా పంచుకునే విధానాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. రాష్ట్రాన్ని సందర్శించి తమ విలువైన సూచనలు, అభిప్రాయాలను పంచుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. టెలికాం విప్లవం, ఐటీ విప్లవం, రహదారుల అభివృద్ధి నుంచి ప్రస్తుతం ఏఐ ఆధారిత పాలన వరకు సాంకేతికత ఆధారిత పరివర్తనలో ఆంధ్రప్రదేశ్ ఎప్పటికప్పుడు ముందంజలో ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన సహకారాన్ని అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్రం నిర్దేశించుకున్న వ్యాపార నిర్వహణ వేగం, వ్యాపార సౌలభ్యం లక్ష్యాలకు అనుగుణంగా ఏపీ ఏఐ ఆధారిత పన్నుల పరిపాలన వ్యవస్థలు పూర్తి సామర్థ్యంతో పని చేసేలా కేంద్ర ప్రభుత్వం, జీఎస్టీఎన్ కూడా అదే సహకార స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. అనంతరం వారిని సత్కరించి రాష్ట్ర సంప్రదాయానికి ప్రతీకగా జ్ఞాపికలను అందజేశారు.

# ఐదోసారి అరుదైన గౌరవం

- ఉత్తమ పాఠశాలగా అబ్దుల్ కలాం హైస్కూల్
- రాష్ట్రస్థాయిలో బెస్ట్‌గా కార్పొరేషన్ పాఠశాల
- ఆగస్టు 15న సీఎం చేతులమీదుగా అవార్డ్




కర్నూలు(చైతన్యరథం): నగరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశా లకు మరోసారి అరుదైన గౌరవం దక్కింది. 2025-26 విద్యా సంవత్సరానికి 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలోనే (మున్సిపల్ యజమాన్యం విభా గంలో) అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించింది. దీంతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర వేడుకల్లో భాగంగా అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతులమీదుగా ఉత్తమ పాఠశాల అవార్డును ప్రధా నోపాధ్యాయుడు ఎస్ఎం.హుస్సేన్ అందుకుంటా రు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ పాఠశాలగా వరుసగా ఐదోసారి ఎంపికై తమ రికార్డును మరోసారి బద్దలు కొట్టింది. దీంతో ఈ పాఠశాలకు ప్రత్యేకమైన గుర్తింపు లభిం చింది. కర్నూలు నగరంలో 2016 సంవత్సరంలో ఈ పాఠశాలను ఫౌండేషన్ పాఠశాలగా అప్పటిమున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెలకొల్పారు. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఫౌండేషన్ పాఠశాలను రద్దు చేశారు. అప్పటి మున్సిపల్ కార్పొ రేషన్ కమిషనర్ బాలాజీ చొరవతో ఫౌండేషన్ స్కూల్‌గా పేరు మార్చి డా.ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలగా మార్చి గుర్తింపు తీసుకువచ్చారు.


## ఇదీ ట్రాక్ రికార్డ్

2022 పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 40 మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థి డెబ్బోరా మిజ్మోర్ విద్యార్థిని 592/600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రభాగంలో నిలిచారు. అలాగే 2023లో జరిగిన ఎస్ఎస్‌సీ పబ్లిక్ పరీక్షలో 54 మందికి గానూ 54 మంది పాసై వంద శాతం సాధించారు. సుస్మిత్ అనే విద్యార్థిని 586/600 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. 2024 విద్యాసంవత్సరం పరీక్ష ఫలితాల్లో 48 మంది పాసయ్యారు. విద్యార్థి డి.ఇక్బాల్ 593/600 మార్కు లు సాధించాడు. 2025 విద్యాసంవత్సరంలో 43 మంది పరీక్షకు హాజరు కాగా, అందరూ పాసై వంద శాతం సాధించారు. సాయి లిఖిత అనే విద్యార్థిని 597/600 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిచారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 42 మంది పరీక్షలు రాసి అందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పి.లిఖిత 593/600, గిరీషా 591, ఎం.మేఘన 587 మార్కులు సాధించా రు. అలాగే 581, 580, 579, 578, 577, 576, 575, 574, 573, 531 మార్కులు సాధించారు. 500 మార్కులు పైగా 40 మంది విద్యార్థులు దక్కించుకోవడం విశేషం. 2026 పాలిసెట్ పరీక్ష ఫలితాలో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థి కె.పవన్‌కళ్యాణ్ 117/120 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 195వ ర్యాంకును, పి.లిఖిత 115 మార్కులతో 375వ ర్యాంకు సాధించి పాఠశాలకు గౌరవాన్ని తీసుకొచ్చారు. అలాగే ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో బైపీసీ విభాగంలో అనంత జాగృతి రాష్ట్ర స్థాయిలో 230వ ర్యాంకును ఎంపీసీ విభాగంలో ఎం.సాయి రోహన 256, పి.లిఖిత 285, పవన్‌కళ్యాణ్ 310 మార్కులతో పాఠశాల ఖ్యాతిని పెంచారు. 2025 డిసెంబరు 7న నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఈ పాఠశాల విద్యార్థులు 143, 142 మార్కులతో జిల్లా 2, 3 ర్యాంకు లతో పాటు అత్యధికంగా 31 మంది అర్హత సాధించారు. 2026-27 విద్యాసంవత్సరానికి 9 మంది విద్యార్థులు ఈ పాఠశాల నుంచి ఇడుపులపాయ, నూజివీడు వంటి ట్రిపుల్ ఐటీలకు ఎంపికై ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. 2022 బ్యాచ్‌కు చెందిన రాగిమాన్ ఈశ్వర్ అనే విద్యార్థి జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకు సాధించి కర్నూలు ఐఐఐటీ డీఎంకు ఎంపికై బీటెక్‌లో సీఎస్ఈ బ్రాంచ్‌లో చదువుతున్నారు.

## తల్లిదండ్రుల సహకారంతోనే గుర్తింపు

మా పాఠశాల అత్యుత్తమ ఫలితాలు రాబట్టడంలో విద్యార్థుల పట్టుదలతోపాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంది. ఉపాధ్యా యులందరూ సమష్టి కృషితో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నాం. రాష్ట్ర స్థాయిలో వరుసగా ఐదోసారి ఉత్తమ పాఠ శాలగా ఎంపికకావడం చాలా సంతోషంగా ఉంది. ఇదే స్ఫూర్తితో వచ్చే ఏడాది కూడా రాష్ట్ర స్థాయిలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

**- ఎస్ఎం హుస్సేన్,**
**పాఠశాల ప్రధానోపాధ్యాయుడు**



# డిసెంబరు నుంచి ఎస్క్రో ఖాతాల్లో ప్రోత్సాహకాలు

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పారిశ్రామిక ప్రాజెక్టులు
- రాష్ట్రంలో డిఫెన్స్ ప్రాజెక్టులు జాతికి గర్వకారణం
- గ్రీన్ అమ్మోనియా, లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడులపై దృష్టిసారించాలి
- ఎస్ఐపీబీ బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు
- రూ.2,08,406 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- 25 ప్రాజెక్టుల ద్వారా 21,627 మందికి ఉద్యోగాలు

అమరావతి(చైతన్యరథం): ఈ ఏడాది డిసెంబరు నుంచి పారిశ్రా మిక ప్రోత్సాహకాలను ఎస్క్రో ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు అందించేందుకు ఎస్క్రో ఖాతాలను అనుసంధానించాలని సీఎం సూచించారు. పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఇన్సెంటివ్‌లు తప్పనిసరి అయినా ఎంతవరకూ ఆ ప్రోత్సాహకాలను ఇవ్వగలమన్న అంశంపై దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పారిశ్రామిక ప్రాజెక్టులను ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసేలా ప్రణాళికలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన 20వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం అయింది. పరిశ్రమలు, ఇంధనం, ఐటీ ఎలక్ట్రాని క్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో మొత్తం 25 ప్రాజెక్టులకు సంబం ధించి రూ.2,08,406 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ ఆమోదాన్ని తెలిపింది. తద్వారా 21,627 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలను కల్పించనున్నారు. ఇప్పటివరకూ జరిగిన 20 ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా 363 ప్రతిపాదనల ద్వారా రూ.13.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. ఈ పెట్టుబడుల ద్వారా 10.86 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నా యి.

### డేటా సెంటర్లపై అపోహలు తొలగించాలి

గ్రీన్ అమ్మోనియాతో పాటు లిథియం బ్యాటరీలు, రోబోటిక్స్ రంగాల్లో పెట్టుబడులపై దృష్టి సారించాలని సీఎం అధికారులకు సూచించారు. ఈ రంగంలో పరిశ్రమల్ని ప్రోత్సహించేలా ఏం చేయాలన్న దానిపై అధ్యయనం చేయాలని నిర్దేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు అవుతున్న పారిశ్రామిక ప్రాజెక్టుల గురించి ప్రజలకు వివరించి అవగాహన కల్పించాలని సూచించారు. కొందరు పనిగట్టుకుని కాలుష్యకారకాలంటూ దుష్ప్రచారం చేస్తు న్నారని అసత్యాలను నమ్మించి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. ఉత్తరాంధ్రలో ఏర్పాటు అవుతున్న డేటా సెంటర్లన్నింటి కీ 3.5 టీఎంసీల నీరు సరిపోతుందని తెలిపారు. డేటా సెంటర్లపై ఉన్న అపోహలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండా లని స్పష్టం చేశారు. కొందరు రాజకీయ నిరుద్యోగులు సామాజిక మాధ్యమాల ద్వారా ఫేక్ ప్రచారాన్ని చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గ్రావిటీపై విశాఖలోని పరిశ్రమ లకు పుష్కలంగా నీటిని తీసుకెళతామని స్పష్టం చేశారు. వస్తున్న పరిశ్రమల ద్వారా రాష్ట్రంలోని ఎకోసిస్టమ్‌కు ఎంత విలువ జోడిస్తు న్నామన్న అంశాన్ని విశ్లేషించాలని సూచించారు. ఏపీకి వచ్చే పర్యాటకులను ఆకట్టుకునేలా ఆతిథ్య రంగంలో వస్తున్న హోటల్ భవనాలు ప్రత్యేక నిర్మాణాలుగా ఉండేట్టు చూడాలని ఆదేశించారు.

### సెప్టెంబరు నాటికి 175 ఎంఎస్ఎంఈ పార్కులు

రాష్ట్రంలో ఏర్పాటవుతున్న రక్షణ రంగ ప్రాజెక్టులన్నీ జాతికి గర్వకారణమేనని స్పష్టం చేశారు. పుట్టపర్తి సమీపంలో డిఫెన్స్, హిందుపూర్ సమీపంలో ఏరో స్పేస్ ప్రాజెక్టులు రావాలని నిర్దే శించారు. మూలపేట పోర్టు డిసెంబరులో ప్రారంభించేలా నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్, ఆధునిక వేర్ హౌసింగ్, కోల్డ్ చైన్ ప్రాజెక్టులను అనుసంధా నించాలని సూచించారు. రాయలసీమలో పండే ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు వెళ్లేలా రోడ్ రైల్, పోర్టు కనెక్టివిటీ ఉండాలని స్పష్టం చేశారు. గత ఏడాది నుంచి కుదుర్చుకున్న పెట్టుబడి ఒప్పందాలు, ఎస్ఐపీబీలో అనుమతి పొందిన ప్రాజెక్టు లు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి మిగిలిన 37 ఎంఎస్ఎంఈ పార్కులను కూడా పూర్తి చేసి 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక వాడలు అందుబాటులోకి తీసుకు రావాలని పేర్కొన్నారు. వన్ ఫ్యామిలీ- వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కార్యక్రమాన్ని కూడా పెద్దఎత్తున చేపట్టాలని నిర్దేశించారు.

### ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన ప్రాజెక్టులు

| కంపెనీ | జిల్లా | పెట్టుబడులు | ఉద్యోగాలు |
|---|---|---|---|
| 1.ఓకెయిర్ గ్రీన్ ఫ్యూయెల్స్ | కర్నూలు జిల్లా | రూ.616 కోట్లు | 130 |
| 2.జాక్సన్ గ్రీన్ రెన్యూవబుల్ | కర్నూలు జిల్లా | రూ.1533 కోట్లు | 250 |
| 3.ఎఫ్ పీఈఎల్ రవ్వేద పవర్ | విజయనగరం జిల్లా | రూ.480 కోట్లు | 275 |
| 4.వారీ క్లీన్ ఎనర్జీ సొల్యూషన్స్ | కాకినాడ జిల్లా | రూ.15000 కోట్లు | 1500 |
| 5.ఆరాధ్యా బయోగ్యాస్ | కర్నూలు జిల్లా | రూ.143.47 కోట్లు | 595 |
| 6.ఉషోదయా బయోగ్యాస్ | నెల్లూరు జిల్లా | రూ.143.47 కోట్లు | 595 |
| 7.డేటా సెంటర్ హోల్డింగ్స్ | విశాఖపట్నం | రూ.58,743 కోట్లు | 1250 |
| 8.మునోథ్ లీథియం బ్యాటరీ | తిరుపతి జిల్లా | రూ.500 కోట్లు | 240 |
| 9.ఏఐఎల్ డిక్సన్ | కడప జిల్లా కొప్పర్తి క్లస్టర్ | రూ.450 కోట్లు | 7000 |
| 10.రెన్యూ గ్రీన్ డేటా సెంటర్ | అనకాపల్లి జిల్లా | రూ.85,200 కోట్లు | 1880 |
| 11.ఏఎం ఇంటెలిజెన్స్ ల్యాబ్స్ | విశాఖ జిల్లా | రూ.31,387 కోట్లు | 1000 |
| 12.సీఆర్ఆర్ హాస్పిటాలిటీ ఎల్ఎల్‌పీ | తిరుపతి జిల్లా | రూ.192.02 కోట్లు | 200 |
| 13.ఆర్కే 2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ | తిరుపతి జిల్లా | రూ.150 కోట్లు | 150 |
| 14.సన్ రైజ్ హోటల్స్ ఇండియా | కాకినాడ జిల్లా | రూ.54 కోట్లు | 75 |
| 15.జెఎస్పీ హోటల్స్, రిసార్ట్స్ ఎల్ఎల్‌పీ | కృష్ణా జిల్లా | రూ.63.79 కోట్లు | 100 |
| 16.పావులూరి హోటల్స్ | తిరుపతి జిల్లా | రూ.58.74 కోట్లు | 150 |
| 17.అగస్త్యా గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ | కర్నూలు జిల్లా | రూ.7799.96 కోట్లు | 1000 |
| 18.అక్షత్ గ్రీన్ టెక్ లిమిటెడ్ | విశాఖపట్నం జిల్లా | రూ.1600 కోట్లు | 750 |
| 19.కోరమాండల్ ఇంటర్నేషనల్ | శ్రీకాకుళం జిల్లా, మూలపేట | రూ.2125 కోట్లు | 400 |
| 20.హిందాల్కో ఇండస్ట్రీస్ లిమిటెడ్ | చిత్తూరు జిల్లా కుప్పం | రూ.880 కోట్లు | 447 |
| 21.ఎస్టేలా లాజిస్టిక్స్ | విశాఖపట్నం జిల్లా | రూ.90 కోట్లు | 100 |
| 22.గణేష్ సాయిమౌనిష స్టీల్ వైర్స్ | విజయనగరం జిల్లా | రూ.66 కోట్లు | 120 |
| 23.వీపీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ | నెల్లూరు జిల్లా, మనుబోలు | రూ.500 కోట్లు | 2000 (ప్రైవేట్ పార్క్) |
| 24.జయాదిత్యా ఆగ్రో లిమిటెడ్, | కర్నూలు జిల్లా | రూ.300 కోట్లు | 350 |
| 25.ప్రిసాల్ ఆగ్రో ఇండస్ట్రీస్ | నెల్లూరు జిల్లాలో | రూ.330.71 కోట్లు | 1110 |



## గ్రూప్ 1లో అక్రమాలపై..

# వైసీపీని నిలదీయాలి

- ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసగించారు
- దారుణంగా జవాబు పత్రాల మూల్యాంకనం
- సిట్ నివేదికపై క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి
- మంత్రులతో సమావేశంలో సీఎం చంద్రబాబు


అమరావతి(చైతన్యరథం): వైసీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 అక్రమాలు.. నిరుద్యోగులకు జరిగిన అన్యాయానికి నిదర్శన మని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అర్హతలేని వారికీ ఉద్యోగాలు కట్టబెట్టేందుకు యత్నించారనడానికి ఈ అక్రమాలే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ఉద్యోగాల పేరుతో వైకాపా నిరుద్యోగులకు ఎంతో ద్రోహం చేసిందని మండిపడ్డారు. అమరావతిలో ఎస్ఐపీబీ సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రులతో పలు అంశాలపై చర్చించారు. "హైకోర్టుకు సిట్ సమర్పించిన నివేదిక చూస్తే గ్రూప్-1 అక్రమాల గురించి తెలుస్తుంది. ఈ నివేదికను ప్రతిఒక్కరూ అధ్యయనం చేయాలి. ఇంత దారుణంగా జవాబు పత్రాల మూల్యాంకనం ఎప్పుడూ జరగలేదు. నిరుద్యోగులకు చేసిన మోసంపై వైకాపాను ప్రజలు నిలదీయాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ద్రోహాన్ని కప్పిపుచ్చు కునేందుకు పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై కుట్రపూరితంగా విషప్రచారం చేస్తున్నారు. డీఎస్సీపై వచ్చిన విమర్శలను ప్రభుత్వం గట్టిగా తిప్పికొట్టింది. ఇక ముందు కూడా ఇలాగే కొనసాగాలని సూచించారు. వైసీపీ నిర్వాకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వాటిని అసెంబ్లీలో కూడా చర్చిద్దామని పేర్కొన్నారు.

చైతన్యరథం

# రాజధానిలోకి రయ్ రయ్..

- అమరావతిలో కీలక ఘట్టానికి రెడీ
- నేడు సీఎం చంద్రబాబు చేతులమీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ వంతెనల ప్రారంభం
- భారీగా ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం
- అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ టవర్ల పరిశీలన





అమరావతి(చైతన్యరథం): ప్రజా రాజధాని అమరావతి ప్రగతిలో మరికొన్ని గంటల్లో కీలక ఘట్టం ఆవిష్కారం కానుంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలవనున్న ఇ-3 రెండో దశలో పూర్తయిన సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన స్టీల్ బ్రిడ్జి, కొండవీటి వాగుపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ప్రారంభించను న్నారు. దీంతో రాజధానిలోకి రాకపోకలు మరింత వేగవంతం, సులభతరం కానున్నాయి. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచస్థాయి ప్రమాణాలతో అత్యాధునికి మౌలిక సదుపాయాలతో గ్రిడ్ తరహాలో అభివృద్ధి చేస్తున్న రాజధాని రహదారుల నిర్మాణానికి ఈ ప్రాజెక్టు కీలక ముందడుగుగా నిలవనుంది.

## 34 రహదారులు.. 350 కిలోమీటర్లు

అమరావతిలోని ఎన్-1 నుంచి ఎన్-17 వరకు ఉన్న అన్ని ఎన్-సిరీస్ రహదారులను ఇ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు అను సంధానించనుంది. ఉత్తరం నుంచి దక్షిణం, తూర్పు నుంచి పడమర దిశల్లో గ్రిడ్ తరహాలో రహదారులను ప్రభుత్వం అభి వృద్ధి చేస్తోంది. అనవసర మలుపులు లేకుండా రాజధాని ప్రాం తంలోకి నేరుగా చేరుకునేలా ఈ రహదారి వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఇ, ఎన్ సిరీస్ రోడ్లలో కలిపి 34 ప్రధాన రహదా రులు.. మొత్తం 350 కిలోమీటర్ల మేర నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్‌లో పెరగనున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని రాజధాని రవాణా వ్యవస్థకు పటిష్ఠమైన పునాది వేస్తున్నారు.

## మూడు దశల్లో రూ.1,519 కోట్లతో నిర్మాణం

దొండపాడు నుంచి ప్రారంభమయ్యే ఇ-3 రోడ్డు రాయపూడి, వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి, తాడేపల్లి మీదుగా మణిపా ల్ హాస్పిటల్స్ వద్ద ఎన్‌హెచ్-16ను కలుపుతుంది. 21.77 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి నిర్మాణానికి రూ.1,519 కోట్లు వెచ్చిస్తున్నారు. 60 మీటర్ల వెడల్పుతో మూడు దశల్లో నిర్మిస్తున్న ఈ కారిడార్‌లో 9 లేన్ల రహదారి, ప్రత్యేక బీఆర్టీఎస్ కారిడార్, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. డ్రైనేజీ, మంచినీటి సరఫ రా, గ్యాస్, విద్యుత్ నెట్‌వర్క్‌లకు అవసరమైన మౌలికవసతులను కూడా రహదారి నిర్మాణంతో పాటే కల్పిస్తున్నారు. సైకిల్ ట్రాక్ లు, ఫుట్‌పాత్‌లు, గ్రీన్‌బెల్ట్‌లతో ఇ-3ను ఆధునిక నగర రహదారి గా ప్రభుత్వం తీర్చిదిద్దుతోంది.

## బకింగ్ హామ్ కెనాల్‌పై ఉక్కు వంతెన

ఇ-3 రోడ్డును విజయవాడ-మంగళగిరి హైవేతో అనుసంధా నించేందుకు బకింగ్‌హామ్ కెనాల్‌పై రూ.82 కోట్లతో 478 మీట ర్ల పొడవున నాలుగు వరుసల స్టీల్ బ్రిడ్జిని ప్రభుత్వం నిర్మించింది. దీనిని కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. అలాగే కొండవీటి వాగు, గుంటూరు ఛానల్‌పై 280 మీటర్ల స్టీల్ బ్రిడ్జిని నిర్మించింది. దీనిని కూడా ప్రారంభించనున్నారు. వంతెనలు అందుబాటులోకి రావడంతో విజయవాడ నుంచి అమరావతికి రాకపోకలకు మెరుగైన మార్గం ఏర్పడుతుంది. కరకట్ట రోడ్డుపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గిస్తూ.. వాహనాలు సీడ్ యాక్సెస్ రోడ్డు మీదుగా నేరుగా అమరావతికి చేరుకునే అవకాశం కలుగుతుంది. రాజ ధాని అమరావతి పునర్నిర్మాణంలో రహదారుల అభివృద్ధికి అత్యధి క ప్రాధాన్యం ఇస్తోన్న ప్రభుత్వం.. మౌలికవసతులను వేగంగా పూర్తి చేస్తోంది. సీఎం చంద్రబాబు చేతులమీదుగా ఇ-3 యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జిలు ప్రారంభం కానుండటంతో అమరావతి పున ర్నిర్మాణ వేగానికి మరో కీలక సంకేతంగా నిలవనుంది.

## ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు

ఉదయం 10.20 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి 10.30 గంటలకు ఉండవల్లి స్టీల్ బ్రిడ్జి వద్దకు చేరుకుంటారు. 10.35 గంటలకు శిలాఫలకాన్ని ఆవిష్కరించి స్టీల్ బ్రిడ్జిలు, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభిస్తారు. 10.45 గంటలకు ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడి నుంచి సీడ్ యాక్సెస్ రోడ్డు గుండా ప్రయాణించి రాయపూడికి చేరుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గృహ సముదాయాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం 01.25 గంటలకు సచివాలయానికి చేరుకుంటారు. సాయంత్రం 06.30 గంటలకు నివాసానికి చేరుకుంటారు.







## నేరాల రూపం మారింది..

# పోలీసింగ్ మారాలి

- దర్యాప్తులో గోల్డెన్ అవర్ కీలకం
- ఏపీ పోలీస్ కీర్తి దేశమంతా మార్మోగాలి
- రాష్ట్రంలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం
- ఇక నెల వారీగా పెర్ఫార్మెన్స్ రిపోర్టు ఇస్తాం
- పరామర్శల పేరుతో రోడ్లపై రచ్చతోనే ఇబ్బందులు
- 94 శాతం మంది ఒక పార్టీ నుంచే అరాచకాలు
- రాజకీయ ముసుగులో నేరాలపై కఠినంగా ఉండండి
- సోషల్‌మీడియాలో తప్పుడు ప్రచారాన్ని కట్టడి చేయాలి
- మహిళలు, చిన్నారులపై నేరాలను అదుపు చేయాలి
- బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లపై ఉక్కుపాదం మోపాలి
- సైబర్ మోసాలు, డ్రగ్స్‌పై విస్తృత ప్రచారం నిర్వహించాలి
- శాంతిభద్రతలపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): మారుతున్న కాలానికి అనుగుణంగా నేరాల రూపం కూడా మారిపోయిందని.. దీనికి అనుగుణంగానే పోలీసింగ్ మారాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నేరాల నియంత్రణలో తక్షణం ఆధారాలు కోల్పోకుండా చూడాలని పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నేర నియంత్రణలో గోల్డెన్ అవర్ అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయం నుంచి డీజీపీ నుంచి క్షేత్రస్థాయిలోని స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో శాంతిభద్రతలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. డీజీపీ సహా రేంజ్ ఐజీలు, డీఐజీలు, డీఎస్పీలు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం చేశారు. ఏపీ పోలీసుల కీర్తి దేశమంతా మార్మోగాలని దానికి అనుగుణంగా సిద్ధం కావాలని సూచించా రు. నేరాల దర్యాప్తులో టెక్నాలజీ ఇంటిగ్రేషన్ పెరగాలని సూచిం చారు. డీజీపీ నుంచి ఎస్‌హెచ్‌వో వరకూ సమావేశం నిర్వహిం చటం ఇదే తొలిసారి. శాంతిభద్రతల విషయంలో లోటు పాట్లను సవరించుకుంటూ ముందుకు వెళుతున్నాం. ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నా, రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా శాంతిభద్రతలు ముఖ్యం. రాష్ట్ర ప్రభుత్వానికి పోలీసు విభాగం ఓ ప్రైడ్. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా అంతా వ్యవహరించాలి. ఇన్విజిబుల్ పోలీసు, విజిబుల్ పోలీసింగ్ విధానం అమలు చేయాలి. గడచిన రెండేళ్లుగా కాగ్నిజబుల్ క్రైమ్స్ 14 శాతం మేర తగ్గాయి. కాలాను గుణంగా నేరాలు కూడా మారుతున్నాయి. డిజిటల్ క్రైమ్, డిజిట ల్ అరెస్టులు తదితర నేరాలు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. దీనికి అనుగుణంగా సాంకేతికతను పోలీసులు అందిపుచ్చు కోవాలని ఆదేశించారు.

### పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, గౌరవం

2019-24 మధ్య ఉన్న పాలకులు గంజాయి, కల్తీ మద్యాన్ని ప్రధాన సమస్యగా తయారు చేశారు. పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇస్తాం. గౌరవం పెరిగేలా చర్యలు చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 14,770 సీసీ కెమెరాలతో పాటు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసు కున్న కెమెరాలను కలిపి లక్ష కెమెరాలను అనుసంధానించాం. నేరాల దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్, డీఎన్‌ఏ డిటెక్షన్ లాం టి ఆధునిక విధానాలు పెరిగాయి. వేగంగా నేరాలను గుర్తించ గలుగుతున్నాం. టెక్నాలజీ, నాలెడ్జి, బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పోలీసు అధికారులు సమర్థంగా అమలు చేస్తే శాంతిభద్రతలు నియంత్ర ణలోకి వస్తాయి. రాజకీయ నేరాలు, డిజిటల్ నేరాలు, సోషల్ మీడియా అసభ్య పోస్టుల లాంటి నేరాలు పెరిగాయి. మహిళ లపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ అని పదేపదే చెబుతున్నాను. ఈ విషయంలో కఠినంగా ఉండాల్సిందే. నేరం జరిగిన ప్రాంతాన్ని సంరక్షించటంలో విఫలం కాకూడదు. నేర నియంత్ర ణకు పోలీసులూ గోల్డెన్ అవర్ విధానాన్ని పాటించాలి. తప్పు చేస్తే నేరస్తులు తప్పించుకోలేరని తెలిసేలా చేయాలి. వివేకా హత్య కేసు ఘటనలో పూర్తి సమాచారం రాలేదు. పోలీసుల వైపు నుంచి జరిగిన కాస్ట్ లీ మిస్టేక్ అది. కొందరు కావాలనే తప్పు దోవ పట్టించారు. ఇల్లంతా రక్తం మరకలతో తడిస్తే ఆ ఆధారాలను చెరిపేసే ప్రయత్నం చేశారు. ఇది పూర్తి నిర్లక్ష్యం. నేరస్తుల పట్ల ఉదాసీనంగా ఉండొద్దు. జీరో డ్రగ్స్, గంజాయి లేకుండా జాతీయ స్థాయిలో ఓ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు జరు గుతున్నాయి. మహిళల భద్రతతో పాటు గంజాయి, డ్రగ్స్ నియం త్రణ కోసం డ్రగ్స్ వద్దు బ్రో అన్న ప్రచారాన్ని విస్తృతం చేయండి. రహదారి భద్రత కూడా కీలకమైన అంశం. రోడ్డు ప్రమాదాల అరికట్టేలా సైనేజీలు, రోడ్ ఇంజనీరింగ్, హాట్‌స్పాట్‌లను ఆడిట్ చేయాలి. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు.

### చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ పార్టీలకు లేదు

శాంతిభద్రతల విషయంలో విఫలమైతే తీవ్రమైన పరిణామాలు మనం అంతా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒక్క చిన్న నిర్లక్ష్యం మొత్తం పోలీసు వ్యవస్థపైనే మరక పడుతుంది. సింగయ్య వాహ నం కింద పడిపోయి చనిపోతే కూడా ఎదురు ఆరోపణలు చేశా రు. జగన్ కారు కింద పడిపోయినట్టుగా వీడియో వచ్చింది. కారు తొక్కేస్తే పొదల్లో పడేశారు. ప్రాణాలు కాపాడబోయిన పోలీసు లపైనే నెపం పడింది. ఇబ్రహీంపట్నంలో రాజకీయ పార్టీ ర్యాలీలో రోడ్డుపై మోటారు సైకిల్ విన్యాసాలు ఏమిటి? పోలీసులపై కూడా దాడులు జరిగే పరిస్థితి ఉంది. ఏ పార్టీ అయినా రోడ్డుపై విన్యాసా లు చేసేందుకు అవకాశం లేదు. ప్రజలకు అసౌకర్యం కలిగించ కుండా వెళ్లటం అన్ని పార్టీల బాధ్యత. రాజకీయ పార్టీ నేతలు కాబట్టి ఫ్రీగా వదిలేస్తామంటే శాంతిభద్రతల పరిస్థితి వస్తుంది. రాజకీయ పార్టీలకు ఇష్టానుసారం వ్యవహరించే లైసెన్సు ఇవ్వలేదు. ప్రస్తుతం రోడ్లపై వీరంగం సృష్టిస్తున్న వారిలో 94 శాతం మంది ఒక పార్టీ నుంచే ఉంటున్నారు. పరామర్శలకు వెళ్లటం తప్పేం కాదు. రోడ్లపై చేసే ప్రదర్శనల వల్లే ప్రజలకు ఇబ్బందులు. విశాఖపట్నంలో 3 గంటల పాటు రోడ్లను బ్లాక్ చేశారు. అంబులెన్సులో ఆస్పత్రికి వెళ్లే వారు, ఆఫీసుకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలకు ఇబ్బందులు కలగకూడదనే సీఎంగా నేను కూడా వాహన కాన్వాయ్ కుదించుకున్నాను. మానసిక పరిస్థితి సరిగాలేని కొందరు వ్యక్తులు చేసే నేరాలపై ప్రజల్లోనూ చర్చ జరగాలి. కొందరు రౌడీలే సామాజిక మాధ్యమాల్లో హీరోలుగా మారుతున్నారని వ్యాఖ్యానించారు.

### నెలవారీ పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్ట్

శాంతిభద్రతల విషయంలో ఏపీ అత్యుత్తమ రాష్ట్రంగా ఉండాల న్నదే లక్ష్యం. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగత దూషణలు, అసభ్య ప్రచారంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. నేర నిర్ధారణ రేటు పెరిగితే నేరాలు తగ్గుతాయి. పోలీసులు దర్యాప్తు చేసి విజయం సాధించిన కేసుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధా నం పూర్తిస్థాయిలో అమలుకావాలి. రాజకీయ పార్టీల ముసుగులో కొందరు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను ప్రోత్సహిస్తున్నారు. గతంలో మద్యం తాగించేవారు, ఇప్పుడు గంజాయి మత్తులో వీరంగం చేస్తు న్నారు. కొన్ని సామాజిక మాధ్యమాల సాయంతో నేరస్తులుగా మారుతున్నారు. టెక్నాలజీ నేరస్తులను పట్టిస్తోంది, అదే సమయం లో నేరాలు పెంచుతోంది. బ్యాలెన్సింగ్, ప్రాపర్ పోలిసింగ్ ఉండాలి. పోలీసులు అంటే ప్రజల్లో గౌరవం, సంఘ విద్రోహ శక్తు లకు భయం కలగాలి. రాష్ట్ర అభివృద్ధితోపాటు శాంతి భద్రతలు కూడా కీలకం. అప్పుడే సుపరిపాలన సాధ్యం. డీజీ కార్యాలయం నుంచి పోలీసుస్టేషన్ వరకూ పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.. ఇక నుంచి ప్రతీ నెలా పోలీసు పెర్ఫార్మెన్స్ రిపోర్టును విడుదల చేయాలి. బెస్ట్ ప్రాక్టీసెస్, సక్సెస్ స్టోరీస్ సహా వివిధ అంశాలను ప్రజలకు వివరిద్దామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా 1200 పోలీసు స్టేషన్ల నుంచి స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సహా శాంతిభద్రతలు, ట్రాఫిక్, జీఆర్పీ సహా వివిధ విభాగా లకు చెందిన 1650 మంది అధికారులు వర్చువల్ గా పాల్గొన్నారు. ఈసమావేశానికి హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, శాంతి భద్రతల అదనపు డీజీ ఎన్. మధుసూధనరెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా, ఈగల్ టాస్క్‌ఫోర్స్ ఐజీ రవికృష్ణ ఇతర ఉన్నతాధికారులు హాజర య్యారు.

చైతన్యరథం

# బీచ్‌శాండ్ మినరల్స్‌కు విలువ జోడింపు

- దేశ, రాష్ట్రాభివృద్ధికి ఉపకరించేలా ఉండాలి
- రాష్ట్రంలోనే ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం
- అదానీ ప్రతినిధులతో భేటీలో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో విస్తారంగా ఉన్న బీచ్ శాండ్ మినరల్స్‌కు విలువ జోడించి దేశ అవసరాలకు ఉపయో గపడేలా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రేర్ ఎర్త్ మినరల్స్ కోసం ఇతర దేశాలపై ఆధారపడే పరిస్థితి రాకుండా రాష్ట్రంలోనే విలువ ఆధారిత ఉత్పత్తుల తయా రీకి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇందుకు అవసరమైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవా లని అధికారులకు స్పష్టం చేశారు. అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్ ఎండీ కరణ్ అదానీ నేతృత్వంలోని బృందం బుధవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయింది.

శ్రీకాకుళం జిల్లాలో రూ.16 వేల కోట్ల పెట్టుబడితో అదానీ గ్రూప్ ఏర్పాటు చేసే టైటానియం ప్లాంట్ ఏర్పాటు.. బీచ్ శాండ్ మైనింగ్, ఏయే ఉత్పత్తులు వస్తాయి.. వాటిని ఏయే రంగాల్లో వినియోగిస్తారు... వాటికున్న డిమాండ్ వంటి అంశాలను అదానీ ప్రతినిధుల బృందం సీఎంకు వివరించింది. బీచ్ శాండ్‌లో లభ్యమ య్యే ఇల్మెనైట్ మినరల్‌కు విలువ జోడించి.. టైటానియం స్లాగ్, టీఐవో2, టైటానియం స్పాంజ్ వంటివి ఉత్పత్తి చేయవచ్చని అదా నీ గ్రూప్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లింది. పెయింట్స్, కోటింగ్స్, కాస్మెటిక్స్, ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్, యూవీ రక్షణ ఉత్పత్తులు వంటి వాటిల్లో టీఐవో2ను వినియోగించుకోవచ్చని తెలిపారు.

### విలువ ఆధారిత బీచ్‌శాండ్ మినరల్స్‌ను అభివృద్ధి చేయాలి

సీఎం చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఖనిజాల విలువను పెంచేలా వాల్యూ యాడెడ్ ఉత్పత్తుల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. బీచ్‌శాండ్ మినరల్స్‌ను కేవలం ముడి ఖనిజంగా వెలికి తీయడమనే అంశంగానే కాకుండా... వాటి ద్వారా రాష్ట్రానికి, దేశానికి గరిష్ఠ ప్రయోజనం కలిగేలా మొత్తం విలువ ఆధారిత శ్రేణిని అభివృద్ధి చేయాలని సూచించారు. రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో దేశం ఇతర దేశాలపై ఆధార పడాల్సిన పరిస్థితి లేకుండా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముందుకు సాగాలని తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్ అనేది నేషన్ బిల్డింగ్‌కు ఉపకరించేలా ఉండాలని.. అలాగే రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేలా చూడాలని సూచించారు. రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో రాష్ట్రానికి అందుబాటులో ఉన్న వనరులు, అవసరమైన సాంకేతికత, సరైన టెక్నాలజీ భాగస్వాములను గుర్తిం చడంపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఈ మొత్తం ప్రక్రియ దేశా నికి, రాష్ట్రానికి ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు. విశా ఖలో తాము ఏర్పాటు చేయబోయే ఇందులో స్కిల్ డెవలప్‌మెంట్, అదానీ యూనివర్సిటీ, ఇంటర్నేషనల్ స్కూల్, అదానీ ఆరోగ్య మందిర్ పేరుతో 1,000 పడకల ఆసుపత్రి, 150 సీట్ల మెడికల్ కాలేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. అదానీ డేటా సెంటర్, ఐటీ పార్క్ నిర్మాణాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ వివరాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ఖనిజాల అన్వేషణకు కీలక ఒప్పందం

### సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు చర్యలు


### సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూలు

అమరావతి(చైతన్యరథం): రాష్ట్రంలో కీలక ఖనిజాల అన్వేషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. కడప బేసిన్ పరిధిలోని వేంపల్లె పరిసరాల్లో లిథియం, గాలియం ఖనిజాల నిక్షేపాలపై విస్తృత స్థాయి అన్వేషణకు చర్యలు చేపడుతోంది. ఈ మేరకు సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ), రాష్ట్ర గనులు-భూగర్భశాస్త్ర శాఖల మధ్య ఎంఓయూ కుదిరింది. బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో ఎన్‌జీఆర్ఐ-రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నాయి. తుమ్మల పల్లె, పరిసర ప్రాంతాల్లో ఎన్‌జీఆర్ఐ నిర్వహించిన ప్రాథమిక పరిశోధనల్లో లిథియం, గాలియం ఖనిజాల ఆనవాళ్లు గుర్తించా రు. లిథియం గరిష్ఠంగా 1,000 పీపీఎం, గాలియం 250 పీపీఎం వరకు ఉన్నట్లు అంచనా వేశారు. దీనిపై మరింత అధ్య యనం చేసేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్ట్ నుంచి 100 శాతం నిధులతో రూ.140కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టను న్నారు. మరోవైపు ఏపీలోని గనుల రంగంలో పరిశోధన, టెక్నాల జీ, స్కిల్ డెవలప్మెంట్ వంటి అంశాలకు సంబంధించి ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్-టెక్స్‌మిన్, గనుల శాఖ మధ్య సీఎం సమ క్షంలో మరో ఎంఓయూ కుదిరింది. దీని ద్వారా రాష్ట్రంలో గనులకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఐఐటీ (ఐఎస్ ఎం) ధన్‌బాద్ ఏర్పాటు చేయనుంది. ఈ ఎంఓయూ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ఆయా సంస్థలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.



# యువతే మన బలం.. మన భవిష్యత్

- అంతర్జాతీయ యువజన దినోత్సవాన
- సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు



అమరావతి(చైతన్యరథం): యువత అంటే కేవలం రేపటి తరం కాదు.. ఈరోజు దేశాన్ని, రాష్ట్రాన్ని ముందుకు నడిపించే శక్తి. యువతే మన శక్తి, యువతే మన ఆశ, రేపటి మంచి భవిష్యత్‌పై మన నమ్మకమని ముఖ్య మంత్రి చంద్రబాబు సందేశ మిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా యువతకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి యువకుడు తనకు నచ్చిన దారిని ఎంచుకుని, తనకు నచ్చిన జీవితాన్ని గడిపేలా అవసరమైన స్వేచ్ఛ, ఆత్మవిశ్వాసం, అవకాశాలు ఉండే భవిష్యత్తును నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. యువత పెద్ద కలలు కనాలి. ఆ కలల ను నిజం చేసుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా తోడుగా నిలవాలి. ఈరోజు ప్రభుత్వం తీసు కుంటున్న ప్రతి నిర్ణయం చివరికి రేపటి తరం కోసం మెరుగైన భవిష్యత్తు నిర్మించడానికేనని చంద్రబాబు పేర్కొన్నారు.

### కలలు కనే స్వేచ్ఛ.. సాకారం చేసుకునే అవకాశం

ప్రతి యువకుడికి తన ప్రతిభను నిరూపించుకునే అవకాశం రావాలి. కొత్తగా ఆలోచించే వారికి ప్రోత్సాహం లభించాలి. చదువు పూర్తయ్యాక ఉద్యోగం కోసం మాత్రమే ఎదురు చూడకుండా.. కొత్త అవకాశాలను సృష్టించే స్థాయికి యువత ఎదగాలన్నదే ప్రభుత్వ ఆలోచన. విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, పారిశ్రామిక అవకాశాలు, స్టార్టప్‌లు, టెక్నాలజీ రంగాల్లో యువతకు మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోంది.

### రేపటి ప్రపంచానికి సిద్ధం కావాలి

ప్రపంచం వేగంగా మారుతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు వంటి కొత్త రంగాలు పెద్ద ఎత్తున అవకాశాలను తెస్తున్నాయి. ఈ మార్పులను అందిపుచ్చుకునేలా యువత ఇప్పట నుంచే నైపుణ్యాలను పెంచుకోవాలని సీఎం సూచించారు. చదువుతో పాటు కొత్త విషయాలు నేర్చు కోవడం, సాంకేతికతపై అవగాహన పెంచుకోవడం, స్వయంగా అవకాశాలు సృష్టించుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు.

### యువత ఎదిగితేనే రాష్ట్రం ఎదుగుతుంది

యువతకు మంచి విద్య, నైపుణ్యం, ఉపాధి లభిస్తే వారి కుటుం బాలు బలపడతాయి. కుటుంబాలు బలపడితే సమాజం బలపడుతుంది. సమాజం బలపడితే రాష్ట్రం అభివృద్ధి చెందు తుంది. అందుకే యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రతి ప్రయ త్నం..రాష్ట్ర భవిష్యత్తులో పెట్టుబడేనని చెప్పొచ్చు. “మీ కోసం మంచి భవిష్యత్తు ను నిర్మించడమే మా లక్ష్యం. మీకు కలలు కనడానికి స్వేచ్ఛ ఉండాలి. ఆ కలలను నిజం చేసుకునేందుకు ప్రభు త్వం అండగా ఉండాలి” అన్న చంద్రబాబు సందేశం యువతకు ఒక భరోసాగా నిలుస్తోంది.

# ఇక 'మన సభ-జన సభ'

- అమరావతి అసెంబ్లీలో ప్రజలతో కలిసి స్వాతంత్ర్య సంబరాలు
- ఇకపై ఏటా 4రోజులపాటు సామాన్యులకు సైతం అసెంబ్లీ సందర్శన
- ఆగస్టు 15, జనవరి 26 వేడుకల నిర్వహణకు సామాన్యులకు ఆహ్వానం
- ఆగస్టు 14, 15 తేదీల్లో సాయంత్రం వేళల్లో ప్రజలు, విద్యార్థుల సందర్శనకు పిలుపు
- రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు వెల్లడి



అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర శాసనసభ చరిత్రలోనే అపూర్వ ఘట్టానికి శ్రీకారం చుడుతూ, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రజాపండగలా నిర్వహించేందుకు అమరావతి అసెంబ్లీ ప్రాంగణం సిద్ధమైందని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. కేవలం విద్యుద్దీపాల అలంకరణలు, అధికారుల జెండా వందనానికే పరిమితం కాకుండా సామాన్య ప్రజలను, విద్యార్థులను ఇందులో భాగస్వాములను చేయాలని స్పీకర్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. గతంలో నందమూరి తారకరామారావు తరచూ చెప్పే "మన సభ -జన సభ" స్ఫూర్తితో అసెంబ్లీ గేట్లను ప్రజల కోసం తెరవనున్నట్లు స్పీకర్ అయ్యన్న ప్రకటించారు. ఆగస్టు 14, 15 తేదీలలో సాయంత్రం వేళల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు, పాఠశాల విద్యార్థులు సకుటుంబంగా వచ్చి అసెంబ్లీ విద్యుత్ కాంతులను వీక్షించవచ్చని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం వేళల్లో ప్రత్యేక పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు, స్వాతంత్ర్య పోరాట త్యాగాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నారు. నేటితరం పిల్లలకు దేశ స్వాతంత్ర్య చరిత్ర తెలియాలనే ఉద్దేశంతో విద్యార్థులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నామని, వీలునుబట్టి వారిని అసెంబ్లీ మెయిన్ హాల్ సందర్శనకు అనుమతిస్తామని వెల్లడించారు. అయితే ప్రాంగణంలో ఫోన్లతో రీల్స్ చేయడంవంటి వాటిపై క్రమశిక్షణ దృష్ట్యా కొన్ని నిబంధనలు విధిస్తామని, ఈ వేడుకల భద్రతపై డిజిపి, సీపీలతో ప్రత్యేకంగా సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు.

శాసనసభ సమావేశాలకు హాజరుకాని ప్రజాప్రతినిధుల వైఖరిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాధారణ ఉద్యోగి విధులకు వెళ్లకపోతే కంపెనీ జీతం ఇవ్వదని, ప్రజల సమస్యలు చర్చించడమే ప్రాథమిక విధిగా ఉన్న ఎమ్మెల్యేలు సభకు రాకుండా వేతనాలు, భత్యాలు ఎలా డిమాండ్ చేస్తారని ఆయన ప్రశ్నించారు. గతంలో సభకు రాకుండా నాలుగైదు రోజుల తర్వాత వచ్చి సంతకాలు చేసే దొంగ పద్ధతి ఉండేదని, దానికి స్వస్తి పలుకుతూ తమ హయాంలో 'డిజిటల్ ఫేస్ రికగ్నిషన్ /కెమెరా అటెండెన్స్' తీసుకువచ్చామని పేర్కొన్నారు. సభ్యులు తమకు కేటాయించిన సీట్లో కూర్చుంటేనే హాజరు పడుతుందన్నారు. సభకు హాజరుకాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవడానికి, వారి జీతాల్లో కోత విధించడానికి వీలుగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం తీసుకురావాలని జాతీయ స్పీకర్ల వేదికపై తాను ప్రతిపాదించినట్టు అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. ఇక ప్రతిపక్ష హోదాపై ఆయన స్పందిస్తూ... నిబంధనల ప్రకారం సభలో అవసరమైనంత సంఖ్యాబలం లేనప్పుడు ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యపడదని, అది పూర్తిగా స్పీకర్ విచక్షణ పరిధిలోని అంశమని స్పష్టం చేశారు. సీఎంతో సమానంగా ప్రతిపక్ష నేతకు సమయం కేటాయించడం కుదరదని, చట్టసభలోని ప్రతి సభ్యుడికి మాట్లాడే అవకాశం సమపాళ్లలో లభిస్తుందని స్పీకర్ స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర కూడా ఉన్నారు.



## పర్యాటక మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టూరిజం ఎండీ

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి పట్టన్‌శెట్టి రవిసుభాష్ సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగాభివృద్ధికి తీసుకోవాల్సిన పలు కీలక చర్యలపై వారిద్దరి మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. బాధ్యతలు చేపట్టిన నూతన ఎండీకి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్ రాష్ట్రంలో పర్యాటకరంగాన్ని ముందంజలో నిలిపేందుకు క్షేత్రస్థాయిలో నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ భేటీలో భాగంగా ఏజెన్సీ, గిరిజన ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలను గుర్తించి, అక్కడ పర్యాటకాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపకల్పన చేయాలని దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా ప్రకృతి సమతుల్యత దెబ్బతినకుండా ఎకో-టూరిజం, ఆరోగ్యం-ఆహ్లాదాన్ని అందించే వెల్‌నెస్ టూరిజం ప్రాజెక్టులకు పెద్దపీట వేయాలన్నారు. పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు, ఇప్పటివరకు కుదుర్చుకున్న ఒప్పందాలు త్వరగా పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన పర్యాటక పాలసీ, దాని అనుబంధ విధానాలపై సమగ్రంగా చర్చించడంతో పాటు, పర్యాటక రంగ నిపుణులు, ఇన్వెస్టర్ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు, స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ పరిధిలో ఇప్పటివరకు ఆమోదం పొందిన ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. రాష్ట్ర పర్యాటక వైభవాన్ని చాటిచెప్పేలా ప్రాంతీయ పర్యాటక ఉత్సవాలు నిర్వహించాలని, దేశ విదేశాల్లో ఏపీ టూరిజంకు విస్తృత ప్రచారం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా, మంత్రి దుర్గేష్ దిశానిర్దేశం మేరకు రాష్ట్ర పర్యాటక రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కట్టుబడి పనిచేస్తానని ఏపీటీడీసీ ఎండీ పట్టన్‌శెట్టి రవిసుభాష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ

# అభా ఐడీతో చికిత్స అందించాలి

- ఎన్ఎంసీ మార్గదర్శకాల మేరకు అమలు తప్పనిసరి
- ఈహెచ్ఆర్ నమోదుతో రోగి ఆరోగ్య చరిత్ర భద్రం
- వినియోగంపై ఎన్ఎంసి డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షణ
- వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ వెల్లడి




అమరావతి (చైతన్య రథం): జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాల మేరకు ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ రోగులకు అభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఐడీ ఆధారంగా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి వీరపాండియన్ స్పష్టం చేశారు. ప్రభుత్వ బోధనాసుపత్రులతో పాటు ఇతర ప్రభుత్వాసుపత్రుల్లో ఇప్పటికే అభా ఐడీ ఆధారంగా సేవలు అందిస్తున్నామని, దీనివల్ల రోగుల ఆరోగ్య వివరాలతో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్) రూపొందుతున్నాయని తెలిపారు. ఎన్ఎంసీ తాజాగా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రైవేటు వైద్య కళాశాలల్లో అభా ఐడీల ఆధారంగా వైద్య సేవలు అందించే ప్రక్రియను వెంటనే అమలు చేయాలని వీరపాండియన్ కోరారు. ఈమేరకు రాష్ట్రంలోని ప్రైవేటు వైద్య కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులతో బుధవారం విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యశాలలో ఆయన మాట్లాడారు.

### రోగి ఆరోగ్య వివరాలు నిక్షిప్తం

రాష్ట్రంలో ఇప్పటివరకు 5.04 కోట్ల అభా ఖాతాలు సృష్టించగా, వాటికి అనుసంధానంగా 12.7 కోట్ల ఆరోగ్య రికార్డులు నమోదయ్యాయని తెలిపారు. రోగి ఎన్నిసార్లు ఆసుపత్రికి వెళ్లినా సంబంధిత ఆరోగ్య వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లో నమోదవుతాయని చెప్పారు. ప్రభుత్వాసుపత్రులతోపాటు కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఈ విధానం అమలవుతోందన్నారు. కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లో మాత్రం ఈ ప్రక్రియ ఇంకా కాగితాలకే పరిమితమైందని పేర్కొన్నారు. ఎన్ఎంసీ తాజా మార్గదర్శకాల నేపథ్యంలో అన్ని ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ ఈహెచ్ఆర్ విధానం పూర్తిస్థాయిలో అమలు కావాలని స్పష్టం చేశారు. ఈ ఈహెచ్ఆర్ నమోదు చేయటంలో ప్రయివేటు కాలేజీల మధ్య పోటీతత్వం ఉండాలన్నారు

### భవిష్యత్తులో అత్యంత కీలకం

దేశవ్యాప్తంగా రోగులకు విస్తృత ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో అభా ఖాతాల వ్యవస్థను రూపొందిస్తున్నారని వీరపాండియన్ తెలిపారు. భవిష్యత్‌లో వైద్య కళాశాలలకు సీట్ల మంజూరు, ఇతర అనుమతుల విషయంలో అభా ఖాతాల వినియోగాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందన్నారు. ప్రైవేటు వైద్య కళాశాలల్లో అభా ఐడీ ఆధారంగా సేవలు, ఈహెచ్ఆర్ నమోదవుతున్న తీరును ఎన్ఎంసీ డ్యాష్‌బోర్డ్ ద్వారా పర్యవేక్షిస్తోందని చెప్పారు.

### అభా రికార్డుకు రూ.10 ప్రోత్సాహకం


రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధరబాబు మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌తో అనుసంధానమైన హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్ఎంఐఎస్)ను ప్రైవేటు వైద్య కళాశాలలు వినియోగిస్తే రోగి ఆరోగ్య వివరాలు వెంటనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీంతో రోగి అనారోగ్య చరిత్రపై వైద్యులకు త్వరగా అవగాహన రావడంతో చికిత్స సులభతరమవుతుందన్నారు. ఒక్కో ఎలక్ట్రానిక్ ఆరోగ్య రికార్డును నమోదు చేసినందుకు కేంద్ర ప్రభుత్వం రూ.10 చొప్పున ప్రోత్సాహకం అందిస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.150 కోట్ల మేర చెల్లింపులు జరగగా, రాష్ట్రానికి సుమారు రూ.15 కోట్లు అందాయని చెప్పారు. ఇందులో ప్రైవేటు ఆసుపత్రులకు జరిగిన చెల్లింపులు రూ.75 లక్షలు మాత్రమేనన్నారు.

### సాంకేతిక సహకారం అందిస్తాం

ప్రైవేటు వైద్య కళాశాలలు అభా ఐడీల ద్వారా ఈహెచ్ఆర్ తయారీలో చురుగ్గా పాల్గొనాలని చక్రధరబాబు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామని తెలిపారు. ఏ సాఫ్ట్‌వేర్ లేదా అప్లికేషన్‌ను వినియోగించినా, దానికి అనుగుణంగా సాంకేతిక సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సదస్సులో ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి చంద్రశేఖర్, రిజిస్ట్రార్ సుధీర్, ఏబీడీఎం స్టేట్ నోడల్ అధికారి బీవీ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యశాల కోసం వైద్య ఆరోగ్య శాఖ పథకాల అమలులో సహకరిస్తున్న 'పాత్' సంస్థ సాంకేతిక మద్దతు అందించింది.

# చంద్రబాబు విజనరీ లీడర్

- అభివృద్ధికి నిలువెత్తు చిరునామా
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసలు
- టీడీపీ ఎంపీ కలిశెట్టి కుటుంబంతో ఆత్మీయ భేటీ



న్యూఢిల్లీ (చైతన్య రథం): ఏపీ సీఎం నారా చంద్రబాబుపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు గొప్ప విజనరీ నాయకుడని, ఆయన మంచి మనసున్న వ్యక్తి అని కొనియాడారు. ఏ కార్యక్రమం చేపట్టినా దాన్ని అద్భుతంగా, పరిపూర్ణంగా తీర్చిదిద్దడం ఆయనకే చెల్లిందని, నిరంతర శ్రమతో దార్శనికతను ప్రదర్శించే చంద్రబాబు నిజమైన అభివృద్ధికి చిరునామా అని అభినందించారు. రాష్ట్రంలో పారిశ్రామిక పురోగతితో పాటు ప్రజల సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ పాలన అందించడంలో ఆయన శైలి అసాధారణమైనదని పేర్కొన్నారు.

విజయనగరం టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబసభ్యులతో కలసి రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కుటుంబసభ్యులతో రాష్ట్రపతి ఎంతో ఆప్యాయంగా ముచ్చటించారు. భేటీ సమయంలో అమరావతి రాజధాని నిర్మాణానికి సంబంధించిన విశేషాలతో రూపొందించిన ప్రత్యేక కాఫీ టేబుల్ బుక్‌ను అప్పలనాయుడు రాష్ట్రపతికి అందజేశారు. దాన్ని ఎంతో సంతోషంగా స్వీకరించిన ముర్ము, పుస్తకాన్ని తెరిచి అందులోని అమరావతి ప్రతిపాదిత నమూనాలు, చారిత్రక ఘట్టాల ఫోటోలను ఆసక్తిగా తిలకించారు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు కోసం రూపుదిద్దుకుంటున్న అమరావతి రూపురేఖలను చూసి ఆనందం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పురోగతి గురించిన ప్రస్తావన రాగా.. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరిగిన తీరును రాష్ట్రపతి గుర్తు చేసుకున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఈ విమానాశ్రయం గేట్‌వేగా మారుతుందని అభిప్రాయపడ్డారు.

**నన్ను నేను చూసుకున్నట్లుంది..**

సంభాషణ మధ్యలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తాను సామాన్య గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చానని తెలపగా, రాష్ట్రపతి స్పందిస్తూ ఆత్మీయ వ్యాఖ్యలు చేశారు. "నేను కూడా సమాజంలోని అత్యంత దిగువస్థాయి నుంచి, సామాన్య నేపథ్యంనుంచే ఈ అత్యున్నత స్థాయికి చేరుకున్నాను. మిమ్మల్ని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లే ఉంది" అని ఎంపీని అభినందించారు. ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ సమస్యలపట్ల స్పందించే తీరు, పార్లమెంటుకు నిత్యం సైకిల్‌పై వస్తూ సాదాసీదా జీవితం గడపడం, సభలో 100 శాతం హాజరు శాతాన్ని నమోదు చేసుకోవడం వంటి విషయాలను ప్రత్యేకంగా గుర్తుచేసి కలిశెట్టి అప్పలనాయుడి క్రమశిక్షణను, నిబద్ధతను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పదే పదే మెచ్చుకున్నారు.

**విద్యారంగ సంస్కరణల ప్రస్తావన**

ఇదే భేటీలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కుమార్తె కలిశెట్టి నిఖిల మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యారంగంలో అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నారని రాష్ట్రపతి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేయడం, రికార్డు స్థాయిలో 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్'లు నిర్వహించడం వంటి అంశాలను వివరించారు. నిఖిల చెప్పిన విషయాలను ఎంతో శ్రద్ధగా ఆలకించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆ సంస్కరణల గురించిన సమాచారం ఇదివరకే తన దృష్టికి వచ్చిందని తెలిపారు. అంతేకాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యారంగంలో నిరంతరం సంస్కరణలు చేపట్టవలసిన అవసరం ఉందని ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము అభిప్రాయపడ్డారు.

# అసెంబ్లీకి వచ్చే ధైర్యముందా?



- జగన్‌రెడ్డీ.. ప్రెస్‌మీట్ల రాజకీయం ఆపు
- మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ హితవు

మంగళగిరి (చైతన్య రథం): డీఎస్సీ నిర్వహణపై వైసీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాట్లాడుతున్న మాటలు చూస్తుంటే నవ్వాలో, ఏడ్వాలో అర్థంగాని పరిస్థితి ఉందని మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ వ్యాఖ్యానించారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ సమస్యలు, ఉపాధ్యాయ ఖాళీలు వైసీపీకి గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయకుండా నిరుద్యోగులను నట్టేట ముంచిన వైసీపీ.. ఇప్పుడు ధర్నాలు, ఉద్యమాలంటూ రోడ్డెక్కడం విడ్డూరమన్నారు. "నిరసన కార్యక్రమాల్లో.. వైసీపీ నాయకుడొకరు 'డీఎస్సీ'ని 'డీపీసీ' అంటూ ప్రస్తావించడం అవగాహన రాహిత్యానికి నిదర్శనం. కూటమి ఎమ్మెల్యే గుడివాడ రాము ఛాలెంజ్ చేసినట్టు మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని కనీసం గూగుల్ చూడకుండా డీఎస్సీ అబ్రివియేషన్ చెప్పగలరా? స్పష్టత, అవగాహనలేని నాయకులు ఇవాళ నిరుద్యోగుల కోసం ఉద్యమాలు చేస్తామనడం దెయ్యాలు వేదాలు వల్లించడమే. 2019 ఎన్నికల్లో ఏటా 'మెగా డీఎస్సీ' ఇస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లపాటు ఒక్క నోటిఫికేషన్ సైతం ఇవ్వలేదు. సమాధానం చెప్పే ధైర్యంలేక.. వైసీపీ నేతలు విచిత్రమైన సాకులు చెప్తున్నారు" అంటూ రామకృష్ణ మండిపడ్డారు. కోవిడ్ కాలాన్ని సాకు చూపడం... 2020 జాతీయ విద్యా విధానంవల్లే ఉపాధ్యాయ నియామకాలు ఆలస్యమయ్యాయని కథలు చెప్పడం వైసీపీకే చెల్లింది. విధ్య అనేది ఉమ్మడి జాబితాలో ఉంటుంది.

రాజ్యాంగం ప్రకారం కేంద్ర విద్యా విధానాన్ని యథాతథంగా అమలు చేయాల్సిన నిబంధన రాష్ట్రాలకు లేదు. ఎన్ఈపీ 2020, రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ (2009) ప్రకారం 1నుంచి 8వ తరగతి వరకు మాతృభాషలోనే (తెలుగులోనే) బోధన సాగాలని స్పష్టంగా ఉంది. మరి దీనిని పక్కనపెట్టి, 1వ తరగతి నుంచే బలవంతంగా ఇంగ్లీష్ మీడియం రుద్దినప్పుడు లేని విద్యా విధానం, కేవలం నియామకాలు ఆపడానికి మాత్రమే గుర్తుకొచ్చిందా? ఐదేళ్లు ఏమీ చేయకుండా, ఎన్నికలకు రెండు నెలల ముందు కేవలం 6,100 పోస్టులతో అరకొర డీఎస్సీ ప్రకటన ఇచ్చి, ఎలక్షన్ కోడ్ వస్తుందని తెలిసీ నిరుద్యోగులను మోసం చేశారు. ఎన్నికల కమిషన్ ఆ ప్రక్రియను ఆపడం వారి డ్రామాలకు చెక్ పెట్టింది. ప్రస్తుత నియామకాల్లో, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాలో టెట్ రాయని వారికి పోస్టులిచ్చారని వైఎస్సార్‌సీపీ నాయకులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ధైర్యముంటే, టెట్ రాయకుండా స్పోర్ట్స్ కోటాలో ఎవరికి ఉద్యోగం ఇచ్చారో ఆధారాలతో నిరూపించాలి. అబద్ధాలు, కుప్పిగంతులతో నిరుద్యోగ యువతను మళ్లీ మోసం చేయలేరు. విద్యా వ్యవస్థను నాశనం చేసిన చరిత్ర వైసీపీదే. ప్రజలు, నిరుద్యోగులు ఈ దొంగ నాటకాలను గమనిస్తున్నారు. ఇకనైనా అబద్ధాల ప్రచారాలు బంద్ చేయాలి' అని రామకృష్ణ డిమాండ్ చేశారు.

శాసనసభకు వచ్చే ధైర్యం లేక, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా పారిపోతున్న వైసీపీ అధినాయకత్వం ప్రెస్ మీట్లకే పరిమితమై రాజకీయం చేయడం సిగ్గుచేటని ఏఎస్ రామకృష్ణ ఎద్దేవా చేశారు.

ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వలేని తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఇవాళ కూటమి ప్రభుత్వంపై, మంత్రి నారా లోకేష్‌పై అబద్ధాలతో దుష్ప్రచారాలు చేస్తున్నారు. డీఎస్సీపై అక్రమాలు జరిగాయని, డబ్బులు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారని నిజంగా నమ్మకముంటే అసెంబ్లీకి వచ్చి ఆధారాలతో మాట్లాడాలి. 2019-2024 మధ్య కూటమి తరపున కేవలం 23 మంది ఎమ్మెల్యేలున్నా, నాడు చంద్రబాబు ధైర్యంగా అసెంబ్లీకి వచ్చి ప్రజల తరపున పోరాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాత్రం సభకు రాకుండా ప్రెస్‌మీట్లనే అసెంబ్లీగా భావిస్తూ విచిత్రంగా ప్రవర్తిస్తున్నారు. శాసనమండలిలో తమకున్న మెజారిటీని చూసుకుని అక్కడ డీఎస్సీపై ప్రభుత్వాన్ని ఎలా ఇబ్బంది పెట్టాలో పాఠాలు చెప్తున్న జగన్‌రెడ్డి, శాసనసభకు వచ్చి నేరుగా మాట్లాడేందుకు ఎందుకు భయపడుతున్నారు? మొన్నటిదాకా దుర్గారావు అనే వ్యక్తిని పక్కన కూర్చోబెట్టుకుని డీఎస్సీపై అబద్ధాలు ప్రచారం చేశారు. తీరా ఆ దుర్గారావే కోర్టుకి వెళ్లి "తన సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయలేదని, తనదే పొరపాటని" తేల్చడంతో వైఎస్సార్‌సీపీ పరువుపోయింది. అయినా సిగ్గుపడకుండా ఇవాళ నాగమల్లేశ్వరరావులాంటి వారిని ముందుపెట్టి మళ్లీ దొంగ నాటకాలు ఆడటం దారుణం. మంత్రి నారా లోకేష్ రహస్యంగా అమెరికా పారిపోయారంటూ 'సాక్షి'లో రాసిన కథనాలు వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనం. రాష్ట్రానికి పెట్టుబడులు, అభివృద్ధి కోసం ఎక్కడికి వెళ్తాలన్నా జగన్‌రెడ్డికి చెప్పి వెళ్లాలా? డీఎస్సీ దొంగ ఉద్యమాలు చూసి పారిపోవాల్సిన అవసరం కూటమి ప్రభుత్వానికి లేదు. ప్రముఖ నేషనల్ ఇంగ్లీష్ మ్యాగజైన్ 'ఫార్చ్యూన్'లో మంత్రి నారా లోకేష్‌ని "రైజింగ్ స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్" అని కొనియాడుతూ, రాష్ట్రానికి ఆయన తెచ్చిన లక్షల కోట్ల పెట్టుబడులు, ఆయనలోని రాజకీయ పరిణతిపై కథనం ప్రచురించింది. గతంలో 'ది వీక్' పత్రిక కూడా ఆయన నాయకత్వాన్ని ప్రశంసించింది. తమ పాలనలో సాధించలేని అభివృద్ధిని చూసి ఓర్వలేక, డబ్బులు ఇచ్చి ఆ కథనాలు రాయించుకున్నారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడటం వారి అజ్ఞానానికి, అసూయకు నిదర్శనం. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా ఇవ్వలేకపోయిన మీ అసమర్థతను దాచుకోవడానికి ఇవాళ డీఎస్సీపై సీబీఐ విచారణ అని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉంది. అబద్ధాల ప్రచారాలను, ఈ వింత రాజకీయాన్ని ప్రజలు అసహ్యించుకుంటున్నారు" అని రామకృష్ణ ధ్వజమెత్తారు.

తమ సొంత అవినీతి, నేర చరిత్రలను కప్పిపుచ్చుకోవడానికి ఇవాళ వైసీపీ నాయకులు డీఎస్సీపై సీబీఐ విచారణలంటూ డిమాండ్ చేయడం అత్యంత విడ్డూరంగా ఉంది. స్వయంగా వివేకానందరెడ్డి హత్య కేసులో వైఎస్ సునీత "ఏడేళ్లవుతున్నా కేసు ముందుకు సాగడం లేదని" ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు సీబీఐపైనే కేసులు పెట్టి, తమపై 22 ఈడీ కేసులు, ఇసుక-మద్యం మాఫియా కేసులు, గొడ్డలిపోటు, కోడికత్తి డ్రామా కేసులున్న జగన్ మోహన్ రెడ్డి.. ఆ కేసులపై సీబీఐ విచారణ ఎందుకు అడగరని ప్రశ్నిస్తున్నాం. ఏ కాయకష్టం చేయకుండా, ఏ వ్యాపారం సరిగ్గా చేయకుండా లక్షల కోట్లు ఎలా సంపాదించారు? ఆ అక్రమ సంపాదన, క్విడ్ ప్రో కో కేసుల వల్లే కదా గతంలో 16 నెలలు జైలు జీవితం గడపాల్సి వచ్చింది? ఇన్ని అవినీతి మరకలు పెట్టుకుని ఇవాళ పారదర్శకంగా జరుగుతున్న డీఎస్సీపై మాట్లాడటం హాస్యాస్పదం.

నేను దేశంలోనే అత్యంత ప్రభావవంతమైన నాయకుడిని, నా వెనుక లక్షలాది మంది ఉన్నారని చెప్పుకునే జగన్‌రెడ్డికి.. అసెంబ్లీలోని మిగతా ఎమ్మెల్యేలను ఎదుర్కొనే ధైర్యం లేదా? గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గుమ్మడి నరసయ్య లేదా సీపీఎం నాయకుడు ఓంకార్ ఒంటరిగా అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బ్రహ్మాండంగా పోరాడారు. మరి మీకు 11మంది సభ్యులున్నా అసెంబ్లీకి రావడానికి ఎందుకు భయం? సభకు రాకుండానే జీతాలు తీసుకుంటున్న మీ ఎమ్మెల్యేలకు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు 'ఫేషియల్ రికగ్నిషన్' అటెండెన్స్ విధానం ద్వారా చెక్ పెట్టడాన్ని ఆహ్వానిస్తున్నాం. ఈరోజు డీఎస్సీపై అక్రమాలు జరిగాయంటూ 'జెడ్ జెడ్ వార్' పేరుతో సోషల్ మీడియాలో వైసీపీ ఒక వినాశకరమైన, అబద్ధపు ప్రచారాన్ని నడుపుతోంది. నిరుద్యోగ యువతను భ్రమల్లోకి నెట్టడమే వీరి లక్ష్యం. వైసీపీ అనేది ఒక దొంగ పార్టీ, అబద్ధాల పార్టీ, దౌర్జన్యాల పార్టీ, అవినీతి పార్టీ. ఒక్క మాటలో చెప్పాలంటే ఒక వినాశకర పార్టీ. ఒక వ్యవస్థను, రాష్ట్రాన్ని నాశనం చేయడానికి పూనుకున్న ఇలాంటి పార్టీ దుష్ప్రచారాల బారిన పడకుండా ప్రజలు, నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలి" అని ఏఎస్ రామకృష్ణ చెప్పారు.

# ఎయిడ్స్ రహిత ఏపీ లక్ష్యం

- డిసెంబరు 1నాటికి ‘95-95-99’ లక్ష్యాల సాధన
- వైద్య, ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ పిలుపు
- 60 రోజుల ప్రత్యేక అవగాహన ప్రచారం ప్రారంభం
- డిజిటల్ పర్యవేక్షణకు ‘సురక్ష’ డ్యాష్‌బోర్డ్ ఆవిష్కరణ



అమరావతి (చైతన్య రథం): హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, 2026 డిసెంబరు 1 నాటికి నిర్దేశిత ‘95–95–99’ లక్ష్యాలను వందశాతం సాధించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ఈ సాధనలో యువతతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన ‘60 రోజుల ప్రత్యేక సమాచార, విద్య, ప్రచారం పేరుతో తయారు చేసిన కార్యాచరణ ప్రణాళిక అమలు కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ నియంత్రణలో రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. గతంతో పోలిస్తే కొత్త హెచ్‌ఐవీ ఇన్ఫెక్షన్లు 77 శాతం, మరణాలు 87 శాతం తగ్గడం నిదర్శనమన్నారు. ఈక్రమంలో అంచనా వేసిన హెచ్‌ఐవి బాధితుల్లో 95 శాతం మందికి హెచ్‌ఐవి వచ్చినట్లు తెలిసి ఉండాలని, తెలిసిన వారిలో 95 శాతం మంది మందులు వాడుతూ ఉండాలని, మందులు వాడే వారిలో 99 శాతం మందికి వైరల్ లోడ్ బాగా తగ్గి ఉండాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. ఈ మూడు కేటగిరీల్లో రాష్ట్ర ప్రభుత్వం 88–87–96.2 శాతంమేర పురోగతి సాధించిందని చెప్పారు. మిగిలిన లక్ష్యాన్ని (95–95–99) డిసెంబరు 1 గడువులోగా సాధించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ మూడు దశల్లో ఎక్కడ లోటు ఉందో గుర్తించి.. అక్కడే ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలవారీగా పురోగతిని నిరంతరం పరిశీలిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ లక్ష్యాల సాధనలో యువతను ప్రధాన భాగస్వామ్యం చేయాలని, సామాజిక మాధ్యమాల ద్వారా సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

### ‘సురక్ష’తో జిల్లాలవారీగా పర్యవేక్షణ

హెచ్‌ఐవీ నియంత్రణ కార్యక్రమాల పురోగతిని, జిల్లాలవారీగా ఉన్న లోటుపాట్లను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు తయారు చేసిన ‘సురక్ష డ్యాష్‌బోర్డ్’ను మంత్రి ఆవిష్కరించారు. దీని ద్వారా ఏ జిల్లాలో పురోగతి ఎలా ఉంది? ఎక్కడ లోటుంది? ఎక్కడ ప్రత్యేక దృష్టి అవసరం? ఏయే ప్రాంతాల్లో చర్యలను వేగవంతం చేయాలి? వంటి అంశాలను గుర్తించి తదనుగుణంగా కార్యాచరణ చేపట్టే అవకాశం ఉంటుందని అన్నారు.

### యువతతో 60 రోజుల ప్రత్యేక ప్రచారం

రాబోయే 60 రోజులపాటు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జి వీరపాండియన్ తెలిపారు. ఎయిడ్స్ రహిత దేశం కోసం సన్నద్ధీకరణలో భాగంగా జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ మార్గదర్శకాల ప్రకారం డిసెంబరునాటికి ‘సురక్షిత్, సురక్షిత్ ప్లస్’ లక్ష్యాలను సాధించే దిశగా కార్యాచరణ చేపట్టనున్నట్టు వెల్లడించారు. జానపద కళాజాతాలు, సామాజిక మాధ్యమాలు, కరపత్రాల ద్వారా ప్రచారాన్ని నిర్వహించాలని తెలిపారు.

### తల్లినుంచి బిడ్డకు సంక్రమణ నివారణ

గర్భిణీలకు ముందస్తుగా హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించి.. అవసరమైన వైద్య సేవలు, చికిత్స అందించడం ద్వారా తల్లినుంచి బిడ్డకు హెచ్‌ఐవీ సంక్రమించకుండా చర్యలు తీసుకోనున్నట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు తెలిపారు. అవసరమైన వారికి సకాలంలో చికిత్స అందేలా సేవలను బలోపేతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

### ఏఆర్‌టీ కేంద్రాల పనితీరుపై సమీక్ష

జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ఏఆర్‌టీ కేంద్రాల పనితీరును సమీక్షించడంతో పాటు.. చికిత్స పొందుతున్న వారి కొనసాగింపును పర్యవేక్షిస్తున్నామని ఏపీ శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ స్మరణ్ రాజ్ తెలిపారు. హెచ్‌ఐవీ నిర్ధారణ అయిన వారికి చికిత్స అందేలా, చికిత్సలో ఉన్నవారికి నిరంతర సేవలు అందేలా చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. రాబోయే 60 రోజుల్లో చేపట్టే ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థలు, వల్నరబుల్ వర్గాల వరకు విస్తరించనున్నారు.

యువత, స్వచ్ఛంద సంస్థలు, వైద్య సిబ్బంది, విద్యాసంస్థలు, ప్రసార మాధ్యమాల భాగస్వామ్యంతో ప్రచారాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్తామన్నారు. గర్భిణీల పరీక్షలు, తల్లినుంచి బిడ్డకు సంక్రమణ నివారణ, ఏఆర్‌టీ చికిత్స కొనసాగింపు, వైరల్ లోడ్ నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు. ప్రతి జిల్లాలోని గ్యాప్‌ను గుర్తించి.. దానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. గుర్తింపు నుంచి చికిత్స వరకు, చికిత్స నుంచి వైరల్ లోడ్ నియంత్రణ వరకు ప్రతి దశను పర్యవేక్షిస్తాం. ఇప్పటికే సాధించిన పురోగతిని మరింత ముందుకు తీసుకెళ్లి ఎయిడ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణ దిశగా అడుగులు వేస్తాం” అని ప్రాజెక్ట్ డైరెక్టర్ స్మరణ్ రాజ్ చెప్పారు. కార్యక్రమంలో ఏపీ శాక్స్ ఇన్‌ఛార్జి అడిషనల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ భాగ్యలక్ష్మి, జేడీ ఐఈసి డాక్టర్ మంజుల, జేడీ టిఐ సుకుమార్, జేడీ బిఎస్‌డి సిఎస్‌టి డాక్టర్ శ్రీనివాస వర్మ, జేడీ బిటిఎస్ డాక్టర్ చక్రవర్తి ప్రచార కార్యక్రమంలో భాగస్వాములైన రాష్ట్రంలోని ముఖ్యమైన స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రగతికి ఏపీ సరికొత్త అడుగులు




- చెన్నై - కోయంబత్తూర్ సదస్సుల్లో పెట్టుబడుల వెల్లువ
- ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తల ఆసక్తి
- సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్‌కు అంతా సానుకూలం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

అమరావతి (చైతన్య రథం): సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్ 2026కి ముందుగా చేపడుతున్న పెట్టుబడుల ప్రోత్సాహక కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ‘కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ’ భాగస్వామ్యంతో.. ఏపీఈడీబీ సమన్వయంతో చెన్నై, కోయంబత్తూర్‌లో మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ రోడ్‌షో విజయవంతమైనట్టు రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, అంతర్జాతీయ వాణిజ్య సంస్థల ప్రతినిధులు పాల్గొనగా రాష్ట్రంలో విస్తృత పెట్టుబడి అవకాశాలను ప్రభుత్వ బృందం సవివరంగా ప్రదర్శించింది. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రగతిశీల నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో సమృద్ధిగావున్న సహజ వనరులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, బలమైన మౌలిక వసతులు, వ్యూహాత్మక పోర్టులు, పారిశ్రామిక కారిడార్లు మరియు పారిశ్రామిక అనుకూల విధానాలను వివరించారు. అలాగే రాష్ట్రంలో సాగుతున్న సుపరిపాలన, వేగవంతమైన వ్యాపార ప్రక్రియలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలు వివరించారు. రాష్ట్రంలో విభిన్న రంగాల్లో ఉన్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా పరిశ్రమలు, పెట్టుబడిదారులను ఆహ్వానించిన మంత్రి.. పరస్పర ప్రయోజనకర భాగస్వామ్యాల నిర్మాణానికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని భరోసా ఇచ్చారు.

ఇసుజు మోటార్స్, హీరో మోటోకార్ప్, కోరమాండల్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్‌తో తమకున్న సానుకూల అనుభవాలను పంచుకోవడం, రాష్ట్రంలో ఆకర్షణీయమైన పెట్టుబడి వాతావరణానికి నిదర్శనమని మంత్రి తెలిపారు. మంగళవారం చెన్నైలో జరిగిన సదస్సులో జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్, ఇండో–జాపాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రెసిడెంట్ ఎస్ పద్మనాభన్, టీఈసీసీ చెన్నై డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ హ్యు, పోస్కో చెన్నై ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ మిస్టర్ జంగ్ ఊంగ్ కాంగ్‌తో చర్చలు జరపడంతో పాటు సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి మరియు ఎంఎస్ఎంఈ రంగాలలో ఉన్న అవకాశాలపై చర్చలు సాగినట్టు మంత్రి తెలిపారు.

బుధవారం కోయంబత్తూరులో జరిగిన సదస్సులో గోల్డ్ రిఫైనరీ, దీని ద్వారా ఎంఎస్ఎంఈ రంగానికి లభించే అవకాశాలపై ఎమరాల్డ్ జ్యువెలరీ మేనేజింగ్ డైరెక్టర్ కె శ్రీనివాసన్‌తో చర్చించినట్టు మంత్రి తెలిపారు. అలాగే లీప్ గ్రీన్ సీఈవో దేవానంద్‌తో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్ట్ గురించి, జియాన్ ఛార్జింగ్ సీఈవో కార్తికేయన్ పళనిస్వామి, ఎల్‌జి బాలకృష్ణన్ అండ్ బ్రోస్ డైరెక్టర్ మిస్టర్ రాజీవ్ పార్థసారథి, తిరుప్పూర్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్ తిరుక్కుమారన్, సీగర్ గ్రూప్ ఎండీ రాధాకృష్ణన్‌తో చర్చలు విజయవంతమైనట్టు మంత్రి కొండపల్లి వెల్లడించారు.

ఈ సదస్సుల్లో పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ ఇండస్ట్రీస్, టూరిజం, హాస్పిటాలిటీ, తయారీ రంగం, పారిశ్రామిక క్లస్టర్లు, పోర్టులు, లాజిస్టిక్స్ మరియు ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులలో ఉన్న విస్తృత అవకాశాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున వివరించామని మంత్రి చెప్పారు. ఈ యేడాది నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్ 2026కు ఈ చెన్నై–కోయంబత్తూర్ సదస్సుల్లో ఎంతో సానుకూల స్పందన లభించడంపట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. పెట్టుబడిదారుల ఆసక్తిని వాస్తవ పెట్టుబడులుగా మార్చడానికి వేగవంతమైన అనుమతులు, ప్రాజెక్టుల పురోగతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణతో పాటు పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సదస్సుల్లో సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ జి సాంబశివరావు, సీఐఐ చెన్నై ఛైర్మన్ ఆర్‌వి చారి, కోయంబత్తూర్ జోన్ సీఐఐ ఛైర్మన్ వి నౌషాద్, వైస్ ఛైర్మన్ మహాలింగం రామస్వామి, ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో విశ్వ మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి దుర్గేష్‌తో ముత్యాలరాజు భేటీ

**పురాతత్వ శాఖ మరియు మ్యూజియం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరణ**

అమరావతి (చైతన్య రథం): రాష్ట్ర పురాతత్వ శాఖ మరియు మ్యూజియమ్స్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీనియర్ ఐఏఎస్ అధికారి రేవు ముత్యాలరాజు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ముత్యాలరాజుకు మంత్రి కందుల దుర్గేష్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్రంలో చారిత్రక, పురావస్తు ఆధారాలు, మ్యూజియంల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ముత్యాలరాజుతో మంత్రి దుర్గేష్ చర్చించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ప్రాచీన పురావస్తు సంపదను, చారిత్రక కట్టడాలను, శాసనాలను భవిష్యత్ తరాల కోసం భద్రపరిచి, పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మ్యూజియంలను ఆధునీకరించి, పర్యాటకులను ఆకట్టుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మన సంస్కృతి, చరిత్ర ప్రసిద్ధిని చాటిచెప్పే పురాతన కళాఖండాలను సంరక్షించడంలో ఆర్కియాలజీ శాఖ మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని తెలిపారు. మంత్రి దుర్గేష్ సూచనలపై కమిషనర్ రేవు ముత్యాలరాజు స్పందిస్తూ... రాష్ట్రంలోని పురావస్తు సంపద పరిరక్షణకు, మ్యూజియంల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకుసాగుతామని మంత్రి దుర్గేష్‌కి వివరించారు.



# ఉప్పాడ తీర రక్షణకు మద్రాస్ ఐఐటీతో ఎంవోయూ

- డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సమక్షంలో ఒప్పందం
- రక్షణ గోడ డిజైన్, డీపీఆర్, పర్యవేక్షణ బాధ్యతల అప్పగింత
- నవంబర్ నుంచి పనులకు శ్రీకారం
- రూ.323 కోట్లతో తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం

అమరావతి (చైతన్య రథం): సముద్ర కోతతో తీవ్రంగా దెబ్బతింటున్న ఉప్పాడ తీర ప్రాంత పరిరక్షణకు కీలక ముందడుగు పడింది. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణానికి అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్), సాంకేతిక పర్యవేక్షణ బాధ్యతలను మద్రాస్ ఐఐటీకి అప్పగిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయంలో అవగాహన ఒప్పందం కుదిరింది. రూ.323 కోట్లతో ఈ తీర ప్రాంత రక్షణ గోడ నిర్మాణం కానుంది. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్.డి.ఎమ్.ఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్.డి.ఎమ్.ఏ.) నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో అమలు చేసే ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఏపీ మారిటైమ్ బోర్డు బాధ్యతలు నిర్వహించనుంది. మద్రాసు ఐఐటీ నిపుణుల సాంకేతిక సూచనలు, శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా ఉప్పాడ తీర ప్రాంతానికి అనువైన రక్షణ చర్యలను రూపొందించనున్నారు. తీర కోత తీవ్రత, సముద్ర ప్రవాహాలు, అలల ప్రభావం తదితర అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా తీర రక్షణ నిర్మాణాల డిజైన్‌ను సిద్ధం చేయనున్నారు.

### నవంబర్‌నుంచి పనులు ప్రారంభం

మద్రాసు ఐఐటీతో అధికారిక ఒప్పందానికి సంబంధించిన ప్రక్రియ పూర్తికావడంతో, రానున్న నవంబర్ నుంచి ప్రాజెక్టు పనులను ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకార గ్రామాల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత ప్రాధాన్యత కలిగినదిగా అధికారులు భావిస్తున్నారు. కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎమ్ఎన్ హరేంధిర ప్రసాద్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ శరవణన్, పాడా డైరెక్టర్ ఎన్‌వి శివరామ ప్రసాద్,



మద్రాసు ఐఐటీ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్ఎ సన్యాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జివి రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

# 'మాషా అల్లా' స్కామ్‌పై 'సిట్'

- నమ్మించి మోసం చేశారంటూ బాధితులు గగ్గోలు
- బాధితులకు ధైర్యం చెబుతూ 'సిట్'కు ఆదేశించిన హోంమంత్రి
- వైసీపీ హయాంలో ఆమోదిత రోడ్లు, స్థలాల ఆక్రమణ
- తక్షణం చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తులు
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి హోంమంత్రి హామీ





మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజా సమస్యల స్వీకరణ కార్యక్రమానికి 'మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్' స్కాం బాధితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లాభాల పేరుతో తమను నమ్మించి కోట్ల రూపాయల కష్టార్జితాన్ని కొల్లగొట్టి మోసం చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత ఎదుట తమ ఆవేదనను వెళ్లగక్కారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుని, తమకు రావాల్సిన సొమ్మును తిరిగి ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. బాధితుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన హోంమంత్రి, కేసు తీవ్రతను బట్టి సమగ్ర విచారణ కోసం 'సిట్' ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. అమాయక ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కోట్లు దోచుకున్న ఎంతటి వారైనా చట్టం ముందు సమానులేనని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మోసపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని, బాధితులు ధైర్యంగా ఉండాలని సూచించారు.

కర్నూలు జిల్లా కల్లూరుకు చెందిన కురువ భాస్కర్ గ్రీవెన్స్‌లో అర్జీనిస్తూ.. 'శ్రీ గీతాలక్ష్మి నగర్-1కి చెందిన ఒక లేఅవుట్‌లో ప్రజావసరాలకు కేటాయించిన పబ్లిక్ యూసేజ్ ఏరియా, 40 అడుగుల రోడ్డును గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు అక్రమార్కులు కబ్జా చేశారు. ఆ స్థలాలను అక్రమంగా ప్లాట్లుగా మార్చి ఇతరులకు విక్రయిస్తున్నారు. ఈ అక్రమ కబ్జాలపై గతంలో పలుమార్లు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు 'పబ్లిక్ గ్రీవెన్స్' ద్వారా ఫిర్యాదులు చేసినప్పటికీ స్థానిక అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. వారిపై చర్యలు తీసుకోని ఆమోదిత ప్రజా స్థలాలను వారికి అప్పగించాలి" అని విజ్ఞప్తి చేశారు.

మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం మండలం అయ్యంబొట్లపల్లెకు చెందిన పత్తి లక్ష్మయ్య గ్రీవెన్స్‌లో అర్జీనిచ్చి.. సర్వే నంబర్లు 679, 657లోవున్న తన భూమిని కొందరు అక్రమార్కులు అధికారులతో కుమ్మక్కై అనైతికంగా వారి పేర్లపై మార్పించుకున్నారు. అంతేకాకుండా సదరు భూమిని తమ ఆధీనంలోకి తీసుకుని "ఈ భూమితో నీకు ఎలాంటి సంబంధం లేదు. ఒకవేళ చేనులోనికి వస్తే చంపేస్తా"మని బెదిరింపులకు దిగుతున్నారు. ప్రస్తుతం తనకు, కుటుంబానికి వారితో తీవ్ర ప్రాణభయం ఉంది. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలి" అని కోరాడు.

అనంతపురంకు చెందిన కొలిమి జావీద్ గ్రీవెన్స్‌లో అర్జీనిచ్చి.. కళ్యాణదుర్గం మండలం మానేరేవులోని సర్వే నంబర్ 674-2లోని 5.07 ఎకరాల డి-పట్టా భూమి తమ నాయనమ్మ మహబూబ్ బీ నుండి తండ్రి దస్తగిరికి సంక్రమించింది. ఈ భూమిని గత 30 ఏళు ్లగా సాగు చేసుకుంటున్నాం. సదరు భూమిపై కన్నువేసిన పెదనాన్న అల్లా బకాష్, బంధువు షేక్షావలి కలిసి నాయనమ్మ మహబూబ్ బీ పేరిట నకిలీ డెత్ సర్టిఫికేట్ తయారు చేయించి, అక్రమంగా మ్యుటేషన్ చేయించుకున్నారు.

ఈ అక్రమాలపై ఎమ్మార్వో, ఆర్డీఓలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోగా, కళ్యాణదుర్గం ఎమ్మార్వో సాకే భాస్కర్ నిందితులతో పక్షపాతంగా వ్యవహరిస్తూ వంతపాడుతున్నారు. పొలంలో వేసుకున్న అరటి పంటను జేసీబీతో కూల్చివేసి తగలబెట్టారు. దీనిని అడ్డుకోబోయిన తన సోదరుడుపై హత్యాయత్నానికి దిగినా స్థానిక అధికారులు సరైన చర్యలు తీసుకోలేదు. వారిపై చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం పల్లపాడుకు చెందిన సోమసుందరరావు గ్రీవెన్స్‌లో అర్జీనిచ్చి.. "తమ కుటుంబానికి యమర్రు గ్రామంలోని సర్వే నంబర్ 162-1లో రిజిస్టర్డ్ డాక్యుమెంట్ ప్రకారం 3.33 ఎకరాల భూమి ఉంది. అయితే, సర్వే నంబర్‌లోని తమ భూమిలో సుమారు 20 సెంట్లమేర తక్కువగా వస్తోంది. స్థానికంగా ఉన్న కొందరు వ్యక్తులు కాంక్రీట్ రాళ్ళు నాటి తమ భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా, మరో సర్వే నంబర్ 167-1లో కూడా 20 సెంట్ల భూమి తగ్గింది. దీనివల్ల తమ కుటుంబం తీవ్రంగా నష్టపోతోంది. తమ సమస్యను పరిష్కరించి.. తమ భూమి తమకు వచ్చేలా చర్యలు తీసుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు.

పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం పోతలచెరువుకు చెందిన పి వరలక్ష్మి గ్రీవెన్స్‌లో అర్జీనిస్తూ.. "తన భర్త పగడాల రవి భారత సైనిక దళ అనుబంధ సంస్థ అయిన జీఆర్ఈఎఫ్/ బీఆర్‌వోలో మణిపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడ నుండి జమ్మూ కాశ్మీర్‌కు బదిలీ కాగా, కుటుంబ సభ్యులను కలిసేందుకు 15 రోజుల సెలవుపై స్వగ్రామానికి బయలుదేరారు. గత జూలై 19, 2026న వెస్ట్ బెంగాల్‌లోని న్యూ జల్పాయ్‌గురి నుండి విజయవాడకు ట్రైన్ ఎక్కినట్లు రాత్రి 8:30 గంటల సమయంలో తనకు ఫోన్ చేసి తెలిపారు. అయితే జూలై 20న ఆయన ఇంటికి చేరుకోలేదు. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్‌గా మారింది. దీనిపై జూలై 24, 2026న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. జులై 19 నుండి ఇప్పటివరకు (సుమారు 24 రోజులు గడిచినా) తన భర్త ఆచూకీ తెలియలేదు. తన భర్తను సురక్షితంగా వెతికిపెట్టేలా చర్యలు తీసుకోనవాలని కోరారు.

అనంతపురం జిల్లా గుంతకల్ మండలం పులపటపల్లికి చెందిన ఆనంద్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. "తమ గ్రామంలో తన పేరిట 1.6 ఎకరాల భూమిని నియమానుసారం రిజిస్ట్రేషన్ చేయించుకున్నాను. అయితే, భూమి రిజిస్ట్రేషన్ పూర్తయి చాలాకాలం గడుస్తున్నా ఇంతవరకు తన భూమికి సంబంధించిన పట్టాదారు పాస్‌బుక్ మంజూరు కాలేదు. పాస్‌బుక్ కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయం చుట్టూ, మండల అధికారుల చుట్టూ అనేకసార్లు తిరిగినప్పటికీ ఫలితం లేకపోయింది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పాస్‌బుక్ ఇవ్వడం లేదు. అధికారులపై చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలి" అని కోరారు.

ఏలూరు జిల్లా నూజివీడు మండలం సుంకొల్లు గ్రామానికి చెందిన రామచంద్రరావు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. "తమ గ్రామంలోని సర్వే నంబర్ 162-1, 162-5లలో 2.53 ఎకరాల భూమిని కొనుగోలు చేశాను. అప్పట్లో తహశీల్దార్ ఆ భూమికి సంబంధించి పట్టాదారు పాస్‌బుక్ కూడా అందజేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొందరు స్థానిక నాయకులు కుట్రపూరితంగా వ్యవహరించి, తన భూమిని ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగించారు. దీనిపై జూలై 04, 2025న తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించినప్పటికీ సరైన సమాధానం రావడం లేదు. తహసీల్దార్, వీఆర్వోల చుట్టూ అనేకసార్లు తిరిగినా ఫలితం లేకపోయింది. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.

ఏలూరు జిల్లా కైకలూరు మండలం రాచపట్నం గ్రామానికి చెందిన జడపోలు లక్ష్మీకాంతం గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. "గతంలో 30 సెంట్ల భూమిని కొనుగోలు చేశాను. అందులో 15 సెంట్ల భూమిని అమ్మగా, మిగిలిన 15 సెంట్ల భూమికి సంబంధించి ఇప్పటివరకు పట్టాదారు పాస్‌బుక్ మంజూరు కాలేదు. గత 35 ఏళ్లుగా భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా జీవిస్తున్న తనను రెవెన్యూ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. స్థానిక సర్వేయర్ రమేష్, ఇతర అధికారులకు అనేకసార్లు విన్నవించినా, ఏలూరు కలెక్టరేట్‌లో కూడా అర్జీ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదు. ఎదుటివారికి కొమ్ముకాస్తూ తనకు పాస్‌బుక్ ఇవ్వకుండా తిప్పుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కంచర్ల అంజలి, సొంటి లక్ష్మి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. "పట్టణంలోని రత్నాల చెరువు ప్రాంతంలోని సర్వే నంబరు 134/85ఏలో 64 సెంట్ల స్థలం తమ తల్లికి కేటాయించబడింది. సదరు స్థలానికి సంబంధించి గతంలో ప్రభుత్వం విధించిన శిస్తు కూడా చెల్లించాం. అయినప్పటికీ, ఇప్పటివరకు ఆ భూమికి సంబంధించి తల్లి పేరుమీద పాస్‌బుక్‌గానీ, అడంగల్ నమోదుగానీ జరగలేదు. కాగా, తమ తల్లి 2024 ఆగస్టు 15న మరణించారు. తమ తల్లిదండ్రులకు తామే సంతానం. అంతేకాకుండా, తమ భర్తలు కూడా మరణించడంతో ప్రస్తుతం కుటుంబ పోషణ భారం కాగా, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దయచేసి 64 సెంట్ల భూమిపై హక్కులను కల్పించాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలిచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్‌లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ప్రజా వినతులపై బాధ్యతగా స్పందిస్తాం
- మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ బాధితులకు న్యాయం చేస్తాం
- డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక సిట్
- ఆర్థిక మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...
- కష్టార్జితాన్ని కొల్లగొట్టే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు
- హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టీకరణ
- డీఎస్సీయే నిర్వహించని వైసీపీకి ఆరోపించే హక్కు లేదని వ్యాఖ్య



మంగళగిరి (చైతన్య రథం): ప్రజలనుంచి వచ్చే ప్రతి వినతిని బాధ్యతగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ప్రజలు ఒక నమ్మకంతో తమ సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా పనిచేస్తామన్నారు. బుధవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలనుంచి మొత్తం 65 వినతులను స్వీకరించారు. ఒక్కొక్కరి సమస్యను అడిగి తెలుసుకుని, తక్షణ పరిష్కార సాధ్యమైన అంశాలపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు.

**మాషా అల్లా బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు**

మాషా అల్లా ఎంటర్‌ప్రైజెస్ వ్యవహారంలో డబ్బులు కోల్పోయామని పేర్కొంటూ పలువురు బాధితులు హోంమంత్రిని కలిసి తమ సమస్యను వివరించారు. ఈ వ్యవహారంలో దాదాపు 200 మంది బాధితులు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని హోంమంత్రి తెలిపారు. బాధితుల ఫిర్యాదులపై ప్రభుత్వం స్పందించిందని, వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపేందుకు డీసీపీ తిరుమలేశ్వరరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. బాధితుల ఫిర్యాదులను పరిశీలించి, దర్యాప్తులో వెల్లడయ్యే అంశాల ఆధారంగా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్మును నమ్మకంతో పెట్టుబడి పెట్టి నష్టపోయిన వారి ఆవేదనను ప్రభుత్వం అర్థం చేసుకుంటుందని హోంమంత్రి పేర్కొన్నారు. "బాధితులకు న్యాయం జరిగేలా అన్ని చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజల కష్టార్జితాన్ని మోసపూరితంగా కొల్లగొట్టే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో వివిధ రూపాల్లో ఆర్థిక మోసాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని హోంమంత్రి సూచించారు. అధిక లాభాలు, తక్కువ సమయంలో పెట్టుబడి రెట్టింపు వంటి ఆకర్షణీయమైన హామీలను గుడ్డిగా నమ్మవద్దన్నారు. ఏ సంస్థలోనైనా పెట్టుబడి పెట్టేముందు దాని చట్టబద్ధత, విశ్వసనీయతను నిర్ధారించుకోవాలని సూచించారు.

**చిన్నారి చదువుకు భరోసా...**

ప్రజా వినతుల కార్యక్రమంలో నాయుడుపేట ప్రాంతం నుంచి తన ఏడేళ్ల కుమార్తెతో వచ్చిన ఓ తండ్రి కుటుంబ పరిస్థితిని హోంమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. కుటుంబ పరిస్థితుల కారణంగా కుమార్తె చదువు కొనసాగించడం కష్టంగా ఉందని, తనకు కూడా స్థిరమైన ఉపాధి లేదని వివరించారు. వారి పరిస్థితిపై స్పందించిన హోంమంత్రి సంబంధిత జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. చిన్నారి చదువు ఆగకుండా అవసరమైన వసతి సదుపాయం ఉన్న హాస్టల్‌లో చేర్పించి విద్యను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తండ్రికి కూడా ఉపాధి అవకాశం కల్పించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను కోరారు. "ప్రజలు పార్టీ కార్యాలయానికి ఒక నమ్మకంతో వస్తున్నారు. వారి సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి, సాధ్యమైన పరిష్కారం చూపడం ప్రజా ప్రభుత్వ బాధ్యత" అని హోంమంత్రి పేర్కొన్నారు.

**అసెంబ్లీకి రాకుండా బయట ఆరోపణలేంటి?**

ప్రజా వినతుల స్వీకరణ అనంతరం హోంమంత్రి వంగలపూడి అనిత మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడంపై స్పందిస్తూ, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలకు శాసనసభలో తమ నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించే బాధ్యత ఉందన్నారు. గతంలో శాసనమండలిని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు అదే మండలికి తమ పార్టీ ప్రతినిధులను పంపుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు ప్రజలు ఎన్నుకున్న వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకపోవడం సమంజసం కాదన్నారు. "ఎమ్మెల్యేగా గెలవడం ఎంత గొప్ప బాధ్యతో, నియోజకవర్గ ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత. జగన్‌తోపాటు గెలిచిన వైసీపీ ఎమ్మెల్యేలకు కూడా సభలో ప్రజల తరపున మాట్లాడే అవకాశం ఉండాలి" అని అన్నారు. ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హోంమంత్రి స్పష్టం చేశారు. "రోడ్లపై ఆరోపణలు చేయడం కాదు. జగన్‌మోహన్‌రెడ్డికి ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి. వారి వద్ద ఉన్న ఆధారాలను సభ ముందు ఉంచాలి. ప్రతి అంశంపై చర్చించి సమాధానం చెప్పేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. అసెంబ్లీకంటే గొప్ప ప్రజాస్వామ్య వేదిక మరొకటి లేదు" అని వ్యాఖ్యానించారు.

**ఐదేళ్లలో డీఎస్సీ వేయనివారు ఇప్పుడు ఆరోపణలా?**

మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను హోంమంత్రి ఖండించారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో మెగా డీఎస్సీని పూర్తి చేయలేకపోయిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మెగా డీఎస్సీకి అత్యంత ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. డీఎస్సీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించామని, నియామకాలపై వచ్చిన ఆరోపణలకు సంబంధిత అధికారులు ఆధారాలతో వివరణ ఇచ్చారని పేర్కొన్నారు. అయినప్పటికీ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, సీబీఐ విచారణ జరపాలని వైసీపీ పదేపదే డిమాండ్ చేయడం రాజకీయ ప్రయోజనాల కోసం యువతలో అనుమానాలు సృష్టించే ప్రయత్నమేనన్నారు. "ఐదేళ్లు అధికారంలో ఉండి ఒక్క డీఎస్సీని కూడా పూర్తి చేయలేని వారు... ఇప్పుడు ఉద్యోగాలు పొందిన తర్వాత అక్రమాలు జరిగాయని ఆరోపించడం విడ్డూరంగా ఉంది. మీవద్ద ఆధారాలుంటే అసెంబ్లీకి వచ్చి చూపించండి. ప్రతి అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది" అని హోంమంత్రి అన్నారు.

**ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల కష్టాన్ని అవమానించొద్దు**

మెగా డీఎస్సీ నియామకాలన్నీ అక్రమమంటూ ఆరోపణలు చేయడం ద్వారా ప్రభుత్వం మీదనే కాకుండా, కష్టపడి ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల ప్రతిభపై కూడా అనుమానాలు కలిగిస్తున్నారని హోంమంత్రి పేర్కొన్నారు. ఐదేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ, కుటుంబాలకు దూరంగా ఉండి కోచింగ్ తీసుకుని, ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఎంతోమంది అభ్యర్థులు కష్టపడి ఉద్యోగాలు సాధించారని తెలిపారు. "ఎంతో కష్టపడి చదివి ఉద్యోగం సాధించిన యువత ఇప్పుడు తమ భవిష్యత్తుపై భరోసాతో ముందుకు వెళ్తున్నారు. మొత్తం డీఎస్సీ నియామకాలే అక్రమమని మాట్లాడితే వారి కష్టాన్ని, ప్రతిభను, వారి కుటుంబాల ఆనందాన్ని అవమానించినట్లే కాదా? రాజకీయాల కోసం యువత మనోభావాలతో ఆడుకోవద్దు" అని హితవు పలికారు. "నిందలు వేయడం, అలజడి సృష్టించడం కాకుండా జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా చర్చించాలి. ప్రజలకు వాస్తవాలు తెలుసు. ప్రభుత్వం ప్రతి అంశంపై సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉంది" అని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో చర్చించే దమ్ముందా?

## డీఎస్సీపై జగన్ తీరుకు ఎమ్మెల్సీ ఆలపాటి కౌంటర్

మంగళగిరి (చైతన్య రథం): మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైఖరిపై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "ఒకవైపు నిరుద్యోగుల గొంతుకోస్తూ, మరోవైపు నీతులు చెప్పడం జగన్‌కే చెల్లింది" అని విమర్శించారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వకుండా, ఏటా 'జాబ్ క్యాలెండర్' పేరిట 'జాబ్ లెస్ క్యాలెండర్' విడుదల చేసి యువతను తీవ్ర అయోమయంలోకి నెట్టారని మండిపడ్డారు. పరిశ్రమలను రాష్ట్రంనుంచి తరిమేసి, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే సీఎం నారా చంద్రబాబు నాయుడు మొదటి సంతకం మెగా డీఎస్సీపైనే చేశారని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం ఎన్నికల ముందు కేవలం 6,000 పోస్టులతో కంటితుడుపు నోటిఫికేషన్ ఇస్తే... కూటమి ప్రభుత్వం ఒక్కసారిగా 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేసి నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. కష్టపడి చదివి సొంత ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను, వైసీపీ నాయకులు అసభ్య పదజాలంతో అవమానించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేస్తాం" అనడం జగన్ అహంకారానికి నిదర్శనమని, అర్హత సాధించిన వారి జీవితాలతో ఆడుకోవడం ఎవరి వల్ల కాదని స్పష్టం చేశారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకోవడానికి ప్రతిపక్షం ఏకంగా 255 కేసులు వేసి ఆలస్యం చేయాలని కుట్రలు చేసిందని ఆరోపించారు. ఆ న్యాయపరమైన చిక్కులన్నింటినీ సమర్థవంతంగా ఎదుర్కొని, అత్యంత పారదర్శకంగా కంప్యూటర్ బేస్డ్ పరీక్షలు నిర్వహించి, కేవలం 150 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేసిన ఘనత యువనేత నారా లోకేష్‌ది, కూటమి ప్రభుత్వానిదని కొనియాడారు. గతంలో మేము ప్రభుత్వంలో ఉన్నప్పుడు 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చాం. కానీ, ఈ రోజు రికార్డు స్థాయిలో 150 రోజుల్లోనే మెగా డీఎస్సీ పూర్తి చేసి నిరుద్యోగ యువతకు భరోసా కల్పించింది ఈ కూటమి ప్రభుత్వమని స్పష్టం చేశారు.

వైసీపీ అధినేత జగన్‌రెడ్డి సాగిస్తున్నది రాజకీయ పోరాటం కాదని, ఆధారాలు లేని వీధి నాటకాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. యువతను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు వైసీపీ కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. వైసీపీ ఎమ్మెల్సీ రెండుసార్లు వేసిన పిల్‌పై కోర్టు ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేకపోయారని ఎద్దేవా చేశారు. అసలు ఆధారాలు ఉన్నాయా? ఏ ఒక్క అభ్యర్థ అయినా ఫిర్యాదు చేశారా? అని న్యాయస్థానం నిలదీస్తే వైసీపీ దగ్గర బదులు లేకపోయిందన్నారు. స్పోర్ట్స్ కోటా సహా ప్రతీ ప్రక్రియను సుప్రీంకోర్టు ఇచ్చిన హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ నిబంధనలకు అనుగుణంగానే పారదర్శకంగా పూర్తి చేశామని స్పష్టం చేశారు. ఏ ఆధారమూ లేకుండా రోజూ మాట్లాడటం జగన్ అజ్ఞానానికి నిదర్శనమన్నారు. నిజంగా నీకు చిత్తశుద్ధి, ధైర్యం ఉంటే ఈనెల 17నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాలకు రా. కూటమి పాలనపై చర్చించడానికి మేము సిద్ధంగా ఉన్నాం. సభకు రాకుండా పారిపోవడం నీకు అలవాటుగా మారిందని జగన్‌కు సవాల్ విసిరారు. ఏ విధమైన పొరపాటూ లేకుండా, పూర్తి ప్రతిభ ఆధారంగా 16,347 ఉద్యోగాలు సాధించిన నిరుద్యోగ యువతను అవమానించినందుకు జగన్ రెండు చేతులెత్తి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



పారదర్శకంగా జరిగిన నియామకాలపై లేనిపోని నిందలు వేయడం జగన్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మీకు ఎవరు రాజకీయాలు నేర్పారో తెలియదు కానీ, ఈ తరహా వ్యాఖ్యలతో మీరేం సాధించాలనుకుంటున్నారో అర్థం కావడం లేదన్నారు. తాను చూసిన రాజకీయ నాయకుల్లో జగన్‌మోహన్‌రెడ్డి అంతటి "రాజకీయ అజ్ఞాని" మరొకరు లేరని స్పష్టం చేశారు. ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ ప్రజలను, నిరుద్యోగ యువతను మిస్‌లీడ్ చేయడం ఇప్పటికైనా ఆపాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ హితవు పలికారు.


# డిప్యూటీ సీఎంను కలిసిన మంత్రి నారాయణ

- రాజధాని ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి ఆహ్వానం
- ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని ప్రస్తావించిన పవన్
- అటవీ శాఖ ఆధ్వర్యంలో వేడుక నిర్వహిస్తున్నట్టు వెల్లడి
- కేంద్ర మంత్రికి ఆహ్వానం అంశాన్ని ప్రస్తావించిన పవన్

అమరావతి (చైతన్య రథం): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ బుధవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. గురువారం రాజధాని అమరావతి వేదికగా జరగనున్న సీడ్ యాక్సెస్ రోడ్డు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాస సముదాయాలు తదితర అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రెండు స్టీల్ బ్రిడ్జిలు, సీడ్ యాక్సెస్ రోడ్డు ఫేజ్-2 పనుల ప్రారంభోత్సవం జరగనున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. రాజధాని అమరావతిలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులను వేగంగా ముందుకు తీసుకెళుతున్నందుకు నారాయణను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించారు. అయితే, గురువారం విశాఖపట్నం వేదికగా ముందుగా నిర్ణయమైన జాతీయ స్థాయి ప్రపంచ ఏనుగుల దినోత్సవ వేడుకల్లో తాను పాల్గొనాల్సి ఉందని పవన్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో జాతీయస్థాయి కార్యక్రమం నిర్వహించాలన్న తన అభ్యర్థన మేరకు కార్యక్రమాన్ని విశాఖలో నిర్వహిస్తున్నారని, తన ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ సింగ్ యాదవ్ హాజరుకానున్న విషయాన్ని మంత్రి నారాయణ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్రంలో జాతీయస్థాయి కార్యక్రమం నిర్వహించడం ఇదే ప్రథమమని చెప్పారు. రాజధాని అమరావతి అభివృద్ధిలో సీడ్ యాక్సెస్ రోడ్డు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్న డిప్యూటీ సీఎం, ఈ ప్రాజెక్టు ద్వారా రాజధాని అభివృద్ధి మరింత వేగం పుంజుకోవాలని ఆకాంక్షించారు.



# వర్క్ షెడ్యూల్‌కు అర్థమేముంది?



- పుష్కర ఎత్తిపోతల పైప్‌లైన్ పనుల్లో జాప్యంపై మంత్రి నిమ్మల ఆగ్రహం
- షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తికాకుంటే చర్యలు తప్పవన్న మంత్రి

విజయవాడ (చైతన్య రథం): పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనుల పురోగతిపై బుధవారం రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అధికారులు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమీక్షలో పోలవరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు, ఈఎన్సీ నరసింహమూర్తి, ఈఈలు, కాంట్రాక్టు ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఇటీవల పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులకు సంబంధించి సీఎం చంద్రబాబుకు అధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు వర్క్ షెడ్యూల్ అందజేశారని మంత్రి తెలిపారు. ఆ షెడ్యూల్ ప్రకారం పనులు జరుగుతున్నాయా? లేదా? అన్నదానిపై ఇరిగేషన్ అడ్వైజర్ వెంకటేశ్వరరావు క్షేత్రస్థాయిలో పరిశీలించి మంత్రికి నివేదిక అందించారు. వర్క్ షెడ్యూల్ ఇచ్చి కూడా పనుల్లో వేగం పెంచకపోవడం ఏమిటని మంత్రి అధికారులను ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అత్యంత కీలకమైన పనుల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టు ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రజాప్రయోజనాలకు నష్టం కలిగించే విధంగా కాంట్రాక్టర్లు వ్యవహరిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపించేందుకు కూడా వెనుకాడవద్దని కలెక్టర్, ఎస్పీలను ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహించిన ఈఈకి మెమో జారీ చేయాలని ఈఎన్సీ నరసింహమూర్తిని మంత్రి ఆదేశించారు. ఇకపై పుష్కర లిఫ్ట్ స్కీం పైప్‌లైన్ పనులపై ప్రతిరోజూ వర్క్ ప్రోగ్రెస్ రిపోర్ట్ అందించాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఎల్‌నినో వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రతి నీటి చుక్కను ఎంతో జాగ్రత్తగా కాపాడుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని మంత్రి తెలిపారు. గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు పుష్కర ఎత్తిపోతల పథకం పనులు కీలకమని పేర్కొన్నారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకు గోదావరి జలాలు వెళ్లేలా నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో, పుష్కర ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి నిమ్మల రామానాయుడు అధికారులను, కాంట్రాక్టు ఏజెన్సీలను ఆదేశించారు.

# జనం ఏడుపే జగన్‌కు ఆనందం

- ఆయనదొక తీవ్రమైన మానసిక వైకల్యం
- ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఎద్దేవా

మంగళగిరి (చైతన్య రథం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, నిరుద్యోగులకు జరుగుతున్న మంచిని చూసి ఓర్వలేక వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి తీవ్ర అసూయతో రగిలిపోతున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం నారా చంద్రబాబు మొదటి సంతకం మెగా డీఎస్సీ పైనే చేశారని గుర్తు చేశారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసి, 335 కేసులు వేసి అడ్డుకోవాలని చూసినా... విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో 16,347 పోస్టుల నియామకాలను అత్యంత పారదర్శకంగా పూర్తి చేశామని కొనియాడారు. లోకేష్ విద్యాశాఖలో తెచ్చిన విప్లవాత్మక సంస్కరణల వల్ల ఈ ఒక్క ఏడాదే 1,06,000 మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలను వదిలి ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని గుర్తు చేశారు. "మహేష్‌బాబు సినిమాల్లో విలన్ పాత్రలకు ఉన్నట్లు జగన్‌కు కూడా ఒక రకమైన మానసిక వైకల్యం ఉంది. ఎవరైనా బాధపడి ఏడుస్తుంటే చూసి ఆనందించడం ఆయన నైజం. గతంలో చేసిన ఓదార్పు యాత్రలు కూడా బాధలో ఉన్న వారి ఏడుపులు విని ఆనందించడానికే చేశారేమోనని ఇప్పుడు ఆయన ప్రవర్తన చూస్తుంటే స్పష్టమవుతోంది" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏ మంచి జరిగినా, ప్రజలు సంతోషంగా ఉన్నా జగన్‌కు అస్సలు నచ్చదని మండిపడ్డారు. రిక్రూట్‌మెంట్ పూర్తయి, ఉపాధ్యాయులు పాఠశాలల్లో



చేరి ఏడాది కావస్తున్నా, అద్భుతమైన ఫలితాలు వస్తుంటే కడుపుమంటతో లేనిపోని అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా ప్రశ్నించే హక్కు ఉన్నప్పటికీ విమర్శల్లో సహేతుకత ఉండాలని హితవు పలికారు. విచక్షణ కోల్పోయి జగన్, ఆయన పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్న తీరును చూసి రాష్ట్ర ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని అన్నారు. 1,06,000 మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరడం, 16,347 మందికి ఉద్యోగాలు రావడం కూటమి ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం. ప్రజలకు మంచి జరుగుతుంటే చూసి తట్టుకోలేక అబద్ధాలాడుతున్న జగన్‌ను చూసి సమాజం నవ్వుకుంటోందని ఎద్దేవా చేశారు.

విద్యాశాఖలో ఎన్నడూ లేని విధంగా అద్భుతమైన సంస్కరణలు తీసుకొస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తున్న విద్యా మంత్రి నారా లోకేష్ రాజీనామా డిమాండ్ చేయడానికి వైసీపీ నాయకులకు సిగ్గుండాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో బూట్లు, కోడిగుడ్లపైనా ఫోటోలు వేసుకున్న విషయాన్ని గుర్తుచేస్తూ... ఈ రోజు లోకేష్ ఒక్క బ్రోచర్, పుస్తకం లేదా బ్యాగ్‌పై కూడా తన లేదా సీఎం ఫోటో లేకుండా, బడుల్లో రాజకీయాలకు తావులేకుండా నాణ్యమైన 'సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్' అందిస్తున్నందుకు రాజీనామా చేయాలా? అని ప్రశ్నించారు. ఎంతమంది పిల్లలున్నా 'తల్లికి వందనం' అందరికీ వర్తింపజేస్తున్నందుకు.. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం సన్నబియ్యంతో పోషకాహారం అందిస్తున్నందుకు.. ఇంటర్మీడియట్ విద్యార్థులకూ మధ్యాహ్న భోజనం వర్తింపజేస్తున్నందుకు.. ప్రతి నియోజకవర్గానికి 'లీప్' మోడల్ పాఠశాలలు, పిల్లలు ఒత్తిడి లేకుండా చదివేలా 'నో బ్యాగ్ డే' అమలు చేస్తున్నందుకు.. ప్రభుత్వ బడుల్లో ప్రతిభ చూపిన ఉపాధ్యాయులను సింగపూర్ పంపించి శిక్షణ ఇప్పించినందుకు.. ఎందుకు లోకేష్ రాజీనామా చేయాలని నిలదీశారు. కష్టపడి ఉద్యోగాలు సాధించిన డీఎస్సీ-2025 టీచర్ల ఆత్మగౌరవాన్ని వైసీపీ నాయకులు దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. దీనికి నిరసనగా కర్నూలులోని కొండారెడ్డి బురుజు నుంచి జిల్లా పరిషత్ ఆఫీస్ వరకు 5,000 మంది ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టి జగన్ వైఖరిపై తిరగబడ్డారని గుర్తుచేశారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు తగ్గించినా జగన్‌కు బుద్ధి రాలేదు. ఇప్పటికైనా అవాస్తవాలు మాట్లాడటం ఆపకపోతే... నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబాలు వైసీపీ నాయకులను తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కంచర్ల హెచ్చరించారు.

వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డికి 'జెన్ జీ' అంటే కనీస అవగాహన కూడా లేదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. నిరసన దీక్షల పేరుతో వృద్ధులను కూర్చోబెట్టి 'జెన్ జీ వార్' అని ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందని వ్యాఖ్యానించారు. 1997-2012 మధ్య జన్మించిన యువతను 'జెన్ జీ' అంటారని, వైసీపీ ఆకృత్యాలను ముందే గ్రహించడం వల్లే 2023లోనే పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా తాము గెలిచామని, 2024 ఎన్నికల్లో వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని గుర్తుచేశారు. జగన్ పార్టీలో ఉన్నది 'జెన్ జెడ్' కాదని, గత ఐదేళ్లలో గంజాయికి అలవాటుపడిన 'గంజాయి బ్యాచ్' అని ధ్వజమెత్తారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో యువత భవిష్యత్తును నాశనం చేస్తే... నేడు నారా లోకేష్ విద్యాశాఖ మంత్రిగా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచుతూ, ఐటీ మంత్రిగా కొత్త పరిశ్రమలు, కంపెనీలను రాష్ట్రానికి తీసుకొస్తూ 'జెన్ జీ', 'జెన్ ఆల్ఫా'ల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నారని కొనియాడారు. వైసీపీ చేసిన నిరాధారమైన ఆరోపణలను కోర్టులు తీవ్రంగా తప్పుపట్టాయని, మొట్టికాయలు వేశాయని గుర్తు చేశారు. వైసీపీ తొత్తులు తప్ప ఒక్క నిజమైన నిరుద్యోగి లేదా డీఎస్సీ అభ్యర్థి జగన్ వెంట రాలేదన్నారు. ఈనెల 17నుంచి ప్రారంభమయ్యే శాసనసభ, శాసన మండలి సమావేశాలకు జగన్, ఆయన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వానికి ఏ అంశంపైనైనా సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం, నిజాయితీ ఉన్నాయని స్పష్టం చేశారు. చవకబారు ఆరోపణలు, ప్రేలాపనలు మాని అసెంబ్లీకి వచ్చి సద్విమర్శలు చేయడం నేర్చుకోండి. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోకపోతే నిరుద్యోగులు, ప్రజలు రోడ్డుపై తరిమి తరిమి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

# ఓటర్ల ఇబ్బందులు తొలగించండి

- ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్‌పై టీడీపీ నేతల వినతి
- 'సర్'లో పారదర్శకతకు ఈసీకి టీడీపీ ఆరు సూచనలు



అమరావతి (చైతన్య రథం): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు, ఏపీఈడబ్ల్యుఐడీసీ చైర్మన్ ఎస్ రాజశేఖర్ ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యాచరణకు సంబంధించి ఎన్నికల కమిషన్‌ను కలిశారు. ఈ ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, ఎన్నికల ప్రక్రియలో ఓటర్లకు ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు ఫీల్డ్‌స్థాయి అధికారులకు అనుకూల సూచనలు ఇవ్వవలసిన అవసరమైన ఆరు అంశాలపై కమిషన్‌కు వినతిపత్రం సమర్పించారు.

### వ్యక్తిగత హాజరు (పర్సనల్ అపియరెన్స్) అవసరమున్న సందర్భాలలో..

ఇతర రాష్ట్రాలలో సాధారణంగా లాజికల్ డిస్క్రెపెన్సీ ఉండే సందర్భాల్లో, ఓటర్లను ఏఈఆర్‌వో/ ఈఆర్‌వో ముందు వ్యక్తిగతంగా హాజరు కావడం నుండి మినహాయించి, ఆ విషయాన్ని బీఎల్‌వో ద్వారా క్షేత్రస్థాయి ధ్రువీకరణకు అప్పగించడం జరుగుతుంది. కేవలం సందేహాస్పద లేదా అత్యవసర పరిస్థితులలోనే ఏఈఆర్‌వో ముందు వ్యక్తిగత హాజరు కోరతారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లో అనేక సందర్భాల్లో పెద్ద సంఖ్యలో ఓటర్లను వ్యక్తిగత హాజరు కోసం కోరుతున్నట్టు తెలుస్తోంది. కాబట్టి అవసరమైన సందర్భాల్లో మాత్రమే వ్యక్తిగత హాజరును తప్పనిసరి చేసి, ఇతర సాధారణ సందర్భాలలో బీఎల్‌వో ద్వారా ధ్రువీకరణ జరగాలని సూచనలు ఇవ్వాలని కోరారు.

### డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ నుండి పేర్ల తొలగింపు, స్పీకింగ్ ఆర్డర్

సచివాలయ నోటీసు మరియు విధాన ప్రక్రియలను అనుసరించకుండా ఏ ఓటరు పేరు కూడా డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ నుండి తొలగించకూడదు. తొలగింపు ఆదేశాలు నమోదైన తర్వాత ఒక్కో వ్యక్తిగత కేసులో స్పీకింగ్ ఆర్డర్ ఇచ్చి, ఆ ప్రతిని సంబంధిత ఓటరుకు అందజేయాలి. ఈ నిబంధనలను అన్ని ఈఆర్‌వో/ఏఈఆర్‌వోలకు స్పష్టంగా తెలియజేయాలని కోరారు.

### ఏఎస్‌డీడీ జాబితాల పంపిణీ, ప్రదర్శన

ఏఎస్‌డీడీ (గైర్హాజరు, వలస వెళ్లిన వారు, మరణించిన, డుప్లికేట్) ఓటర్ల జాబితాలను సంబంధిత బీఎల్‌వో ద్వారా బీఎల్ఏకు సరైన రసీదుతో పంపిణీ చేయాలి. అంతేకాక, ఈ జాబితాలను గ్రామ పంచాయతీ/వార్డ్ కార్యాలయంలో నోటీసు బోర్డులపై ప్రదర్శించి, ఓటర్లు మరియు రాజకీయ పార్టీల ప్రతినిధులు సమాచారాన్ని ధ్రువీకరించి, ఏవైనా తప్పులు ఉంటే అధికారులకు తెలియజేసే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

### కొత్త ఓటర్ల నమోదు

01.07.2026 నాటికి అర్హత పొందిన యువతను గుర్తించి బీఎల్‌వోలు కొత్త ఓటర్ల నమోదును చురుకుగా చేపట్టాలని, అలాగే ఓటర్లు మరిచిపోకుండా వివిధ మీడియా వనరుల ద్వారా ప్రచార చర్యలు తీసుకోవాలని సూచించారు.

### వ్యక్తిగత హాజరు సందర్భంలో పొడవైన క్యూలు నివారణ

వ్యక్తిగత హాజరు అవసరమయ్యే చోట్ల, ఎక్కువ సమయం వృథా కాకుండా తగిన ఏర్పాట్లు చేసి క్యూలు, జాప్యాన్ని తగ్గించాలని కోరారు. సమయ నియంత్రణ/ప్రమాణీకరణ లేదా ఇతర అనుకూల విధానాలను పాటించి, ప్రజలు తగిన సమయంలో తమ ధ్రువీకరణను పూర్తి చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్‌లో తప్పుగా అప్‌లోడ్ చేసిన డాక్యుమెంట్ సవరణ

సీఈవో పోర్టల్‌లో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ సెక్షన్‌లో తప్పు డాక్యుమెంట్ అప్‌లోడ్ అయిన అంశాన్ని ప్రస్తావిస్తూ, ఆ తప్పు డాక్యుమెంట్‌ను తొలగించి సరైన డాక్యుమెంట్‌ను అప్‌లోడ్ చేయాలని కోరారు. సర్ ప్రక్రియ అత్యంత కీలకమైనదని, ప్రజా విశ్వాసాన్ని పరిరక్షించేందుకు పై సూచనలన్నింటినీ ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వోలు అందరూ సమానంగా అమలు చేయాలని పరుచూరి అశోక్‌బాబు, ఎస్ రాజశేఖర్ కోరారు.



## ఈ నెలాఖరులో వెలుగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు

- నల్లమల సాగర్‌కు నీరు.. ప్రారంభోత్సవ ఏర్పాట్లపై మంత్రుల సమీక్ష
- నిర్వాసితులకు పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి

అమరావతి (చైతన్య రథం): వెలుగొండ ప్రాజెక్టును ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై మంత్రులు డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, ఆనం రామనారాయణరెడ్డి, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్ బుధవారం జూమ్ వేదికగా సమీక్ష నిర్వహించారు. మార్కాపురం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, టీడీపీ ఇన్‌చార్జ్‌లతో ప్రాజెక్టు ప్రారంభోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. వెలుగొండ ద్వారా నల్లమల సాగర్‌కు కృష్ణా జలాలు అందించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి ప్రకాశం పశ్చిమ ప్రాంత ప్రజల 30 ఏళ్ల కలను చంద్రబాబు సాకారం చేస్తున్నారని మంత్రులు పేర్కొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఇప్పటికే తొలి విడతగా రూ.318 కోట్లు చెల్లించామని, మిగిలిన 4,761 కుటుంబాలకు ఇవ్వాల్సిన రూ.600 కోట్లలో త్వరలో రూ.300 కోట్లు జమ చేస్తామని వెల్లడించారు. మిగిలిన రూ.300 కోట్లను కూడా త్వరలో చెల్లిస్తామని చెప్పారు. నిర్వాసిత గ్రామాలను త్వరితగతిన ఖాళీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ఏపీ పారిశ్రామిక వికాసంపై ప్రపంచ విశ్వాసం!

భారతదేశ తూర్పు తీరంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నేడు సరికొత్త పారిశ్రామిక పునరుజ్జీవనానికి వేదికైంది. అపారమైన వనరులు, అనుకూలమైన భౌగోళిక పరిస్థితులు, పారదర్శకమైన పారిశ్రామిక విధానాలతో ముందుకు సాగుతున్న ఏపీవైపు ఇప్పుడు యావత్ ప్రపంచం ఆసక్తిగా చూస్తోంది. కేవలం దేశీయ దిగ్గజాలే కాకుండా గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ దిగ్గజాలు సైతం ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి ఉత్సాహం చూపుతుండటం గమనార్హం. ఈ పరిణామం రాష్ట్ర ఆర్థిక రూపురేఖలను మార్చనున్నది. పటిష్టమైన పాలసీ ఫ్రేమ్‌వర్క్, పెట్టుబడిదారుల అనుకూల వాతావరణంతో తయారీ రంగం, మౌలిక సదుపాయాల ఆధారిత పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలవడంతో పాటు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం మారిపోయింది. 2024 జూన్ నుంచి ప్రభుత్వం వివిధ సంస్థలతో రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకుంది. వాటి ద్వారా సుమారు 24 లక్షల ఉద్యోగాలు లభించనున్నాయి. దేశానికి వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో 25.3 శాతం రాష్ట్రానికి రావడం అంటే ఏపీ 'బ్రాండ్ వాల్యూ'కు నిదర్శనమనే చెప్పాలి. 2023-24లో కేవలం 92.13 మిలియన్ డాలర్లుగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఎఫ్‌డీఐ 2025-26లో 608.59 మిలియన్ డాలర్లకు చేరడం సాధారణ పెరుగుదల కాదు... పెట్టుబడిదారుల్లో రాష్ట్రంపై మారిన విశ్వాసానికి ఒక సూచికగా చెప్పాలి.

### ప్రభుత్వంపై పారిశ్రామికవేత్తల నమ్మకం

ఏపీపై పెరిగిన ప్రపంచ విశ్వాసం అనడానికి ఎఫ్‌డీఐ గణాంకాలే సాక్ష్యం. పెట్టుబడులు ఎక్కడికి వస్తాయి? అవకాశాలు ఉన్న చోటికి. వాటిని సాకారం చేసే ప్రభుత్వంపై నమ్మకం ఉన్న చోటికీ వస్తాయి. పారిశ్రామికవేత్తలకు భూమి కావాలి, మౌలిక వసతులు, విద్యుత్, రవాణా కావాలి, అనుమతులు వేగంగా రావాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రభుత్వ విధానాల్లో స్థిరత్వం కావాలి. ఈ అంశాలు అనుకూలంగా ఉన్నప్పుడే విదేశీ పెట్టుబడిదారులు ఒక రాష్ట్రంవైపు చూస్తారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కనిపిస్తున్న మార్పును ఈ కోణంలోనే చూడాలి. గత ఐదేళ్లు పెట్టుబడుల కోసం ఎదురుచూసిన ఏపీ ఇప్పుడు పెట్టుబడులను ఆకర్షించే రాష్ట్రంగా మారిందని చెప్పడానికి ఈ గణాంకాలే సాక్ష్యం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌కు వచ్చిన ఎఫ్‌డీఐ ఈక్విటీ ఇన్‌ఫ్లో కేవలం 92.13 మిలియన్ డాలర్లు. అదే 2024-25లో 233.14 మిలియన్ డాలర్లకు పెరిగింది. తర్వాత 2025-26లో ఏకంగా 608.59 మిలియన్ డాలర్లకు చేరింది. కేంద్ర పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య శాఖ గణాంకాల ప్రకారం 2025-26లో ఏపీకి వచ్చిన ఎఫ్‌డీఐ విలువ రూ.5,354.40 కోట్లకు చేరింది.

### జగన్ హయాంలో పారిశ్రామికవేత్తలపై వేధింపులు

గత ఐదేళ్లూ జగన్ ప్రభుత్వం పారిశ్రామికవేత్తలను వేధింపులకు గురిచేసింది. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం వివిధ సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసి, వాటికి కేటాయించిన భూములను వెనక్కి లాక్కుని అనేక పరిశ్రమలను రాష్ట్రం నుంచి తరిమేసింది. పారిశ్రామికవేత్తలపై రాజకీయ కక్షలకు పాల్పడింది. ఆ కారణంగా రాష్ట్రంవైపు చూడాలంటేనే పెట్టుబడిదారులు హడలిపోయారు. పాలనా వికేంద్రీకరణ పేరుతో రాజధాని అమరావతిని ధ్వంసం చేయడం వంటి చర్యలతో పెట్టుబడిదారులను భయాందోళనలకు గురిచేసింది. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు రాష్ట్రం వైపు చూసేవారే లేకుండాపోయారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించడంలో పెద్ద రాష్ట్రాలతో పోటీపడే రాష్ట్రాన్ని 2019 అక్టోబరు నుంచి 2023 సెప్టెంబరు మధ్య 13వ స్థానానికి దిగజార్చారు. దావోస్ వెళ్లినా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చేవారు లేక చివరకు దేశీయ కంపెనీలు అదానీ, అరబిందో, గ్రీన్కో వంటి సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని దావోస్ నుంచి తెచ్చిన పెట్టుబడులుగా చెప్పుకున్నారు. ఐదేళ్ల జగన్ పారిశ్రామిక విధ్వంసాన్ని అధిగమించి, కోల్పోయిన బ్రాండ్ వాల్యూను పునరుద్ధరించడంపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. పారిశ్రామికవేత్తలతో నిరంతరం సంప్రదింపులు జరిపి... దేశ, విదేశాలు తిరిగి పెట్టుబడిదారులను ఒప్పించి, మెప్పించి వారి అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణాన్ని పునరుద్ధరించింది కూటమి ప్రభుత్వం.

### ఏపీపై పెట్టుబడిదారుల దృష్టి

అందువల్లనే కేవలం రెండు ఆర్థిక సంవత్సరాల వ్యవధిలోనే విదేశీ పెట్టుబడులు 92.13 మిలియన్ డాలర్ల నుంచి 608.59 మిలియన్ డాలర్లకు చేరడం అంటే సుమారు 6.6 రెట్లకు పెరిగింది. ఒక రాష్ట్రంపై పెట్టుబడిదారుల దృష్టి ఏపీ పడటానికి కారణం పాలనా విధానం, పారిశ్రామిక వాతావరణం, అనుమతు ల వేగం, మౌలిక వసతులు, పెట్టుబడిదారులతో ప్రభుత్వ సంబంధాలు. పెట్టుబడుల వేగం 2024-25లో పెరుగుదల ప్రారంభమై 2025-26లో మరింత వేగం అందుకుంది. ఇది కేవలం డాలర్ల లెక్క కాదు పెట్టుబడిదారుల నిర్ణయాల్లో విశ్వాసం అత్యంత కీలకం.

ఒక రాష్ట్రంలో పెట్టుబడి పెట్టిన సంస్థకు భవిష్యత్తులో విధానాలు మారుతాయా? అనుమతులు ఆలస్యమవుతాయా? మౌలిక వసతులు అందుబాటులో ఉంటాయా? ప్రభుత్వం పెట్టుబడిదారుడి సమస్యలను పరిష్కరిస్తుందా? అనే అంశాలపై పెట్టుబడిదారులకు కావాల్సింది పాలనా విశ్వసనీయత. ఆంధ్రప్రదేశ్ తన భౌగోళిక స్థానాన్ని పెట్టుబడుల ఆకర్షణకు ఉపయోగించుకుంటుంది. తూర్పు తీరంలో సుదీర్ఘ సముద్ర తీరం, పోర్టుల సామర్థ్యం, చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌కు సమీపం, హైదరాబాద్-చెన్నై-బెంగళూరు మార్కెట్ల మధ్య అనుసంధానం, విశాఖపట్నం వంటి పారిశ్రామిక నగరం. ఇవన్నీ రాష్ట్రానికి సహజమైన ప్రయోజనాలు. 2025-26లో వచ్చిన పెట్టుబడుల్లో లోహ పరిశ్రమలు, ఆహార శుద్ధి, సిమెంట్ ఉత్పత్తులు వంటి రంగాలు ప్రముఖంగా నిలిచాయి. ఒక పరిశ్రమ ఏర్పడితే ప్రత్యక్ష ఉద్యోగాలొస్తాయి. దానికి అనుబంధంగా రవాణా, గోదాములు, హోటళ్లు, చిన్న పరిశ్రమలు, సేవా సంస్థలు పుట్టుకొస్తాయి. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అవసరం ఏర్పడుతుంది. స్థానిక వ్యాపారులకు కొత్త మార్కెట్లు వస్తాయి. అందువల్ల పెట్టుబడి, పరిశ్రమ, ఉద్యోగం, ఆదాయం, స్థానిక వ్యాపారం, గ్రామీణ ఆర్థిక చైతన్యం పెరుగుతుంది. కోట్ల పెట్టుబడులు రావడంతో పాటు ఎన్ని పరిశ్రమలు భూమిపై ల్యాండ్ అయ్యాయి? ఎన్ని ఉద్యోగాలు సృష్టించబడ్డాయి? అన్నది కూడా ప్రధానం. కావున 2025-26లో 608.59 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు ఏపీకి వచ్చినందుకు సంతోషించాల్సిందే. దీనిని ప్రారంభంగా మాత్రమే చూడాలి. 608 మిలియన్ డాలర్లను 1 బిలియన్ డాలర్‌కు, ఆ తర్వాత అనేక బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే పారిశ్రామిక వాతావరణాన్ని ప్రభుత్వం నిర్మించాలి. రాష్ట్రంలో సహజ వనరులు ఉన్నాయి. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. పోర్టులు ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తి ఉంది. యువ మానవవనరులు ఉన్నాయి.

దేశంలోని ప్రధాన ఆర్థిక కేంద్రాలకు భౌగోళిక అనుసంధానం ఉంది. ఈ బలమైన అంశాలకు సమర్థవంతమైన పాలన తోడైతే రాష్ట్ర పారిశ్రామిక పటాన్ని పూర్తిగా మార్చవచ్చు. పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడించిన గణాంకాలు ఇప్పుడు కూటమి ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచాయి. వచ్చిన పెట్టుబడులను పరిశ్రమలుగా మార్చాలి. పరిశ్రమలను ఉద్యోగాలుగా మార్చాలి. ఉద్యోగాలను కుటుంబాల ఆదాయంగా మార్చాలి. ఆ ఆదాయంతో పల్లెల్లో ఆర్థిక చైతన్యం వెల్లివిరియాలి.

- నీరుకొండ ప్రసాద్




రాష్ట్రంలో రైతు సంక్షేమం, వినియోగదారుల రక్షణ, పారదర్శక ప్రజా పంపిణీ వ్యవస్థ అనే మూడు ప్రధాన లక్ష్యాలతో కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో పౌరసరఫరాల శాఖలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆహార-పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజకు గౌరవం దక్కేలా, వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందేలా, సాంకేతికత ఆధారంగా పారదర్శక వ్యవస్థను నిర్మించే దిశగా ప్రభుత్వం సమర్ధవంతంగా ముందుకు సాగింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విధానం నుంచి రేషన్ పంపిణీ వరకు ప్రతి అంశంలోనూ సంస్కరణలు తీసుకొచ్చి దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే విధంగా శాఖ పనితీరును తీర్చిదిద్దింది.





# రైతు సంక్షేమం వినియోగదారులకు రక్షణ

## పౌరసరఫరాల శాఖలో విప్లవాత్మక మార్పులు ... కూటమి ప్రభుత్వ హయాంలో పారదర్శకంగా ప్రజా పంపిణీ వ్యవస్థ

గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేసింది. ఖరీఫ్, రబీ సీజన్లలో కలిపి 17.97 లక్షల మంది రైతుల నుంచి 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించింది. దాదాపు రూ.30,361 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసి రైతులకు సకాలంలో చెల్లింపులు చేసింది. అత్యంత విశేషమైన అంశం ఏమిటంటే... రైతులకు చెల్లింపుల్లో దేశంలోనే వేగవంతమైన విధానాన్ని అమలు చేయడం. సుమారు 90 శాతం చెల్లింపులు 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయగా మిగిలిన చెల్లింపులను కూడా 48 గంటల్లోపు పూర్తి చేశారు. దీంతో మధ్యవర్తుల జోక్యానికి అవకాశం లేకుండా రైతుకు నేరుగా ప్రయోజనం చేకూరే వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పింది.




### వాట్సాప్ ద్వారా ధాన్యం విక్రయం దేశంలోనే తొలి సంస్కరణ

సాంకేతికతను వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తూ ప్రభుత్వం దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ఆధారిత ధాన్యం నమోదు, విక్రయ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. రైతులు ఎలాంటి మధ్యవర్తుల అవసరం లేకుండా తమ ధాన్యాన్ని నేరుగా నమోదు చేసి విక్రయించే అవకాశాన్ని కల్పించింది. ఈ వ్యవస్థ ద్వారా ఇప్పటికే 40వేల మందికి పైగా రైతులు సుమారు 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నేరుగా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు విక్రయించారు. దీనివల్ల రైతులకు పారదర్శక సేవలు అందడమే కాకుండా, సమయం, వ్యయ భారం కూడా గణనీయంగా తగ్గింది.

### ప్రకృతి విపత్తుల సమయంలో రైతుకు అండగా ప్రభుత్వం

వర్షాలు, తుఫానుల సమయంలో ధాన్యం తడవకుండా చిన్న, సన్నకారు రైతులను రక్షించేందుకు దేశంలోనే తొలిసారిగా రూ.50కోట్ల విలువైన టార్పాలిన్లను ఉచితంగా పంపిణీ చేసింది. తుఫాను ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి రైతు సహాయక కేంద్రాల ద్వారా ఈ సేవలను అందించడం ప్రభుత్వం రైతులపై చూపిన ప్రత్యేక శ్రద్ధకు నిదర్శనం.

### 'దీపం-2'తో కోట్లాది కుటుంబాలకు ఊరట

ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు "దీపం-2" పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేస్తూ రాష్ట్రంలోని 1.08 కోట్ల గ్యాస్ కనెక్షన్లను లక్ష్యంగా తీసుకుంది. సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తూ కుటుంబాలపై గ్యాస్ వ్యయభారాన్ని తగ్గించింది. ఇప్పటివరకు నాలుగు విడతల్లో 3.78 కోట్లకు పైగా సిలిండర్లకు సబ్సిడీని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. మొదటి నాలుగు విడతల్లో కలిపి రూ.3,092 కోట్లకు పైగా సబ్సిడీ అందించగా ఐదో విడత కోసం మరో రూ.300 కోట్లు అడ్వాన్స్‌గా విడుదల చేసింది. దేశంలోనే అత్యంత విస్తృత స్థాయిలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో దీపం-2 ఒకటిగా నిలిచింది.

### విద్యార్థులకు సూపర్‌ఫైన్ రైస్

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు డొక్కా సీతమ్మ పేరుతో సూపర్‌ఫైన్ రైస్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. రైతుల నుంచి సుమారు 2.25 లక్షల క్వింటాళ్ల సూపర్‌ఫైన్ రైస్ సేకరించి 41వేల ప్రభుత్వ పాఠశాలలు, 4వేల సంక్షేమ హాస్టళ్లకు సరఫరా చేస్తోంది. ప్రతి బియ్యం సంచిపై రైతు వివరాలను ముద్రించడం ద్వారా వారికి గౌరవం కల్పించడమే కాకుండా వ్యవసాయం-విద్య మధ్య అనుసంధానాన్ని కూడా బలోపేతం చేసింది.





### వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

సామాజిక భద్రతలో మరో వినూత్న అడుగుగా దేశంలోనే తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 16.88 లక్షల మంది లబ్ధిదారులకు ఈ సేవలను అందిస్తోంది. ఈ-పోస్ పరికరాలతో రేషన్ డీలర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ ధ్రువీకరణ అనంతరం సరుకులు అందించడం ద్వారా వృద్ధులు, దివ్యాంగుల ఇబ్బందులను పూర్తిగా తొలగించింది.

### ఈ-కేవైసీలో దేశంలోనే అగ్రస్థానం

రేషన్ కార్డుల ఈ-కేవైసీ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ దేశవ్యాప్తంగా మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 99.06 శాతం రేషన్ కార్డులకు ఈ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా చేసింది. ఈ డిజిటల్ సంస్కరణ పారదర్శక పరిపాలనకు నిదర్శనంగా నిలవడమే కాకుండా దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.

### అక్రమాలపై ఉక్కుపాదం

ప్రజలకు అందాల్సిన బియ్యం దారిమళ్లకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహించి ఇప్పటివరకు 5,354 కేసులు నమోదు చేసింది. అక్రమంగా నిల్వ చేసిన 7,32,675 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకుంది. పంపిణీ వ్యవస్థలో అవినీతి, అక్రమాలకు ఎలాంటి అవకాశం లేకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ ప్రజా ధనం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

### గత ప్రభుత్వ బకాయిలకు ముగింపు

గత ప్రభుత్వ హయాంలో రైతులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను ప్రస్తుత ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుని విడుదల చేసింది. ఒక విడతలో రూ.1,000 కోట్లు, మరో విడతలో రూ.674 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పించింది.

### మరింత ఆధునిక ప్రజా పంపిణీ వ్యవస్థ

భవిష్యత్తులో ప్రజా పంపిణీ వ్యవస్థలో మిల్లెట్స్, పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటి పోషకాహార పదార్థాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సాంకేతిక సేవలను మరింత విస్తరించి, ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించే దిశగా కొత్త సంస్కరణలను అమలు చేయనుంది.


Government of Andhra Pradesh / ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
Consumer Affairs, Food & Civil Supplies Department
వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ
National Food Security Act, 2013

RICE CARD / రైస్ కార్డు

| | |
|---|---|
| బియ్యం కార్డు రకం | : NFSA/AAY |
| బియ్యం కార్డు నెం. | : |
| కుటుంబ పెద్ద పేరు | : |
| పుట్టిన తేది /వయస్సు | : 24-04-1985 / 39 సం. |
| కుటుంబ పెద్ద లింగం | : Female / ఆడ |
| కుటుంబ సభ్యులు | : 6 |
| దుకాణం ఐడి | : |
| దుకాణం చిరునామా | : చినకొమ్మల,కృష్ణా జిల్లా |

### స్మార్ట్ రేషన్ కార్డులతో డిజిటల్ విప్లవం

రేషన్ పంపిణీ వ్యవస్థలో పారదర్శకతను మరింత పెంచేందుకు ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డులను ప్రవేశపెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 1.49 కోట్ల కుటుంబాలకు ఈ కార్డులను అందించింది. 'వన్ నేషన్-వన్ రేషన్ కార్డ్' విధానంతో దేశంలో ఎక్కడైనా రేషన్ పొందే సౌకర్యాన్ని కల్పించింది. కుటుంబ సభ్యుల వివరాలను డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచడంతో పాటు దళారుల జోక్యానికి పూర్తిగా అడ్డుకట్ట వేసింది.



శశికుమార్
తెలుగుదేశం సైనికుడు

## జాతీయ సహకార సవరణ బిల్లుకు టీడీపీ సంపూర్ణ మద్దతు

**●సహకార రంగంలో సీఎం చంద్రబాబు కృషి అద్భుతం**

**: రాజ్యసభలో ఎంపీ చింతకాయల విజయ్**



అమరావతి (చైతన్యరథం): జాతీయ సహకార అభివృద్ధి కార్పొరేషన్ (సవరణ) బిల్లు-2026కు తెలుగుదేశం పార్టీ తరపున రాజ్యసభలో ఎంపీ చింతకాయల విజయ్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో ఆయన మాట్లాడుతూ... సహకార సంస్థలను స్వయం సమృద్ధిగా, పటిష్టంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 'సహకార్ సే సమృద్ధి' విజన్‌ను ప్రధాని నరేంద్రమోదీ దేశానికి అందించారని కొనియాడారు. 2021లో ప్రత్యేకంగా సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ప్రధానికి, అలాగే ఈ ఉద్యమానికి సంస్థాగత వేగాన్ని అందించిన కేంద్ర హోం, సహకారశాఖ మంత్రి అమిత్ షా కృషికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సహకార సంఘం పనితీరును ఆయన సభలో ఉదహరించారు. ఒక రైతు ఒంటరిగా మార్కెట్‌కు వెళితే బేరసారాలు ఆడే శక్తి పరిమితంగా ఉంటుందని, అదే రైతులు సహకార సంఘాల ద్వారా ఏకమైతే వారి బలం అనేక రెట్లు పెరుగుతుందని పేర్కొన్నారు. దీని ద్వారా రైతులు కేవలం ఉత్పత్తిదారులుగానే మిగిలిపోకుండా సమీకరణ, ప్రాసెసింగ్, మార్కెట్ యాక్సెస్ వంటి వాటిలోనూ భాగస్వాములు అవుతారని విజయ్ వివరించారు.

**సహకార రంగాన్ని బలోపేతానికి చంద్రబాబు కృషి**

ప్రస్తుతం దేశంలో 8.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ సహకార సంఘాలు ఉండగా, వాటిలో 6.6 లక్షల సంఘాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని ఎంపీ విజయ్ సభ దృష్టికి తెచ్చారు. దాదాపు 32 కోట్ల మంది సభ్యులతో గ్రామీణ భారతదేశంలో 98 శాతం మందికి ఇవి చేరువయ్యాయని, 30కి పైగా రంగాలు, స్వయం సహాయక సంఘాల ద్వారా సుమారు 10 కోట్ల మంది మహిళలు ఇందులో భాగస్వాములయ్యారని తెలిపారు. 2014-2019 మధ్యకాలంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వ హయాంలో సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు, కౌలు రైతులను కూడా సహకార రంగంలోకి తీసుకురావడంలో చంద్రబాబు పోషించిన అద్భుతమైన పాత్రను విజయ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. 1962 నాటి సహకార చట్టాన్ని 2026 నాటి ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా మార్చాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కొత్త బిల్లు ద్వారా ఎన్‌సిడిసిని కేవలం వ్యవసాయం, రుణాలకే పరిమితం చేయకుండా ఫుడ్ ప్రాసెసింగ్, స్టోరేజ్, హెల్త్‌కేర్, ఎగుమతులు, విత్తనాలు, సేంద్రీయ ఉత్పత్తులు, డిజిటల్ సేవలతో పాటు మొబిలిటీ వంటి కొత్త రంగాలకు విస్తరిస్తుండటాన్ని ప్రశంసించారు. దీనికి ఉదాహరణగా, డ్రైవర్లను ఓనర్లుగా మార్చేలా జీరో కమిషన్‌తో పనిచేసే 'భారత్ టాక్సీ' అనే వినూత్న సహకార నమూనాను ఆయన ప్రస్తావించారు.

**గిరిజన ప్రాంతాల్లో డెయిరీ కోఆపరేటివ్ ఫైనాన్సింగ్ విండోను ఏర్పాటు చేయాలి**

ఆంధ్రప్రదేశ్‌లోని మామిడి రైతుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఎంపీ విజయ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లోని సుమారు 91 వేల హెక్టార్లలో తోతాపురి మామిడి సాగు చేస్తున్న రైతులు ఇటీవల తీవ్రమైన ధరల పతనంతో ఇబ్బందులు పడ్డారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వాన్ని ఆయన అభినందించారు. రాష్ట్రంలోని గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి ఎంపీ విజయ్ ఒక కీలక సూచన చేశారు. ఎన్‌సిడిసి ద్వారా గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకంగా డెయిరీ కోఆపరేటివ్ ఫైనాన్సింగ్ విండోను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. తద్వారా పాల శీతలీకరణ కేంద్రాలు, టెస్టింగ్, కలెక్షన్ సెంటర్లతో పాటు పశుగ్రాసం, పశువైద్య సేవలు, సరైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడానికి వీలవుతుందని, ఈ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి అమిత్ షాకు ఎంపీ చింతకాయల విజయ్ విజ్ఞప్తి చేశారు.

## కుటుంబ సభ్యులతో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిసిన ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కుటుంబ సభ్యులతో రాష్ట్రపతి ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణానికి సంబంధించిన విశేషాలతో రూపొందించిన టేబుల్ బుక్‌ను రాష్ట్రపతికి ఎంపీ అప్పలనాయుడు అందజేశారు. తాను సామాన్య గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చాననే విషయాన్ని రాష్ట్రపతికి చెప్పినట్లు ఎంపీ తెలిపారు. తాను సైతం అత్యంత దిగువ స్థాయి నుంచి అత్యున్నత స్థాయికి చేరుకున్నానని రాష్ట్రపతి తమతో చెప్పినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను చేరువ చేయడం, రికార్డు స్థాయిలో 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ (PTM)'లు నిర్వహించడం వంటి అంశాలను రాష్ట్రపతికి వివరించినట్లు ఎంపీ కలిశెట్టి కుమార్తె నిఖిల చెప్పారు.

## చంద్రబాబు సుపరిపాలనలో ఆనందంగా అన్ని వర్గాల ప్రజలు



భామిని (చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు సుపరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా ఉన్నారని ఎమ్మెల్సీ, నియోజకవర్గ పరిశీలకులు కావలి గ్రీష్మ, పాలకొండ టీడీపీ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి అన్నారు. మండలంలోని మేజర్ పంచాయతీ బత్తిలిలో 'కూటమి రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి-సంక్షేమం, ఇంటింటి ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా రెండేళ్ల కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వం కేవలం పథకాలు ఇవ్వడమే కాకుండా, అందరి కష్టసుఖాల్లో తోడుండటమే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన లక్ష్యం అని గ్రీష్మ, భూదేవి అన్నారు.

## భీమిలిలో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు కూటమి నేతల అవగాహన



భీమిలి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు టీడీపీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలంలో విస్తృతంగా కొనసాగుతోంది. మండలంలోని 57 పోలింగ్ బూత్ల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిరోజూ 30 ఇళ్లను సందర్శిస్తూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అర్హులైన లబ్దిదారులు పథకాల ప్రయోజనాలను పొందేలా వివరిస్తున్నారు. బుధవారం మండల టీడీపీ అధ్యక్షుడు తాటరాజు అప్పారావు ఆధ్వర్యంలో గొట్టిపిల్లి, వేములవలస గ్రామపంచాయతీల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గ తెదేపా యువ నాయకుడు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, క్లస్టర్ ఇన్చార్జి మీసాల సత్యనారాయణ, యూనిట్ కన్వీనర్ గొర్లె సంతోష్, అట్టాడ బంగారునాయుడు, యర్రా బంగారునాయుడు, కోరాడ తమ్మునాయుడు, కోరాడ నాయుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

## రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆముదాలవలస (చైతన్యరథం): ట్రైన్ యాక్సిడెంట్లో చనిపోయిన గొర్రెల కాపరి కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో ఆముదాలవలస నియోజకవర్గం పొందూరు మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన గొర్రెల కాపరి సెనగల పోతయ్య కుటుంబానికి రూ.2 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందింది. గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్న సెనగల పోతయ్య గొర్రెలతో కలిసి రైల్వే ట్రాక్ దాటుతున్న సమయంలో జరిగిన రైలు ప్రమాదంలో పోతయ్యతో పాటు 30 గొర్రెలు మృతి చెందాయి. దీంతో కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ముఖ్యమంత్రిని ఒప్పించు నిబంధనలు సహకరించినప్పటికీ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేశారు. ఈ మేరకు మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఆపదలో ఉన్న ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేత



ఎస్.కోట (చైతన్యరథం): ఎల్.కోట మండలం కళ్లేపల్లికి చెందిన మన పార్టీ శ్రేయోభిలాషి, కార్యకర్త దివంగత మండ్ల శ్రీనివాసరావు రెండు నెలల క్రితం భోగాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం తీవ్ర విచారకరం. వారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు, టీడీపీ కార్యకర్తల సంక్షేమ విభాగం ద్వారా మంజూరైన రూ.5 లక్షల క్యాడర్ ప్రమాద బీమా చెక్కు మరియు పత్రాలను శ్రీనివాసరావు భార్య బంగారమ్మకి బుధవారం వారి నివాసంలో సీనియర్ నాయకులు కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్‌తో కలసి అందజేశారు. మానవీయ కోణంలో ఆలోచించి, కేవలం రూ.100 సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబాలకు కొండంత అభయాన్ని అందిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఐటీ మంత్రి నారా లోకేష్‌కి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఇప్పటివరకు మన ఎస్.కోట నియోజకవర్గంలో ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన 10 మంది కార్యకర్తల కుటుంబాలకు ఏకంగా రూ. 50 లక్షల బీమా పరిహారాన్ని అందించి వారి ఇంట వెలుగులు నింపామని అన్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత్వం మీ భవిష్యత్తుకు భరోసా.. ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకుని మీ కుటుంబాలకు రక్షణ కవచంగా నిలవాలని కోరుతున్నాను అని అన్నారు.

## విశాఖ ఉత్తరంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వ విజయాలు



విశాఖ ఉత్తర (చైతన్యరథం): నియోజకవర్గం 42వ వార్డులో 68,57 నెంబర్ బూతులలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని స్థానిక నేతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీడీపీ జాతీయ ఉపాధ్యక్షులు మొహమ్మద్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమం కోసం వివిధ పథకాలు సూపర్ సిక్స్ అమలుపరిచిన పథకాలు తెలియజేశారు. కూటమి పాలనలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వార్డ్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఆకిరెడ్డి జగదీష్, వార్డ్ ప్రధాన కార్యదర్శి ముక్కీ రామకృష్ణ, బూత్ అధ్యక్షులు జగదీశ్వరి, గుడ్ల జగదీశ్వరి, యూనిట్ ఇన్‌ఛార్జ్ కాళీ ప్రసాద్, ఎం.ఎల్.ఎన్‌రావు, వై త్రివేణి, జిల్లా అధికార ప్రతినిధి శ్రీదేవి, వార్డు నాయకులు కె.శ్రీవేణి, సిహెచ్ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీ 2025కు మద్దతుగా కాకినాడలో ఉపాధ్యాయుల 'ఆత్మగౌరవ సదస్సు'




కాకినాడ (చైతన్యరథం): మెగా డీఎస్సీ 2025 నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ ఉపాధ్యాయులు బుధవారం కాకినాడ డీఎస్ఏ గ్రౌండ్స్‌లో 'ఆత్మగౌరవ సదస్సు' నిర్వహించారు. కాకినాడ, కోనసీమ, అల్లూరి జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చారు. ఈ సందర్భంగా డీఎస్ఏలోని ధ్యాన్ చంద్ విగ్రహానికి నివాళులు అర్పించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ధన్యవాదాలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం డీఎస్ఏ గ్రౌండ్స్ నుంచి నాగమల్లితోట జంక్షన్ వరకు 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. డీఎస్సీ 2025 నియామకాలపై కుట్రలు చేయొద్దంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. డీఎస్సీ నియామకాలపై విద్యాశాఖ అధికారులు ఎప్పటికప్పుడు వాస్తవాలను వెల్లడిస్తున్నప్పటికీ, రాజకీయ ప్రయోజనాల కోసం వైఎస్సార్‌సీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని ఉపాధ్యాయులు మండిపడ్డారు. ఎంపికైన అభ్యర్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దని స్పష్టం చేశారు. డీఎస్సీ 2025పై కుట్రలకు పాల్పడే ప్రయత్నాలను సహించబోమని, అభ్యర్థుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ క్రీడా సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యాయులు, డీఎస్సీ స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు పాల్గొన్నారు.

## వెల్లటూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం భారీగా నిధులు

**● వేమూరులో ఇంటింటి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**

వేమూరు (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న రెండేళ్ల నమ్మకం – అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీమంత్రి నక్కా ఆనంద్ బాబు భట్టిప్రోలు మండలంలోని వెల్లటూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేస్తున్న తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఎన్‌టీఆర్ భరోసా, సూపర్ సిక్స్ తదితర సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు, సూచనలు తెలుసుకుని వాటిని మై టీడీపీ యాప్ ద్వారా నమోదు చేశారు. అన్ని మండలాల పరిధిలో ప్రతి కుటుంబాన్ని నేరుగా కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని మైటీడీపీ యాప్‌లో నమోదు చేయాలని కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, క్లస్టర్-యూనిట్- బూత్, ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. వెల్లటూరు గ్రామ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.12.07 కోట్ల విలువైన ప్రయోజనాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. స్వర్ణాంధ్ర – విజన్ 2047 లక్ష్యంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం, పోలవరం నిర్మాణాన్ని వేగవంతం చేయడం, అమరావతి రాజధాని అభివృద్ధి, రాష్ట్రవ్యాప్తంగా రహదారుల నిర్మాణం, అన్ని నియోజకవర్గాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.

## సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం

**●పెదకూరపాడు నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం చేపట్టిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్**



పెదకూరపాడు (చైతన్యరథం): అమరావతి మండలం కర్లపూడిలో గ్రామంలో నిర్వహించిన రెండేళ్ల నమ్మకం- ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అంతకు ముందు రాజముద్రతో రైతులకు మంజూరైన పాస్ పుస్తకాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రజల ముందుకు గర్వంగా వెళ్తున్నామని అన్నారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల్లోనే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో దాదాపు 90 శాతం హామీలను అమలు చేసి చూపించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గర్వంగా వివరించగలుగుతున్నామని ప్రజల ఆశీస్సులతో మరింత అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు : ఎమ్మెల్యే తంగిరాల



నందిగామ (చైతన్యరథం): గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను మరింత చేరువ చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ మండలం రాఘవాపురం గ్రామంలో రూ.36 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన విలేజ్ వెల్నెస్ హెల్త్ సెంటర్ భవనాన్ని బుధవారం కూటమి నేతలు, అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ.. గతంలో చిన్నపాటి అనారోగ్య సమస్యలకు సైతం గ్రామీణ ప్రజలు పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఆ ఇబ్బందులను తొలగించి వైద్య సేవలను గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు చేపడుతోందని తెలిపారు. వెల్నెస్ హెల్త్ సెంటర్ల ద్వారా గ్రామాల్లోనే ప్రజలకు నిరంతరం ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.

**ప్రజారోగ్యమే ప్రాధాన్యతగా..**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమంతోపాటు ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే సౌమ్య అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తూ, ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత చేరువ చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు.

## అభివృద్ధి... సంక్షేమం ఇవే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**●రాజమహేంద్రవరం 2వ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు సమగ్ర అభివృద్ధిని వేగవంతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ టీడీపీ – ఇంటింటికీ సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా 2వ డివిజన్‌లో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలపై వివరాలు తెలియజేస్తూ ప్రత్యేక కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులతో వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. 'సూపర్ సిక్స్' హామీల అమలుతో రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం పెరిగిందని చెప్పారు. సామాజిక భద్రతా పింఛన్లను రూ.4 వేల నుంచి వివిధ కేటగిరీల వారికి రూ.6 వేల, రూ.10 వేల, రూ.15 వేల వరకు పెంచడం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పించామన్నారు. అలాగే 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో చదువుతున్న ప్రతి విద్యార్థి కోసం తల్లికి రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, 'దీపం-2' పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆటో డ్రైవర్లకు ఏటా ఆర్థిక సాయం, 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు రూ.20వేల వరకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని వివరించారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో విధ్వంసం, అప్పులు, అభివృద్ధి నిర్లక్ష్యం మాత్రమే కనిపించాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శక పాలన అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## గన్నవరం నియోజకవర్గంలో ప్రతి గ్రామ అభివృద్ధే లక్ష్యం

గన్నవరం (చైతన్యరథం): గన్నవరం మండలం గోపవరపుగూడెం గ్రామంలో నిర్వహించిన '2 ఏళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు అలానే తాను చేసిన పనులను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. అనంతరం రూ.1.30 కోట్ల వ్యయంతో పూర్తయిన చిక్కవరం-పురుషోత్తపట్నం రహదారిని, రూ.53.90 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామీణ తాగునీటి పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ 1,300 ఓట్లు మాత్రమే ఉన్న చిన్న గ్రామమైన గోపవరపుగూడెంలోనే ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. గ్రామ ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న చిక్కవరం-పురుషోత్తపట్నం రహదారిని రూ.1.30 కోట్లతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు.

## పెడనలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం



పెడన (చైతన్యరథం): కృత్తివెన్ను మండలం కృత్తివెన్ను గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికీ కూటమి ప్రభుత్వం" కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ చైర్మన్, కృష్ణాజిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తితో కలిసి పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలుసుకుని, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నాను. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించడంతో పాటు, స్థానిక సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సహకారంతో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళ్తోంది. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల సంక్షేమం-అభివృద్ధిపై సమీక్ష

**● మచిలీపట్నం శ్రేణులతో జిల్లా పార్టీ అధ్యక్షుడు గురుమూర్తి**



మచిలీపట్నం (చైతన్యరథం) : మచిలీపట్నం రూరల్ మండలంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై కృష్ణ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీ శ్రేణులపై ఉందన్నారు. ప్రతి కుటుంబాన్ని, ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలను కలిసి వివరాలు తెలుసుకోవడంతో పాటు, ప్రజల సమస్యలను కూడా స్థానిక నాయకులు, కార్యకర్తలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని గురుమూర్తి సూచించారు. పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ శ్రేణులు చురుగ్గా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు, కాగిత గోపాలరావు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటికీ టీడీపీ కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన

**●చిలకలూరిపేట 33వ వార్డులో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశంలో పాల్గొన్న ప్రత్తిపాటి పుల్లారావు**



చిలకలూరిపేట (చైతన్యరథం): కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను వివరిస్తూ, తెలుగుదేశం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలోని 33వ వార్డులో పార్టీశ్రేణులతో కలిసి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఇళ్లకు వెళ్లిన ప్రత్తిపాటి.. ప్రభుత్వ పనితీరుపై ప్రజల మనోగతం తెలుసుకున్నారు. వారు తెలియచేసిన సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ప్రత్తిపాటి.. వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం రూ.9 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, డ్రైనేజ్ నిర్మాణ పనులకు పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంలో ప్రధాన పక్షమైన తెలుగుదేశం చేపట్టిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం విజయవంతంలో పార్టీ శ్రేణులతో పాటు. మిత్ర పక్షాలైన జనసేన, బీజేపీ శ్రేణులు కూడా కలిసి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కూటమి విజయాలు, రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, నిరంతరం అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతోందన్నారు.

**ట్రాక్టర్లు ప్రారంభించిన ప్రత్తిపాటి..**

33వ వార్డులో కార్యక్రమానంతరం ప్రత్తిపాటి.. స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రూ.22 లక్షలతో కొనుగోలు చేసిన నూతన ట్రాక్టర్లను ప్రారంభించారు. చెత్తసేకరణ వాహనాల నిర్వహణలో అశ్రద్ధ పనికిరాదని, డ్రైవర్లు, మున్సిపల్ సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని ఈ సందర్భంగా ప్రత్తిపాటి సూచించారు.

### తిరంగారంగ్ ర్యాలీలో పాల్గొన్న పశ్చిమ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బుద్ధా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం: 42వ డివిజన్‌లోని అప్సా బజార్ రోడ్డు నుంచి స్వాతి థియేటర్ రోడ్డు వరకు నిర్వహించిన తిరంగారంగ్ ర్యాలీలో పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ బుద్దా వెంకన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్దా వెంకన్న మాట్లాడుతూ... జాతీయ సమైక్యత, దేశభక్తి, సామాజిక ఐక్యతను చాటిచెప్పేలా తిరంగారంగ్ ర్యాలీ నిర్వహించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు, ప్రజలంతా ఐక్యంగా దేశ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 42 డివిజన్ అధ్యక్షులు పత్తి నాగేశ్వరావు, క్లస్టర్ యేదుపాటి రామయ్య, పి చిన్న సుబ్బయ్య, బాలు, శివ, సంతోష్, ముదిరాజ్ శివాజీ, మరియు నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తాం : ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**● జగ్గయ్యపేటలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం**



జగ్గయ్యపేట (చైతన్యరథం): ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా జగ్గయ్యపేట పట్టణం రెండో వార్డులోని 42వ బూతులో కారం శీను,గునుగు భాస్కర్ గార్ల ఆధ్వర్యంలో శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య, రంగాపురం రాఘవేంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ ప్రతి ఇంటికి వెళ్లి, గత రెండు సంవత్సరాల్లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. కుటుంబంలోని అందరికీ తల్లికి వందనం పథకం అందిందా లేదా అని ఆరా తీసి, ఎవరికైనా సమస్యలుంటే వాటికి పరిష్కార మార్గాలు చూపారు. అదేవిధంగా ఉచిత బస్సు సర్వీసు, పింఛన్ల పెంపు, నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి పనుల గురించి కూడా ప్రజలకు వివరించారు. రెండో వార్డులోని పాత గురుకుల పాఠశాల వద్ద డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయగా, ఎమ్మెల్యే వెంటనే మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని అప్రమత్తం చేసి, సమస్యకు తక్షణ పరిష్కారం చూపి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే రెండో వార్డులో వీధిదీపాల సమస్య ఎక్కువగా ఉందని, కొత్తగా వేసిన లైట్లు వారం, పది రోజుల్లోనే పాడైపోతున్నాయని దృష్టికి రాగా, సంబంధిత సిబ్బందిని, సచివాలయ సిబ్బందిని పిలిపించి అన్ని శాఖల వారితో సమస్యలను నోట్ చేయించి, వెంటనే పరిష్కరించి తనకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐదేళ్లలో డీఎస్సీ ఇవ్వలేని జగన్.. ఇప్పుడు నీతులు చెబుతారా?

**●16 వేలకుపైగా టీచర్ పోస్టులు భర్తీ చేసిన లోకేష్‌ను చూసి ఓర్వలేక విషప్రచారం**

**●అమరావతి అభివృద్ధిని అడ్డుకోవడమే జగన్ లక్ష్యం**

**●గొడ్డలి పార్టీ వైఖరిపై మండిపడ్డ మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు**




విజయవాడ (చైతన్యరథం): ప్రజా సమస్యలపై చర్చించాల్సిన శాసనసభకు రావడానికి వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌రెడ్డికి భయమెందుకని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. మండలి రద్దు చేస్తానని గతంలో చెప్పిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు మండలికి వెళ్తూ శాసనసభకు ఎందుకు రావడం లేదని నిలదీశారు. తమ ప్రభుత్వ హయాంలో జరిగిన వ్యవహారాలు, అక్రమాలు, దోపిడీపై వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయనే భయంతోనే సభకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. డీఎస్సీలో అర్హత సాధించేందుకు ఏళ్ల తరబడి కష్టపడ్డ పేద, మధ్యతరగతి నిరుద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఉమా మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్ పేరుతో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. ఐదేళ్ల పాలనలో ఒక్క డీఎస్సీ పోస్టు కూడా భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. అదే సమయంలో మంత్రి నారా లోకేష్ 16 వేలకుపైగా టీచర్ పోస్టులను భర్తీ చేయడంతో ఓర్వలేక విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అమరావతిని అడ్డుకోవడమే జగన్ విధానమని ఎన్ని అడ్డంకులు సృష్టించినా సీడ్ యాక్సిస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి సహా కీలక నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందని దేవినేని ఉమా తెలిపారు. అమరావతిని 'న భూతో న భవిష్యత్' అన్న రీతిలో దేశం గర్వించేలా ప్రజా రాజధానిగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అమరావతి అభివృద్ధిని చూసి ఓర్వలేకనే జగన్ అండ్ కో కడుపుమంటతో వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్వార్టర్స్‌ను కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం జీఏడీకి అప్పగించనున్నారని తెలిపారు. చనిపోయిన వారిని పరామర్శించకుండా, చంపిన వారిని పరామర్శించడం జగన్‌రెడ్డి నైజానికి అద్దం పడుతోందని దేవినేని ఉమా విమర్శించారు.

## యువశక్తి సమాజ సేవకు అంకితం కావాలి : యువ నాయకుడు గద్దె క్రాంతి కుమార్

విజయవాడ (చైతన్యరథం):యువత కేవలం రాజకీయాలు, ఉద్యోగాలు, చదువులకే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యతతో ముందుకు రావాలని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం ఇంటర్నేషనల్ యూత్ దినోత్సవం సందర్భంగా టీడీపీ యువత ఆధ్వర్యంలో 11వ డివిజన్ పరిధిలోని దొంతిరెడ్డి మల్లేశ్వరి పార్కులో టీడీపీ యువత నాయకులు గద్దె క్రాంతి కుమార్, కిలారు శ్రవణ్ శ్రవణ్ ఆధ్వర్యంలో స్వయంగా శ్రమదానం చేసి పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు, ఇతర వ్యర్థాలను తొలగించారు. అనంతరం 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జాతీయ జెండాలతో డివిజన్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా యువత సేవా కార్యక్రమాల్లో ముందుకు వస్తే సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చన్నారు. "యువత ఆలోచిస్తే మార్పు వస్తుంది.. యువత అడుగు వేస్తే అభివృద్ధి జరుగుతుంది.. యువత సేవ చేస్తే సమాజం బాగుపడుతుంది" అనే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.

## ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలి

**● 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**



వినుకొండ (చైతన్యరథం): ఆగస్టు 15 స్వాతంత్య్ర సందర్భంగా "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ. ఆంజనేయులు కోరారు. 80వ స్వాతంత్య్ర దినోత్సవం వేడుకలలో ప్రజలను భాగస్వామ్యం చేసేందుకు వారం రోజులపాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ జారీ చేసిన ఉత్తర్వుల్లో భాగంగా బుధవారం స్థానిక చీఫ్ విప్ కార్యాలయం వద్ద నుండి సైకిల్ ర్యాలీ ఏర్పాటు చేయగా చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ స్థానిక శివయ్య స్తూపం వరకు" హర్ ఘర్ తిరంగా" సైకిల్ ర్యాలీ కొనసాగించారు. చీఫ్ విప్ జీవీ విద్యార్థులతో జాతీయ జెండా లు చేత పూడి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా సైకిల్ తొక్కుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం అనేది కుల,మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా జరుపుకునే జాతీయ పండుగ అని స్పష్టం చేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశభక్తికి, ఐక్యతకు ప్రతీక అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం 2020 నుండి హర్ ఘర్ తిరంగా కార్యక్రమం చేపట్టిందన్నారు. దేశ స్వాతంత్రం కోసం త్యాగాలు చేసిన స్వాతంత్ర సమరయోధులను ప్రతి ఒక్కరు గౌరవించుకోవాలని కోరారు. కుల మత ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరూ ఒకే జెండా కిందకు రావడం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరిలో పెంపొందించాలన్నారు. జాతీయ జెండా ప్రాముఖ్యతను, గౌరవించే విధానాన్ని ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలని అన్నారు. ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే జిడిసిసిబి చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నాయకులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా టీడీపీ కార్యాలయ భవన నిర్మాణం

## పనులను పరిశీలించిన ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి



ఒంగోలు (చైతన్యరథం): పార్లమెంటు టీడీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులను ఒంగోలు పార్లమెంటు అధ్యక్షుడు, కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి కమిటీ సభ్యులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతిని ఆయన అధికారులను, సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

కార్యాలయ భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. పార్టీ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కార్యాలయం అన్ని సౌకర్యాలతో అందుబాటులోకి రావడం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. టీడీపీ బలోపేతానికి కార్యాలయం కీలక వేదికగా నిలుస్తుందని తెలిపారు.

భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు షేక్ ఆరిఫా, కార్యనిర్వహక కార్యదర్శులు గార్లపాటి శ్రీనివాసరావు, కసుకుర్తి అంకరాజు, కార్యదర్శి తంజావూరి శ్రీనివాసమూర్తి, మండపల్లి శ్రీను, జిల్లా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చుండి శ్యామ్, షేక్ మస్తాన్ వలి, కుంచాల శ్రీను, రమేష్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్యాలయ నిర్మాణానికి సంబంధించిన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు కలెక్టరేట్ నుంచి తిరంగా ర్యాలీని ప్రారంభించిన రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



# ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం

## కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

కోవూరు (చైతన్యరథం): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని, అందుకే ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజలు ఆనందంగా స్వాగతం పలుకుతున్నారని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం విడవలూరు మండలం చౌకచర్ల పంచాయతీలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తూ, రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని రాబోయే మూడేళ్లలో వాటిని పరిష్కరించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. కోవూరు నియోజకవర్గంలో '2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారం దాదాపు 90 శాతం పూర్తయిందని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

చౌకచర్ల పంచాయతీలో ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రజలు ఆనందంగా కనిపిస్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దాదాపు నెరవేర్చడమే ఇందుకు కారణమని ఎమ్మెల్యే గారు అన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్ చేశామని పేర్కొన్నారు. చెప్పిన మాట ప్రకారం పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచామని, తల్లికి వందనం ద్వారా కుటుంబంలో చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15 వేలు అందిస్తున్నామని తెలిపారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని, ఇతర ప్రాంతాలకు వెళ్లి పనిచేసుకునే మహిళలకు ప్రయాణ ఖర్చుల్లో నెలకు దాదాపు రూ.1,500 వరకు ఆదా అవుతోందని చెప్పారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు అండగా నిలిచామని, డెల్టా ప్రాంతమైన కోవూరులో రైతులకు ఇబ్బందులు లేకుండా సమయానికి యూరియా అందించామని తెలిపారు. కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని చెప్పారు.

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోవూరు నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు రెండో పంటకు సాగునీరు అందించామని తెలిపారు. ఇవన్నీ సాధ్యమయ్యేలా సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి నియోజకవర్గం తరఫున ఎమ్మెల్యే గారు కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా చంద్రబాబు నాయుడు గారు పెద్ద దిక్కుగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గారు అన్నారు. చౌకచర్ల గ్రామంలో 22 కుటుంబాలకు రూ.16.85 లక్షల విలువైన చెక్కులు అందించామని తెలిపారు.

## నంద్యాలలో జోరుగా ఇంటింటికీ టీడీపీ



నంద్యాల (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి అందుతున్నాయని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. బుధవారం నంద్యాల పట్టణంలోని 25 వ వార్డు, ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాలలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి ఫరూక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి వార్డులోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటన మధ్యలో మంత్రి ఫరూక్ స్థానిక హోటల్‌ను సందర్శించి, అక్కడ సరదాగా దోస వేసి వార్డు ప్రజలను, కార్యకర్తలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని కొనియాడారు. యువత భవిష్యత్తు, పేదల సంక్షేమం, మహిళా సాధికారత, విద్య, ఉపాధి, మరియు మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ నాయకత్వానికి నంద్యాల ప్రజలు పూర్తి మద్దతుగా నిలుస్తున్నారని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వాకా శివశంకర్ యాదవ్, అజ్మీర్, నంద్యాల మండల కన్వీనర్ మునగాల విశ్వనాథరెడ్డి, జెపి, గుద్దేటి వెంకటేశ్వర్లు, ప్రదీప్ కుమార్, స్థానిక నాయకులు, కార్యకర్తలు వార్డు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందూ ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు : కప్పిర రేవతి



నెల్లూరు (చైతన్యరథం): హిందూ ధర్మ పరిరక్షణ కోసం నెల్లూరు సంతపేట ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద నెల్లూరు నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి ఆధ్వర్యంలో చేపట్టిన 24 గంటల ఉపవాస దీక్ష విజయవంతంగా ముగిసింది. మంగళవారం ప్రారంభమైన ఈ దీక్షను, బుధవారం ఉదయం దీక్షలో పాల్గొన్న రేవతికి, మహిళలు నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు. అనంతరం ఆమె పసుపు నీళ్లతో స్నానమాచరించి, ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంతపేట ఆంజనేయ స్వామి గుడి నుండి రంగనాయకులపేట ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైసీపీ నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం, ఇతర మతస్తులను మెప్పించడానికి ఏడుకొండల వాడి గోవింద నామాలను వ్యంగ్యంగా, అవహేళనగా మాట్లాడటాన్ని టీవీల్లో చూసి తీవ్ర బాధతో, పార్టీలకు అతీతంగా ఒక హిందువుగా ఈ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రేవతి మాట్లాడుతూ నెల్లూరు నగరం కులమతాలకు అతీతంగా అందరూ అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లలా కలిసి ఉండే ప్రాంతమని, రొట్టెల పండగ, క్రిస్మస్ వేడుకల్లో అన్ని మతాల వారూ పాల్గొంటారని గుర్తుచేశారు. ఇతర మతాల ప్రార్థనలను తాము అవహేళన చేస్తే ఎంత తప్పో, హిందూ దేవుళ్లను కించపరచడం కూడా అంతే తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. రాజకీయాల కోసం దైవాన్ని వాడుకోవద్దని విజ్ఞప్తి చేస్తూ, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి వైఖరిని ప్రశ్నించారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నెల్లూరులో మంత్రి నారాయణ గారిపై అనవసరంగా బురదజల్లే ప్రయత్నాలు మానాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఒకరి మతాన్ని ఒకరు గౌరవించుకోవాలని, ధర్మాన్ని కించపరిచే వారికి ఆ ఏడుకొండల వాడే తగిన శిక్ష విధిస్తాడని పేర్కొన్నారు.

జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపురం, అనంతపురం, కడప)
చైతన్యరథం



# సీడ్ బాల్స్‌తో పచ్చదనం పెంపునకు శ్రీకారం

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): అటవీ శాఖ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్‌ను డ్రోన్‌ల ద్వారా వెదజల్లే కార్యక్రమాన్ని పెనుకొండ లోని జాతీయ రహదారి పక్కన ఉన్న కొండ ప్రాంతంలో మంత్రి సవిత ప్రారంభించారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు సీడ్ బాల్స్ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నామని ఆమె తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సీడ్ బాల్స్ ద్వారా పచ్చదనాన్ని పెంపొందించే కార్యక్రమం కొనసాగుతోందని మంత్రి పేర్కొన్నారు. సత్యసాయి జిల్లాలో సుమారు 13 లక్షల సీడ్ బాల్స్‌ను 113 ప్రాంతాల్లో వెదజల్లేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో అటవీ విస్తీర్ణం సుమారు 14 శాతం మాత్రమే ఉందని, భవిష్యత్తులో పచ్చదనాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు.కరోనా సమయంలో ఆక్సిజన్ కొరతతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేసిన మంత్రి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందని, అందుకే అడవుల విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పశువుల పేడతో తయారు చేసిన సీడ్ బాల్స్‌లో విత్తనాలను ఉంచి, వాటిని డ్రోన్‌ల ద్వారా అటవీ, బీడు ప్రాంతాల్లో వెదజల్లుతున్నట్లు తెలిపారు. ప్రకృతి సహజంగా వృద్ధి చెందేలా ఈ విధానం ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్క నాటే అలవాటు చేసుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని మంత్రి సవిత సూచించారు. పెనుకొండ లో నగర వనాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. హైవే ప్రాంతంలో సుమారు రూ.2 కోట్లతో నగర వనం ఏర్పాటు చేశామని, అదే విధంగా కొండపై కూడా నగర వనం అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. బీడు భూముల్లో పశుగ్రాసం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గత ఐదేళ్లలో అటవీ శాఖను గత ప్రభుత్వం పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు. ప్రస్తుతం పచ్చదనం, అటవీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మారుమూల గ్రామాల్లో కూడా రహదారుల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, చక్రపాణి, కూటమి నాయకులు, కార్యకర్తలు, అటవీ శాఖ అధికారులు, ఇతర అధికారులు పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

# అమెరికా వెళ్లినా వ్యవసాయంపైనే దృష్టి

## క్యాలిఫోర్నియాలో పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు (చైతన్యరథం): నిత్యం ప్రజాక్షేత్రంలో ఉంటూ అభివృద్ధి, రాజకీయ కార్యక్రమాలతో బిజీ బిజీగా కనిపించే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు వ్యవసాయంపై తనకున్న మక్కువ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన వ్యవసాయక్షేత్రాన్ని సందర్శిస్తూ అక్కడే సమయం గడపటం, అలాగే రైతుల పొలాలను పరిశీలించడం వంటివి చేస్తుంటారు. అయితే తన వ్యక్తిగత పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ కూడా వ్యవసాయం పై ఆసక్తి చూపించారు. అక్కడ పంటలు ఎలా సాగుచేస్తున్నారో తెలుసుకోవాలన్న ఆసక్తితో క్యాలిఫోర్నియాలో పంట పొలాలను పరిశీలించారు. అక్కడి వ్యవసాయ విధానాలను, అలాగే పంటల ఉత్పత్తులు, మార్కెటింగ్ వంటి అంశాలను స్థానికంగా ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. భారత దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించిన సమయంలో పంజాబ్ రాష్ట్రం నుంచి వలస వెళ్లిన సిక్కులు క్యాలిఫోర్నియాలో స్థిరపడగా.. ప్రస్తుతం ఓ సిక్కు రైతు 175 ఎకరాలలో ఆల్మండ్ (బాదం) పంట వేశారు. ఈ పంటను ఎమ్మెల్యే సునీత పరిశీలించారు. పంట ఎలా సాగు చేస్తున్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఈ పంట సాగు చేసి 8 సంవత్సరాలైందని.. ఒక ఎకరానికి 150 మొక్కలు నాటుతారని.. ఒక ఎకరానికి 1.6 టన్నుల దిగుబడి వస్తుందని వివరించారు. 100 ఎకరాల నుంచి 3వేల ఎకరాల దాకా ఒక్కో రైతు అక్కడ పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంటల నిర్వహణ విధానాన్ని తెలుసుకోవడంతో పాటు పంట కోత (హార్వెస్టింగ్) విధానాన్ని కూడా తెలుసుకున్నారు. మొత్తం యంత్రాల ద్వారానే హార్వెస్టింగ్ నిర్వహిస్తారని రైతులు వివరించారు. అమెరికాలో వ్యవసాయ విధానాలు చాలా సాంకేతికంగా ఉన్నాయని.. మార్కెటింగ్ లో కూడా మనం తెలుసుకోవాల్సినవి చాలా ఉన్నాయని ఎమ్మెల్యే సునీత తన అభిప్రాయాలను పంచుకున్నారు.



# రాయదుర్గంలో ముమ్మరంగా ఇంటింటికీ టీడీపీ

## జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏపీఎస్‌ఆర్‌టీసీ జోనల్ ఛైర్మన్ పాల్గొన్న పూల నాగరాజు



రాయదుర్గం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందుతున్నాయని అనంతపురము జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఏపిఎస్ఆర్‌టీసీ జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలిపారు. బుధవారం రోజున రాయదుర్గం నియోజకవర్గం, గుమ్మఘట్ట మండలంలోని రంగచేడు పంచాయితీ పరిధిలోని పోలింగ్ బూత్ నెంః 295 పరిధిలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ముమ్మరంగా జరిగింది. ప్రచార కార్యక్రమంలో భాగంగా భాగంగా పూల నాగరాజు గ్రామంలోని ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి, కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు సాధించిన ప్రగతిని, అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను స్థానికులతో కలిసి పంపిణీ చేస్తూ, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పూల నాగరాజు మాట్లాడుతూ 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా కలిసి, వారి అభిప్రాయాలు, సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుంటున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు న్నారని కొనియాడారు. కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# కిలోమీటరు పొడవు జాతీయ జెండాతో ర్యాలీ

మదనపల్లె (చైతన్యరథ)ం స్వాతంత్ర దినోత్సవం ముందస్తు వేడుకలలో భాగంగా మదనపల్లి పట్టణంలో మిషన్ కాంపౌండ్ నుండి బెంగళూరు బస్టాండ్ వరకు పాఠశాలల, కళాశాలల విద్యార్థిని విద్యార్థులు, ఐకెపి మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ,హిజ్రా సంఘాల సభ్యులు, రేషన్ షాప్ డీలర్లు ,ఆర్యవైశ్య సంఘం సభ్యులు, కళాకారులు, స్వర్ణకారలు ,అన్ని కులాల సంఘాల సభ్యులు మాజీ సైనికులు , ఉద్యోగ ఉపాధ్యాయు సంఘాలు,విద్యార్థి సంఘాలు, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు, హమాలీ వర్కర్స్ యూనియన్ సభ్యులు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు, లారీ ఆటో మరియు కార్ యూనియన్ల సభ్యులు, వెల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ సభ్యులు, టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, యువజన సంఘాలు మదనపల్లి పట్టణ ప్రజలతో కలసి భారీ ర్యాలీలో ఎమ్మెల్యే యం. షాజహాన్ భాషా పాల్గొన్నారు.



# చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం

## ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పిలుపు

నెల్లూరు (చైతన్యరథం): నగరంలోని ఏఎఫ్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మున్సిపల్ మహిళా జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, విద్యార్థి జీవితంలో ప్రస్తుత దశ ఎంతో కీలకమైనదని, ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలు వారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని అన్నారు. ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. విద్య అంటే కేవలం పుస్తకాల్లోని విషయాలను చదివి గుర్తుపెట్టుకోవడం మాత్రమే కాదని, ఆలోచనా శక్తి, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సరైన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను పెంపొందించుకోవడమే నిజమైన విద్య అని అబ్దుల్ అజీజ్ తెలిపారు. పాఠ్యాంశాలతో పాటు అవసరమైన అదనపు తరగతులు, ఆన్‌లైన్ బోధన, అధ్యయన సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రతి విద్యార్థి కనీసం 85 శాతానికి పైగా హాజరు ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## అమెరికా వెళ్లినా వ్యవసాయంపై

# సునీతమ్మ మక్కువ

- కాలిఫోర్నియాలో పంటలను పరిశీలించిన రాప్తాడు ఎమ్మెల్యే
- సాగు, మార్కెటింగ్ విధానాలపై రైతులతో మాటామంతీ
- వ్యవసాయం చాలా అధునాతనంగా ఉందని కితాబు





**కాలిఫోర్నియా:** నిత్యం ప్రజా క్షేత్రంలో ఉంటూ అభివృద్ధి, రాజకీయ కార్యక్రమాలతో బిజిబిజీగా కనిపించే రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు వ్యవసాయంపై వున్న మక్కువ ఏమాత్రం తగ్గలేదు. తరచూ తన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తూ అక్కడే సమయం గడపడంతో పాటు రైతుల పొలాలను పరిశీలించడం వంటివి చేస్తుంటారు. అయితే తన వ్యక్తిగత పర్యటనలో భాగంగా అమెరికా వెళ్లిన ఆమె అక్కడ కూడా వ్యవసాయంపై ఆసక్తి కనబరిచారు. అక్కడ పంటలు ఎలా సాగుచేస్తున్నారో తెలుసుకోవాలన్న ఆసక్తితో ఓ సిక్కు రైతు 175 ఎకరాల్లో సాగు చేస్తున్న ఆల్మండ్ (బాదం) పంటను పరిశీలించారు. ప్రస్తుతం ఈ పంట సాగు చేసి 8 సంవత్సరాలైందని.. ఒక ఎకరానికి 150 మొక్కలు నాటుతారని.. ఒక ఎకరానికి 1.6 టన్నుల దిగుబడి వస్తుందని రైతు వివరించాడు. ఇక్కడ మొత్తం యంత్రాల ద్వారానే హార్వెస్టింగ్ నిర్వహిస్తారని తెలిపారు. సాగు, మార్కెట్ విధానాలపై ఆరా తీసిన సునీత అమెరికాలో వ్యవసాయ విధానం చాలా అధునాతనంగా ఉందని సునీత కితాబిచ్చారు.







# తానా-తామా సేవా తత్పరత

## అట్లాంటాలో రక్తదాన శిబిరం

**అట్లాంటా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), మెట్రో అట్లాంటా తెలుగు సంఘం (తామా) కలిసి అమెరికన్ రెడ్‌క్రాస్ భాగస్వామ్యంతో, కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా (సీజీఐ) అట్లాంటా సహకారంతో కమ్యూనిటీ రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించాయి. అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం అవసరంలో ఉన్నవారికి అండగా నిలిచి ప్రాణాలను కాపాడాలనే గొప్ప లక్ష్యంతో కమ్యూనిటీని ఒక్కతాటిపైకి తీసుకొచ్చింది. శ్రీనివాస్ లావు (తానా ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్), సోహిని అయినాల (ఉమెన్ సర్వీసెస్ కో–ఆర్డినేటర్), శేఖర్ కొల్లు (ఆర్‌ఆర్), మధుకర్ యార్లగడ్డ (ఫౌండేషన్ ట్రస్టీ, తామా చైర్మన్), భరత్ మద్దినేని (బోర్డ్ డైరెక్టర్), సునీల్ దేవరపల్లి (సోషియల్ వెల్ఫేర్ కో–ఆర్డినేటర్), సునీత పొత్నూరు (తామా ప్రెసిడెంట్ ఎలక్ట్) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా, అట్లాంటా కాన్సుల్ జనరల్ రమేష్‌బాబు లక్ష్మణన్ ప్రత్యేక అతిథిగా హాజరుకావడం మరింత ప్రాధాన్యతను తీసుకువచ్చింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అంకితభావంతో కృషి చేసిన చైతన్య కొర్రపాటి, దీప్తి తాళ్లూరి, మాలతి నాగభైరవ (తానా కళాశాల చైర్), ఆర్తిక (తానా మేట్రిమోనియల్ చైర్), తిరు చిల్లపల్లి తదితరులతో పాటు స్థానిక తానా, తామా బృందానికి నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మహత్తర కార్యక్రమంలో రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.











## పెన్సిల్వేనియాలో ‘పద్మశ్రీ’ రాజేంద్రప్రసాద్‌కి

# ఆత్మీయ సత్కారం

**ఫిలడెల్ఫియా:** భారత ప్రభుత్వం నుంచి ‘పద్మశ్రీ’ పురస్కారం అందుకున్న ప్రముఖ నటుడు, నటకిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను అమెరికాలోని ఫిలడెల్ఫియా తెలుగు కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఆత్మీయంగా సన్మానించారు. పెన్సిల్వేనియాలోని చెస్టర్ స్ప్రింగ్స్ ‘బ్రెయర్స్ స్టేషన్ క్లబ్ హౌస్’లో రవి పొట్లూరి ఆధ్వర్యంలో జరిగిన వేడుకకు ప్రవాస తెలుగు ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. రాజేంద్రప్రసాద్ తన విలక్షణమైన నటనా ప్రతిభతో దాదాపు 49 సంవత్సరాలుగా చలనచిత్ర పరిశ్రమలో కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్నారని తెలుగు సంఘాల ప్రతినిధులు, అభిమానులు కొనియాడారు. హాస్యరస చిత్రాలతో పాటు ఎన్నో ఉత్తమ పాత్రలతో మెప్పించిన ఆయనకు ‘పద్మశ్రీ’ అవార్డు రావడం తెలుగు జాతికే గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ నిర్వహిస్తున్న చారిటబుల్ ట్రస్టుకు రూ.8 లక్షల విరాళం అందించారు. అనంతరం శాలువాలు, జ్ఞాపికలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు.



ప్రవాస తెలుగు ప్రజలు తనపై చూపిస్తున్న ఆప్యాయత, ప్రేమానురాగాలకు రాజేంద్రప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. “సముద్రాలు దాటి వచ్చినా తెలుగు ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలను చూస్తుంటే కన్నతల్లి ఒడిలో ఉన్నట్లే ఉంది. మీ ప్రేమే నన్ను ఇన్నేళ్లుగా నటుడిగా ముందుకు నడిపిస్తోంది” అని వ్యాఖ్యానించారు. పద్మశ్రీ పురస్కారం తనకు లభించిన గౌరవం మాత్రమే కాదని, తనను ఆదరించిన తెలుగు ప్రేక్షకులందరికీ చెందుతుందన్నారు. నటుడిగా తన 49 ఏళ్ల ప్రయాణంలో నవ్వులను పంచి, ప్రేక్షకుల గుండెల్లో స్థానం సంపాదించుకోవడం కన్నా పెద్ద అవార్డు మరొకటి లేదన్నారు.

ఈ కార్యక్రమానికి శ్వేత కొమ్మోజి వ్యాఖ్యాతగా వ్యవహరించగా... జగదీప్‌రెడ్డి అనుముల, పరమేష్ భీమ్ రెడ్డి, వేణు సంగాని, సతీష్ తుమ్మల, రామకృష్ణ తాడిశెట్టి, గిరిధర్ మసిరెడ్డి, వేణు కోమటిరెడ్డి, ఫణి కంటేటి, రాజు కక్కెర, సురేష్ వెంకన్నగారి, సునీల్ కోగంటి, వెంకట్ సింగు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15


# ‘ఇండియా డే’

## మసాచుసెట్స్ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ, బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ ప్రకటన

**మసాచుసెట్స్:** అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయులకు అరుదైన గౌరవం దక్కింది. మసాచుసెట్స్ రాష్ట్రంలో ప్రతిఏటా ఆగస్టు 15వ తేదీని ‘ఇండియా డే’గా అధికారికంగా జరుపుతామని ఆ రాష్ట్ర గవర్నర్ మౌరా హీలీ ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక, సాంస్కృతిక ప్రగతిలో భారతీయ సమాజం పోషిస్తున్న కీలక పాత్రకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆమె తెలిపారు. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన జారీ చేశారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారత్ ఆవిర్భవించిందని గవర్నర్ తన ప్రకటనలో కొనియాడారు. వైద్యం, టెక్నాలజీ, విద్య, వ్యాపారం వంటి రంగాల్లో ఇండియన్–అమెరికన్లు అందిస్తున్న సేవలను ప్రశంసించారు. అమెరికాలో నివసిస్తున్న 50 లక్షల మంది సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 3.6 కోట్ల మంది ప్రవాస భారతీయుల పాత్రను ఆమె గుర్తు చేశారు.




మరోవైపు బోస్టన్ నగర మేయర్ మిషెల్ వూ కూడా ఆగస్టు 15ను ‘ఇండియా డే’గా ప్రకటిస్తూ ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. బోస్టన్‌లో కొత్తగా భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆమె స్వాగతించారు. గవర్నర్, మేయర్ల నిర్ణయంపై ‘ఇండియా అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ బోస్టన్’ (ఐఏజీబీ) వంటి భారతీయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బోస్టన్ హార్బర్ వద్ద భారీ పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. అమెరికా గడ్డపై భారతీయ సమాజానికి లభించిన ఈ గౌరవం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.




# సమగ్ర చర్చకు నేను సిద్ధం

## లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా లేఖ

దేశవ్యాప్తంగా కలకలం రేపిన నీట్ పరీక్ష వివాదం, అనంతర విద్యార్థుల ఆందోళనలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన ఒక అధికారిక లేఖ రాశారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రభుత్వం తరఫున నీట్ అంశంపై చర్చకు అంగీకారం తెలిపారని అమిత్ షా తన లేఖలో గుర్తుచేశారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తీవ్రంగా ఎత్తిచూపడానికి ముందే, ప్రస్తుత సమావేశాల్లోనే 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు, 2026' పై సుదీర్ఘ చర్చ జరిగిందని లేఖలో హోం మంత్రి ప్రస్తావించారు. అయితే ఆ సమయంలో ప్రతిపక్షానికి చెందిన ఏ ఎంపీ కూడా నీట్ పరీక్షల గురించి మాట్లాడలేదని, అయినప్పటికీ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మరొకసారి ఈ అంశంపై చర్చించేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. 'నా విజ్ఞప్తి ఏమిటంటే... మీరు విపక్షాలతో చర్చించి, పరస్పర అంగీకారంతో నేటి నుంచి ఎంత సమయం, ఎన్ని గంటలు సరిపోతాయని భావిస్తే అంత సమయం కేటాయించాల్సిందిగా కోరుతున్నాను. కేటాయించిన ఆ సమయంలో నేను సభలో స్వయంగా ఉండి, ఈ అంశంపై చర్చలో పాల్గొనడానికి, విపక్షాల ప్రశ్నలన్నింటికీ సమాధానమివ్వడానికి సిద్ధంగా ఉన్నాను.' అని అమిత్ షా తన లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంభాషణల ద్వారానే పరిష్కారాలు లభిస్తాయి.. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై తనకు అపారమైన విశ్వాసం ఉంది.. అలాగే ఈ సభ చర్చలు, సంభాషణల కోసమే ఉందనేది నా నమ్మకమని అమిత్ షా తన లేఖలో రాశారు. కాబట్టి, విపక్ష నాయకులతో చర్చించి, ఈ ముఖ్యమైన విషయంపై మంచి వాతావరణంలో చర్చ జరిగేలా చూడాలని కోరుతున్నానని అమిత్ షా పేర్కొన్నారు. తద్వారా ఈ అంశంపై అధికార, ప్రతిపక్షాలకు చెందిన గౌరవనీయ సభ్యులందరూ తమ అమూల్యమైన అభిప్రాయాలను, ఆలోచనలను సభకు సమర్పించే అవకాశం కలుగుతుందని అమిత్ షా చెప్పారు.

# విపక్షాలది అరాచక ధోరణి

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అసహనం



పార్లమెంట్ సమావేశాలను వరుసగా అడ్డుకుంటూ, కీలకమైన ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా విపక్షాలు వ్యవహరిస్తున్న తీరుపై అధికార భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ప్రతిపక్షాల ఈ ధోరణి వారి 'అరాచక మనస్తత్వాన్ని' ప్రతిబింబిస్తోందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. ప్రతిపక్షాల తీరుపై సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన నితిన్ నబీన్.. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రతీ ముఖ్యాంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్షాలు సభను నడవనీయకుండా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రజలందరూ ఈ పరిణామాలను గమనిస్తున్నారని, చర్చల నుంచి ఎవరు పారిపోతున్నారో దేశ ప్రజలకు స్పష్టంగా అర్థమవుతోందని తెలిపారు.



# జేపీసీకి ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు

విదేశీ విరాళాల నియంత్రణకు సంబంధించిన ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు-2026 విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బిల్లును ఉభయ సభల సంయుక్త పార్లమెంటరీ కమిటీకి పంపించే ప్రతిపాదనను లోక్‌సభ ఆమోదించింది. విపక్షాల తీవ్ర నిరసనల మధ్య ఈ పరిణామం చోటుచేసుకుంది. ఎఫ్‌సీఆర్‌ఏ సవరణ బిల్లు 2026ను పరిశీలన కోసం జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపించే ప్రతిపాదనను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీసుకొచ్చారు. ప్రతిపాదిత కమిటీలో మొత్తం 31 మంది సభ్యులు ఉంటారు. ఇందులో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉంటారు. కమిటీ తన నివేదికను 2026 శీతాకాల సమావేశాల తొలి వారంలో సమర్పించాల్సి ఉంటుంది . ఎఫ్‌సీఆర్‌ఏ బిల్లుపై విపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. బిల్లులోని కొన్ని నిబంధనలు విదేశీ నిధులు స్వీకరించే స్వచ్ఛంద సంస్థలు, ఇతర సంస్థల కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని విపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిల్లును పూర్తిగా పరిశీలించి, సంబంధిత వర్గాల అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలని విపక్షాలు కోరుతున్నాయి. మైనారిటీలనే లక్ష్యంగా చేసుకుని ఈ బిల్లును రూపొందించారని అఖిలేష్ యాదవ్ విమర్శించారు.

### మోదీ, ఖర్గే మధ్యలో ప్రియాంక

# సరదా ముచ్చట్లు



తరచుగా రాజకీయ విమర్శలు చేసుకునే ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనాయకులు సరదాగా మాట్లాడుకున్న అరుదైన దృశ్యం తాజాగా కనిపించింది. ఢిల్లీలో ఎన్‌సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే కుమార్తె రేవతి వివాహ రిసెప్షన్‌లో ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

సుప్రియా సూలే కుమార్తె రేవతి వివాహ రిసెప్షన్‌కు ప్రధాని మోదీ వచ్చిన సమయంలో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే అక్కడే ఉన్నారు. ముందుగా రాహుల్ గాంధీతో మోదీ కరచాలనం చేశారు. అనంతరం ప్రియాంక గాంధీని పలకరించారు. 'ప్రియాంకాజీ.. ఎలా ఉన్నారు?' అని మోదీ అడిగారు. తాను బాగున్నానని, మీరు ఎలా ఉన్నారని ప్రియాంక ప్రశ్నించారు. అందుకు మోదీ 'నేను అలాగే ఉన్నాను' అని సమాధానం ఇచ్చారు.




# ముగిసిన జస్టిస్ వర్మ నోట్ల కట్టు కథ

## సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేకపోయారని విచారణ నివేదికలో పార్లమెంటరీ కమిటీ వెల్లడి

ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో భారీగా నగదు లభించిన వ్యవహారంపై పార్లమెంటరీ విచారణ కమిటీ కీలక విషయాలు వెల్లడించింది. ఆయన ఇంట్లో లభించిన నగదుకు సంబంధించి తగిన వివరణ ఇవ్వడంలో వర్మ విఫలమయ్యారని కమిటీ పేర్కొంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. 2025 మార్చి 14 రాత్రి జస్టిస్ వర్మ అధికారిక నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. మంటలను ఆర్పేందుకు వెళ్లిన అగ్నిమాపక సిబ్బందికి అక్కడి ఒక స్టోర్‌రూమ్‌లో భారీగా కాలిపోయిన రూ.500 నోట్ల కట్టలు కనిపించాయి. ఆ నగదు ఎక్కడి నుంచి వచ్చింది, ఎవరిది, ఆ ప్రదేశంలో ఎందుకు ఉందన్న అంశాలపై వర్మ సంతృప్తికరమైన వివరణ ఇవ్వలేకపోయారని పార్లమెంటరీ కమిటీ తన నివేదికలో పేర్కొంది. 'నగదు నాది కాదు, ఎవరో కుట్రపూరితంగా పెట్టారు' అన్న వర్మ వాదనను విచారణ కమిటీ అంగీకరించలేదు. న్యాయమూర్తుల (విచారణ) చట్టం, 1968 ప్రకారం నమోదైన మూడు ప్రధాన ఆరోపణలూ రుజువయ్యాయని కమిటీ స్పష్టం చేసింది. నగదు ఉన్న స్టోర్‌రూమ్‌పై ఆయనకు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా నియంత్రణ ఉన్నట్లు గతంలో ఏర్పాటు చేసిన అంతర్గత విచారణ కమిటీ కూడా గుర్తించిన విషయాన్ని తాజా నివేదిక ప్రస్తావించింది. నగదు లభించిన తర్వాత సాక్ష్యాలను సక్రమంగా భద్రపరచలేదని పార్లమెంటరీ కమిటీ ఆక్షేపించింది. స్టోర్‌రూమ్‌ను అధికారికంగా సీజ్ చేసి పరిశీలించే ముందే అక్కడి పరిస్థితిని మార్చారని పేర్కొంది. ఈ వివాదం వెలుగులోకి వచ్చిన తర్వాత జస్టిస్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి ఆయన మాతృ న్యాయస్థానమైన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేశారు. ఆయన ఇప్పటికే తన పదవికి రాజీనామా చేశారు.

# రష్యా. ఉక్రెయిన్ యుద్ధం ఉగ్రరూపం

## అగ్రస్థాయి మహిళ సామ్రాజ్యం సహా వాణిజ్య సంస్థలపై తీవ్ర ప్రభావం





రష్యా ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చుతోంది. ఈ ప్రభావం రష్యాలోని కీలక వాణిజ్య సంస్థలపై కూడా తీవ్రంగా పడుతోంది. రష్యాలో అతిపెద్ద ఆన్‌లైన్ వాణిజ్య సంస్థ అయిన 'వైల్డ్‌బెర్రీస్'కు చెందిన పలు గిడ్డంగులపై ఉక్రెయిన్ డ్రోన్లు దాడి చేయడంతో భారీగా నష్టం వాటిల్లింది. ఈ పరిణామం సంస్థ వ్యవస్థాపకురాలు, రష్యాలో అత్యంత సంపన్న మహిళగా పేరున్న టట్యానా కిమ్‌కు పెద్ద సవాలుగా మారింది. ఉక్రెయిన్ డ్రోన్ దాడుల్లో వైల్డ్‌బెర్రీస్‌కు చెందిన కీలక సరఫరా, నిల్వ కేంద్రాలు దెబ్బతిన్నాయి. రష్యా వ్యాప్తంగా ఉన్న సంస్థ లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని వరుస దాడులు జరిగినట్లు సమాచారం. దీంతో సంస్థ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. అలాగే వైల్డ్‌బెర్రీస్‌పై ఆధారపడే వేలాది మంది వ్యాపారులపై కూడా ప్రభావం పడింది. దాడుల కారణంగా పలు గిడ్డంగుల్లో నిల్వ ఉన్న వస్తువులు ధ్వంసమయ్యాయి. దీంతో చిన్న, మధ్య తరహా వ్యాపారులు తమ సరుకును కోల్పోయారు. ఆర్డర్ల పంపిణీలో జాప్యం ఏర్పడటంతో వినియోగదారులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైల్డ్‌బెర్రీస్ గిడ్డంగులు రష్యా యుద్ధానికి అవసరమైన వస్తువుల సరఫరాలో ఉపయోగపడుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపిస్తోంది. అందువల్ల వాటిని లక్ష్యాలుగా చేసుకున్నామని చెబుతోంది. అయితే రష్యా ఈ వాదనను తిరస్కరిస్తోంది. ఇవి పౌర వాణిజ్య మౌలిక వసతులని, వాటిపై దాడులు చేయడం వల్ల సాధారణ వ్యాపారులు, వినియోగదారులే నష్టపోతున్నారని తెలిపింది.




# వంద శాతం వాళ్లిద్దరూ చూసుకుంటారు!

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా వంద శాతం సుంకాలు విధించాలనుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ సుంకాల సమస్యను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పరిష్కరించుకుంటారని వైట్‌హౌస్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో తెలిపారు. ఇరువురు నేతల మధ్య మంచి బంధం ఉందని ఆయన పేర్కొన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికా కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేసే ఐదు దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అధికారం కల్పించే బిల్లును అమెరికా సెనేట్ ఇటీవల ఆమోదించింది. రష్యా చమురు కొనుగోళ్లు ఉక్రెయిన్ యుద్ధానికి నిధులు సమకూర్చుతున్నాయన్నది అమెరికా వాదన. రష్యా నుంచి భారత్ ప్రస్తుతం భారీగా ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. రష్యా చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్‌పై అమెరికా విధించనున్న సుంకాల గురించి అడిగిన ప్రశ్నకు నవారో స్పందించారు. ఈ అంశాన్ని ట్రంప్, మోదీ స్వయంగా చర్చించి పరిష్కరించుకుంటారని చెప్పారు. ఇరువురి మధ్య మంచి సంబంధాలు ఉన్నందున ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం వ్యక్తం చేశారు.

# జింబాబ్వేలో పడవ ప్రమాదం : 15 మంది మృతి

## కరీబా సరస్సులో ఘోరం పలువురు ప్రయాణీకుల గల్లంతు

జింబాబ్వేలోని కరీబా సరస్సులో పడవ ప్రమాదం జరిగింది. ప్రయాణికులతో వెళ్తున్న పడవ ఒక్కసారిగా బోల్తా పడటంతో 15 మంది మృతి చెందారు. ప్రమాద సమయంలో పడవలో 114 మంది ప్రయాణికులతో పాటు ఐదుగురు సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. పడవ బోల్తా పడటంతో పలువురు నీటిలో గల్లంతయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి గాలింపు చర్యలు ప్రారంభించాయి. కరీబా సరస్సులో గల్లంతైన వారి కోసం రెస్క్యూ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. పడవలో ప్రయాణికుల సంఖ్య, భద్రతా ప్రమాణాలు, ప్రమాద సమయంలో చోటుచేసుకున్న పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. గల్లంతైన వారి సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటనతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



# సిరియా మాజీ అధ్యక్షుడికి మరణశిక్ష



సిరియా దేశంలో 14 ఏళ్లుగా కొనసాగిన అంతర్యుద్ధానికి సంబంధించి కీలక పరిణామం చోటుచేసుకుంది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు, యుద్ధ నేరాలకు పాల్పడ్డారనే కేసులో మాజీ అధ్యక్షుడు బషర్ అల్ అసద్, ఆయన సోదరుడు మహేర్ అసద్‌కు సిరియా కోర్టు గైర్హాజరీలో మరణశిక్ష విధించింది. ఇదే కేసులో అసద్ బంధువు అతేఫ్ నజీబ్‌కు కూడా న్యాయమూర్తి మరణశిక్ష విధించారు. తీర్పు వెలువడే సమయంలో కోర్టు వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. నజీబ్ ఖైదీ దుస్తులు ధరించి బోనులో నిలబడి ఉండగా తీర్పును చదివారు.

2014 డిసెంబర్‌లో తిరుగుబాటుదారులు డమాస్కస్‌లోకి ప్రవేశించిన తర్వాత బషర్ అసద్, ఆయన సోదరుడు మహేర్ రష్యాకు పారిపోయారు. ఆ తర్వాత అతేఫ్ నజీబ్‌ను అరెస్టు చేశారు. అనంతరం ఆయనపై విచారణ చేపట్టారు. అసద్ ప్రభుత్వంలో విచారణకు గురైన అత్యున్నత స్థాయి అధికారుల్లో నజీబ్ ఒకరిగా ఉన్నారు. నజీబ్ సిరియా సైన్యంలో మాజీ బ్రిగేడియర్ జనరల్. 2011లో బషర్ అసద్ పాలనలో దక్షిణ సిరియాలోని దారా ప్రావిన్స్‌లో రాజకీయ భద్రతా విభాగానికి ఆయన అధిపతిగా పనిచేశారు. అక్కడ తిరుగుబాటును అణచివేసిన చర్యల్లో ఆయన కీలక పాత్ర పోషించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

# హర్మూజ్ మా సొంతం...

## దగ్గర కొస్తే పేల్చేస్తాం : ఇరాన్‌కు ట్రంప్ భారీ హెచ్చరిక



హర్మూజ్ జలసంధి పూర్తిగా తమ నియంత్రణలో ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఇరాన్ రెచ్చగొట్టే చర్యలకు దిగితే గట్టిగా బదులిస్తామని హెచ్చరించారు. 'నేను ఇరాన్‌ను విశ్వసించను. వాళ్లు నిత్యం నాతో అబద్ధాలు ఆడుతూనే ఉన్నారు. ప్రస్తుతం హోర్ముజ్‌పై మాకు పూర్తి నియంత్రణ ఉంది. వాళ్లకు హర్మూజ్‌పై కంట్రోల్ లేదు. అది మా సొంతం. వాళ్లు ఈ విషయంలో ఏదోకటి చేసేందుకు ప్రయత్నించి చివరకు తుత్తునియలు అవుతారు' అని ట్రంప్ అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో అమెరికా పటిష్ఠ స్థితిలో ఉందని కూడా చెప్పారు. 'పశ్చిమాసియాలో ఇరుగుపొరుగును ఓ దేశం గత 50 ఏళ్లుగా బెదిరిస్తోంది. ఆ బెదిరింపులకు ఇక కాలం చెల్లిపోయింది' అని ట్రంప్ అన్నారు. మరోవైపు, అమెరికా అన్యాయంగా, అవమానకరంగా తమపై ఆంక్షలు విధిస్తోందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఆగ్రహం వ్యక్తం చేసినట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. 'ప్రస్తుతం హోర్ముజ్‌లో పరిస్థితులకు అమెరికా, ఇజ్రాయెల్ కారణం. ఇప్పటికీ వారి దాడులు కొనసాగుతున్నాయి' అని విదేశాంగ శాఖ ప్రతినిధి అన్నారు. ఇదిలా ఉంటే, హర్మూజ్‌లో భద్రంగా రవాణా కొనసాగించే దిశగా ఇరాన్, ఒమాన్ మధ్య చర్చలు జరుగుతున్నట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వెలువడుతున్నాయి.

స్పోర్ట్స్

చైతన్యరథం



# బంగ్లాదేశ్‌కు బిగ్ షాక్!

- సెప్టెంబరులో ఆఫ్ఘనిస్థాన్‌తో టీమిండియా మూడు టీ20ల సిరీస్
- ఢిల్లీ వేదికగా మ్యాచ్‌లు.. షెడ్యూల్ విడుదల చేసిన బీసీసీఐ

వచ్చే నెలలో భారత జట్టు తమతో సిరీస్ ఆడుతుందని ఆశలు పెట్టుకున్న బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పరోక్షంగా బంగ్లా పర్యటనకు వెళ్లడం లేదని స్పష్టం చేసిన భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెప్టెంబరు నెలలో ఆఫ్ఘనిస్థాన్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనున్నట్లు ప్రకటించింది. ఆఫ్ఘన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) తెలిపిన వివరాల ప్రకారం... ఈ మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు ఢిల్లీలోని అరుణ్‌జైట్లీ క్రికెట్ స్టేడియం వేదిక కానుంది. ఈ సిరీస్‌లో ఆఫ్ఘన్ జట్టుకు ఢిల్లీయే హోం గ్రౌండ్‌గా వ్యవహరించనుంది. ఈ ఏడాది జూన్‌లోనే భారత్-ఆఫ్ఘనిస్థాన్ జట్ల మధ్య ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే.

**మ్యాచ్‌ల షెడ్యూల్ వివరాలు:**

తొలి టీ20: సెప్టెంబరు 13, రెండో టీ20: సెప్టెంబరు 15, మూడో టీ20: సెప్టెంబరు 17

**ఆఫ్ఘన్ క్రికెట్‌కు ఎల్లవేళలా బాసట: మిథున్ మన్హాస్**

"భారత క్రికెట్ బోర్డు ఎల్లవేళలా ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ వృద్ధికి బాసటగా ఉంటుంది. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా వారికి అవసరమైన అన్ని సదుపాయాలనూ కల్పిస్తాం. అందులో భాగమే ఈ ద్వైపాక్షిక సిరీస్. నాణ్యమైన జట్లతో ఆడటం వల్ల ఆఫ్ఘన్ ఆటగాళ్లకు వెలకట్టలేని అనుభవం లభిస్తుంది. టీ20 సిరీస్ కోసం ఆఫ్ఘనిస్థాన్‌ను భారత్‌కు సాదరంగా ఆహ్వానిస్తున్నాం" అని బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తెలిపారు.

**ఇరు జట్ల పోరు ఆసక్తికరం: దేవజిత్ సైకియా**

"భారత వేదికగా ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు ఆతిథ్యమిస్తున్న ఈ సిరీస్‌కు బీసీసీఐ పూర్తి మద్దతు ఇస్తోంది. మైదానంలో ఇరు జట్ల మధ్య పోటీ చాలా ఆసక్తికరంగా సాగుతుంది. భారత అభిమానుల్లోనూ ఆఫ్ఘన్ ఆటగాళ్లకు మంచి ఆదరణ ఉంది. ఇటీవల టెస్టు, వన్డే సిరీస్లు పూర్తయ్యాయి. ఇప్పుడు ఈ టీ20 సిరీస్‌తో మూడు ఫార్మాట్లలోనూ ఇరు జట్లు తలపడినట్లవుతుంది" అని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు.

# వరద కష్టాలను జయించి.. కరాటేలో స్వర్ణం

- ఢిల్లీ జాతీయ కరాటే చాంపియన్‌షిప్‌లో అసోం అమ్మాయి ప్రతాపం
- 'ఫిజిక్స్ వాలా' అలఖ్ పాండే ఆర్థిక చేయూతతో విజయం



గువాహటి (అస్సాం): ఆత్మవిశ్వాసం, సాధించాలన్న పట్టుదల ఉంటే ఎన్ని అడ్డంకులు ఎదురైనా లక్ష్యం ముందు చిన్నబోతాయని మరోసారి నిరూపించింది అసోంకి చెందిన 17 ఏళ్ల కరాటే క్రీడాకారిణి జాన్మోని కోవర్. ఇటీవల ఆ రాష్ట్రాన్ని ముంచెత్తిన భయంకరమైన వరదల కారణంగా ఇల్లు, సర్వస్వం కోల్పోయి ప్రస్తుతం ప్లాస్టిక్ టెంట్ కింద తలదాచుకుంటున్నా.. తన కలను మాత్రం వదులుకోలేదు. ఢిల్లీలో జరిగిన 'నేషనల్ కరాటే చాంపియన్‌షిప్'లో బంగారు పతకం సాధించి అసాధారణ ప్రతిభతో అందరి ప్రశంసలు అందుకుంటోంది.

**టార్పాలిన్ గుడారంలో నివాసం**

జాన్మోనిది అసోంలోని జోర్హాట్ జిల్లా 'భోగోయిపోరియా' గ్రామం. ఆమె కుటుంబం చేపలు పడుతూ జీవనం సాగిస్తోంది. గత నెల సంభవించిన వరదలకు గ్రామం మొత్తం నీటమునిగిపోవడంతో ఇల్లు వదిలి రోడ్డు పక్కన టార్పాలిన్ గుడారం (టెంట్) కింద బతుకీడుస్తున్నారు. ఐదేళ్ల వయసు నుంచే కరాటేలో మెళకువలు నేర్చుకున్న జాన్మోనికి ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొనాలనే బలమైన కోరిక ఉన్నప్పటికీ.. తీవ్ర పేదరికం, వరద కష్టాలు అడ్డంకిగా మారాయి.

జాన్మోని ఆవేదన, ఆమె స్థితిగతులను తెలుసుకున్న 'ఫిజిక్స్ వాలా' సంస్థ వ్యవస్థాపకుడు అలఖ్ పాండే ఆమెకు అండగా నిలిచారు. ఆమె ఢిల్లీ వెళ్లేందుకు అయ్యే ప్రయాణ ఖర్చులు, అక్కడ ఉండటానికి అయ్యే పూర్తి ఖర్చులను భరించి అండగా నిలిచారు. అలఖ్ పాండే అందించిన ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొన్న జాన్మోని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. వరదలు ఆమె ఇంటిని ముంచేసినా, ఆమె సాధించాలన్న సంకల్పాన్ని మాత్రం అడ్డుకోలేకపోయాయి. అయితే జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించి స్వగ్రామానికి తిరిగివచ్చిన జాన్మోని.. ఇప్పటికీ సౌకర్యాలు లేని అదే టార్పాలిన్ గుడారంలోనే కుటుంబంతో కలిసి నివసిస్తుండటం అందరినీ కలచివేస్తోంది.



# హార్దిక్ పాండ్య 'ట్రేడింగ్' సస్పెన్స్

- ముంబయిని వీడుతున్నారంటూ ఊహాగానాలు
- గుజరాత్ టైటాన్స్ ఆఫర్‌కు 'కెప్టెన్సీ' చెక్!
- ఇతర ఫ్రాంచైజీలతో ఎలాంటి చర్చలు జరపలేదన్న హార్దిక్ ప్రతినిధి

భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య ఐపీఎల్ భవిష్యత్తుపై తీవ్రస్థాయిలో ప్రచారం సాగుతోంది. ముంబయి ఇండియన్స్ జట్టును వీడేందుకు ఆయన సిద్ధమవుతున్నారని... కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ వంటి ఫ్రాంచైజీలు ఆయన్ను తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాయంటూ క్రీడా వర్గాల్లో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. తాజాగా హార్దిక్ తన పాత జట్టు గుజరాత్ టైటాన్స్‌కు తిరిగి వెళ్లేందుకు యత్నించినట్లు తెలుస్తోంది. తొలుత గుజరాత్ మేనేజ్‌మెంట్ కూడా దీనికి అంగీకరించినప్పటికీ... హార్దిక్ పెట్టిన ఒక నిబంధన వల్ల ఆ చర్చలు నిలిచిపోయినట్లు ప్రచారం జరుగుతోంది.


**'కెప్టెన్సీ' షరతుతో ఆగిపోయిన చర్చలు**

"హార్దిక్ పాండ్యను తిరిగి జట్టులోకి తీసుకునేందుకు గుజరాత్ టైటాన్స్ ఫ్రాంచైజీ సుముఖత వ్యక్తం చేసింది. ఈ విషయమై ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కూడా చర్చించి అంగీకారం తీసుకుంది. అయితే హార్దిక్ తిరిగి రావాలంటే తనకు మళ్లీ 'కెప్టెన్సీ' బాధ్యతలు ఇవ్వాలనే షరతు విధించాడు. దీనికి గుజరాత్ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్ ఏమాత్రం అంగీకరించకపోవడంతో ట్రేడింగ్ చర్చలకు తెరపడింది" అని గుజరాత్ టైటాన్స్ వర్గాలు వెల్లడించాయి.

మరోవైపు... ఈ ప్రచారాన్ని హార్దిక్ పాండ్య సన్నిహితులు తీవ్రంగా ఖండించారు. "హార్దిక్ ఇతర ఏ ఫ్రాంచైజీతోనూ నేరుగా ట్రేడింగ్ చర్చలు జరపలేదు. ముంబయి ఇండియన్స్ కూడా ఎవరితోనూ ట్రేడ్ సంప్రదింపులు నిర్వహించలేదు. భవిష్యత్తుకు సంబంధించి ఏ నిర్ణయం ఉన్నా హార్దిక్ నేరుగా ముంబయి ఫ్రాంచైజీ యాజమాన్యానికే తెలియజేస్తాడు. అప్పటివరకు వచ్చే ఊహాగానాలను ఎవరూ నమ్మవద్దు" అని హార్దిక్ పాండ్య ప్రతినిధి ఒకరు స్పష్టం చేశారు.

## ఇంటివాడైన ఫుట్‌బాల్ లెజెండ్

**ప్రియురాలిని పెళ్లాడిన రొనాల్డో**



పోర్చుగల్ ఫుట్‌బాల్ సూపర్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో ఒక ఇంటివాడయ్యాడు. గత కొన్నేళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్న తన ప్రియురాలు, అర్జెంటీనా-స్పానిష్ మోడల్ జార్జినా రోడ్రిగ్స్ (32)ను ఈ ఫుట్‌బాల్ స్టార్ వివాహం చేసుకున్నాడు. తమ పెళ్లి వేళ్లకు ధరించిన 'వెడ్డింగ్ రింగ్స్'ను చూపిస్తూ సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని అధికారికంగా పోస్ట్ చేశాడు. తన పేరులోని మొదటి అక్షరం 'జ'.. జార్జినా పేరులోని మొదటి అక్షరం '+'ల మధ్య లవ్ సింబల్‌ను పోస్టుకు క్యాప్షన్‌గా ఇచ్చాడు. ఈ పోస్టుకు కేవలం ఏడు గంటల్లోనే 17.1 మిలియన్ల లైకులు రావడం విశేషం.

**2016 నుంచి ప్రేమ ప్రయాణం**

41 ఏళ్ల రొనాల్డో, 32 ఏళ్ల జార్జినా దాదాపు పదేళ్లుగా రిలేషన్‌షిప్‌లో ఉన్నారు. వీరిద్దరి వివాహంపై గతంలో అనేక రూమర్లు వచ్చినప్పటికీ వాటిని ఖండిస్తూ వచ్చారు. అయితే ఇప్పుడు అధికారిక పోస్ట్‌తో అభిమానులను తీవ్ర ఆశ్చర్యానికి, ఆనందానికి గురిచేశారు. జార్జినాను తొలిసారి 2016లో ఒక షాపింగ్ మాల్ (గుస్సీ స్టోర్)లో రొనాల్డో కలిశాడు. తమ అనుబంధంపై మరుసటి ఏడాది బహిరంగంగా ప్రకటన చేశారు. "మొదట్లో ఈ బంధం ఈ స్థాయిలో బలపడుతుందని అనుకోలేదు.. కానీ రొనాల్డో ఆమె ప్రేమలో పడిపోయాను" అని నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన 'ఐ యామ్ జార్జినా' సిరీస్‌లో రొనాల్డో స్వయంగా పేర్కొన్నాడు. ప్రస్తుతం రొనాల్డో-జార్జినా జంటకు ఐదుగురు పిల్లలు ఉన్నారు.

## మైక్ పట్టిన రహానే!

- కొత్త అవతారంలో టీమిండియా మాజీ స్టార్ క్రికెటర్
- భారత్-శ్రీలంక సిరీస్‌తో కామెంటేటర్‌గా అరంగేట్రం



భారత మాజీ క్రికెటర్ అజింక్య రహానే సరికొత్త పాత్ర పోషించేందుకు సిద్ధమయ్యాడు. ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఆయన మైదానంలో బ్యాట్‌తో కాకుండా ఇప్పుడు కామెంట్రీ బాక్స్‌లో మైక్‌తో అలరించేందుకు రంగ సిద్ధం చేసుకున్నాడు. టీమిండియా తరపున సుదీర్ఘ కాలం పాటు సేవలందించడంతో పాటు ఐపీఎల్‌లోనూ ప్రాతినిధ్యం వహించిన రహానే... ఆటకు 'గుడ్‌బై' చెప్పిన తర్వాత ఏం చేస్తాడనే ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం లభించింది. మరో మూడు రోజుల్లో భారత్- శ్రీలంక జట్ల మధ్య ప్రారంభం కానున్న టెస్టు సిరీస్‌కు ఆయన వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నాడు. ఈ విషయాన్ని సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ సీఈవో, బిజినెస్ హెడ్ రాజేష్ కౌల్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడించారు. తమ వ్యాఖ్యాతల బృందంలోకి రహానేను సాదరంగా ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

***క్రికెట్ అభిమానులను అలరిస్తా: రహానే***

ఈ సందర్భంగా రహానే స్పందిస్తూ... 'భారత్-శ్రీలంక టెస్టు సిరీస్ ద్వారా వ్యాఖ్యాతగా అరంగేట్రం చేయడం చాలా ఆసక్తిగా ఉంది. క్రికెట్‌లో టెస్టు ఫార్మాట్‌కు తిరుగులేదు. టీమిండియా తరపున ఎన్నో ఏళ్లపాటు టెస్టు మ్యాచ్‌లు ఆడాను. ఇప్పుడు అదే ఆటను మరో కోణంలో చూడబోతున్నాను. మైదానంలో నా అనుభవాలను, గేమ్‌లోని కీలక మలుపులను అభిమానుల ముందుకు తీసుకొస్తాను. నా బ్రాడ్‌కాస్ట్ అనుభవం క్రికెట్ ప్రేమికులను కచ్చితంగా అలరిస్తుందని భావిస్తున్నాను" అని ధీమా వ్యక్తం చేశాడు.

## భారత్‌తో తొలి టెస్టు



శ్రీలంక, భారత్ మధ్య ఈ నెల 15వ తేదీ నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభంకా నుంది. గాలె వేదికగా తొలి టెస్టు జరగనుండగా.. ఈ నెల 23 నుంచి కొలంబోలో రెండో టెస్టు మొదలవుతుంది. ఈ నేపథ్యంలో తొలి టెస్టు కోసం శ్రీలంక బుధవారం 16 మందితో జట్టును ప్రకటించింది. ధనంజయ డిసిల్వా కెప్టెన్సీ బాధ్యతలు చూసుకుంటాడు. కమిందు మెండిస్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ఈ జట్టులో అనుభజ్ఞులతో పాటు టీమ్ ఇండియాతో వార్మప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు చోటు కల్పించారు.

శ్రీలంక జట్టు: ధనంజయ డిసిల్వా, లాహిరు ఉదానా, నిషాన్ మదుష్క, కమిందు మెండిస్, దినేశ్ చండిమాల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా, రమేశ్ మెండిస్, ప్రభాత్ జయసూర్య, కేసర సువాంత, మిలన్ రత్నాయకే, అసిత ఫెర్నాండో, లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, దిల్షన్ మధుశంక.

చైతన్య రథం
సినిమా
గురువారం 13 ఆగస్టు 2026 X

# ఇండియన్ బాక్సాఫీస్ వద్ద 'స్పైడర్‌మ్యాన్' విధ్వంసం

**- 12 రోజుల్లోనే రూ.500 కోట్ల కలెక్షన్స్**




హాలీవుడ్ సూపర్ హీరో ఫ్రాంచైజీ 'స్పైడర్‌మ్యాన్' సిరీస్ నుంచి వచ్చిన తాజా చిత్రం 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఇండియన్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త వసూళ్లతో దూసుకుపోతోంది. టామ్ హాలండ్, జెండాయా జంటగా నటించిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగానే కాకుండా మన దేశంలోనూ ఊహించని రీతిలో వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ.12వేల కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం ఇండియన్ బాక్సాఫీస్ వద్ద కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. తాజాగా ఈ సినిమా తెలుగు, హిందీ, తమిళ, ఇంగ్లీష్ భాషల్లో కలిపి భారతీయ మార్కెట్‌లో రూ. 500 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. దీంతో మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ సినిమాలకు భారతదేశంలో ఉన్న క్రేజ్ మరోసారి నిరూపితమైంది. వీకెండ్‌లోనే కాకుండా వీక్‌డేస్‌లో కూడా థియేటర్లు హౌస్‌ఫుల్ బోర్డులతో కళకళలాడుతున్నాయి. రెండో వారంలోనూ వసూళ్ల జోరు ఏమాత్రం తగ్గకపోగా... మొత్తం గ్రాస్ కలెక్షన్లు త్వరలోనే రూ.520 కోట్లకు చేరుకుంటాయని ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. త్వరలో కొన్ని కొత్త చిత్రాలు విడుదల కానున్నప్పటికీ, వాటిని తట్టుకుని ఈ సినిమా ఫుల్ రన్‌లో సులభంగా రూ.600 కోట్ల గ్రాస్, రూ.500 కోట్ల నెట్ వసూళ్లను సాధిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇప్పటివరకు భారతదేశంలో ఈ సినిమాను దాదాపు 1.7 కోట్ల మంది ప్రేక్షకులు వీక్షించారు. త్వరలోనే ఈ సంఖ్య 2 కోట్లకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. గతంలో మన దేశంలో హాలీవుడ్ నుంచి కేవలం 'టైటానిక్', 'అవెంజర్స్: ఎండ్‌గేమ్' చిత్రాలను మాత్రమే 2కోట్ల మందికి పైగా థియేటర్లలో చూశారు. ఇప్పుడు 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' కూడా ఆ అరుదైన రికార్డుకు చేరువలో దూసుకుపోతోంది. ఈ విజయంతో ట్రేడ్ పండితులు దీన్ని 'ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్'గా ప్రకటించారు.


## ఎన్టీఆర్ భుజానికి శస్త్ర చికిత్స విజయవంతం




ఇటీవల భుజానికి గాయమైన ఎన్టీఆర్‌కు కిమ్స్ ఆస్పత్రిలో వైద్యులు ఆర్థ్రోస్కోపిక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ ఆర్‌వి పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ నితిన్ బెజ్జంకి, డాక్టర్ మధుసూదన్‌రావు,డాక్టర్ శ్రీనివాసరావు సూరపనేని ఆధ్వర్యంలోని నిపుణులైన వైద్యుల బృందం ఈ శస్త్ర చికిత్సను విజయవంతం చేసినట్లు మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సాంబిత్ సాహు వెల్లడించారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. వైద్యుల పర్యవేక్షణలో త్వరలోనే ప్రత్యేక పునరావాస కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అన్ని జాగ్రత్తలతో రాబోయే 2 నుంచి 3 నెలల వ్యవధిలో ఆయన పూర్తిగా కోలుకుని తన సాధారణ దినచర్యకు తిరిగి వస్తారని వైద్యులు ప్రకటించారు.

## బాక్సాఫీస్ క్లాష్ నుంచి తప్పుకున్న దుల్కర్ 'ఐయామ్ గేమ్'

**రవితేజ 'ఇరుముడి'కి సోలో దారి**




టాలీవుడ్‌లో ఆగస్టు నెల సినిమాలపరంగా అత్యంత బిజీగా సాగుతోంది. గత వారం ప్రేక్షకుల ముందుకొచ్చిన కొరియన్ కనకరాజు, డీసీ చిత్రాలు ప్రస్తుతం మంచి వినోదాన్ని పంచుతుండగా,ఈనెలలో రాబోయే రోజుల్లో కూడా పలు క్రేజీ ప్రాజెక్టులు బాక్సాఫీస్ బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నాయి.ముఖ్యంగా మాస్ మహారాజ్ రవితేజ నటిస్తున్న భారీ చిత్రం 'ఇరుముడి' ఈ నెల 21న విడు దల కానుంది. అయితే ఈ సినిమాకు గట్టి పోటీ ఇస్తుందని భావించిన మలయాళీ నటుడు దుల్కర్ సల్మాన్ చిత్రం 'ఐయామ్ గేమ్' తెలుగు డబ్బింగ్ వెర్షన్ మాత్రం ఈ రేసు నుంచి తప్పుకున్నట్టు తెలుస్తోంది.

వాస్తవానికి ఆగష్టు 20నే ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ చిత్రం వాయిదా పడినట్టు ఫిలిం సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడం, పైగా ప్రేక్షకుల్లో ఆశించిన స్థాయిలో అంచనాలు నెలకొనకపోవడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. సరైన ప్రమోషన్స్ కూడా లేకపోవడంతో ఈ వాయిదా అనివార్యమైనట్లు స్పష్టమవుతోంది. దుల్కర్ సినిమా రేసు నుంచి తప్పుకోవడంతో ఇప్పుడు రవితేజ 'ఇరుముడి'కి సోలో రిలీజ్ అడ్వాంటేజ్ దక్కడం ఖాయంగా కనిపిస్తోంది. మరి ఈ సినిమా కొత్త విడుదల తేదీ ఎప్పుడు ప్రకటించనున్నారు అనేది త్వరలోనే తెలియనుంది.

**అక్షయ్‌కుమార్, సైఫ్ అలీఖాన్...**

## 'హైవాన్' టీజర్ విడుదల




బాలీవుడ్ ప్రముఖ నటులు అక్షయ్ కుమార్, సైఫ్ అలీ ఖాన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హైవాన్'. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక టీజర్ విడుదల కాగా భారీ అంచనాలు నెలకొన్నాయి. చాలా కాలం తర్వాత అక్షయ్‌కుమార్, సైఫ్ అలీఖాన్ కలిసి ఒకే చిత్రంలో నటిస్తుండటంతో ప్రేక్షకుల్లో ఈ ప్రాజెక్ట్‌పై విపరీతమైన ఆసక్తి నెలకొంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు సాధించాయి. దీంతో 'హైవాన్' టీజర్ విడుదల కాగానే సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. డైరెక్టర్ ప్రియదర్శన్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు టీజర్ చూస్తే స్పష్టమవుతోంది. ఇందులో సైఫ్ బ్లైండ్ పాత్రలో కనిపించబోతుండగా అక్షయ్‌కుమార్ సైకో పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.

## ఫ్యాన్ పేజీలపై నిషేధం కుదరదు

**నటి జాన్వీకపూర్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ: బాలీవుడ్ నటి జాన్వీకపూర్ తన 'వ్యక్తిత్వ హక్కుల' పరిరక్షణ కోసం దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ ఉన్నత న్యాయస్థానం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సోషల్ మీడియాలో ఉన్న ఆమె ఫ్యాన్స్ క్లబ్‌లు, అభిమానుల పేజీలన్నింటిపై పూర్తిస్థాయిలో నిషేధం విధించేందుకు కోర్టు స్పష్టంగా నిరాకరించింది. జాన్వీపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర వ్యాఖ్యలు, విమర్శలు చేయడంతో పాటు.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ ఫేక్ సాంకేతికతను ఉపయోగించి అశ్లీల కంటెంట్ తయారు చేస్తున్నారని ఆమె తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనికి సంబంధించి పలు ఫ్యాన్ పేజీల లింక్‌లతో పాటు దాదాపు నాలుగు వేల వెబ్‌సైట్ లింక్‌లను కోర్టుకు సమర్పించారు.

**మీకు అభిమానులు వద్దా?**

**హైకోర్టు ప్రశ్న**

ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు.. విమర్శలు, ఆన్‌లైన్ దూషణలు నేటి ప్రజా జీవితంలో భాగమైపోయాయని పేర్కొంది. ఈ సందర్భంగా న్యాయస్థానం స్పందిస్తూ ... "సామాజిక మాధ్యమాల్లో అశ్లీలత, తీవ్రమైన అభ్యంతరకర కంటెంట్ ఉంటే వాటిపై కచ్చితంగా చర్యలు తీసుకోవచ్చు. కానీ కేవలం ఆ నెపంతో అన్ని ఫ్యాన్ క్లబ్‌లను ఎలా మూసివేయగలం? అన్ని ఫ్యాన్ పేజీలు తప్పుగా ప్రవర్తించడం లేదు. కొన్ని కేవలం అభిమానంతోనే క్రియేట్‌చేసి ఉండొచ్చు. అభిమానుల పేజీలన్నింటినీ చట్టవిరుద్ధమైనవిగా పరిగణించ లేము. అసలు మీకు అభిమానులు వద్దా?" అని ప్రశ్నించింది. అభిమానుల పేజీలను చట్ట విరుద్ధంగా ముద్ర వేయలేమని, అశ్లీలత లేదా వాణిజ్యపరమైన దుర్వినియోగం లేని సాధారణ అభిమాన సంఘాల పేజీలను వేరుచేసి చూడా లని సూచిస్తూ విచారణను కొనసాగించింది.

## సిద్ధార్థ్ వెబ్ సిరీస్‌కు కొత్త చిక్కులు

**'ఆపరేషన్ సఫేద్ సాగర్' బ్యాన్ చేయాలని డిమాండ్**

ప్రముఖ నటుడు సిద్ధార్థ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా ఏరియల్ యాక్షన్ వెబ్ సిరీస్ 'ఆపరేషన్ సఫేద్ సాగర్' వివాదంలో చిక్కుకుంది. 1999 కార్గిల్ యుద్ధంలో భారత సైన్యంతో కలిసి పోరాడిన ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారుల వీరోచిత గాథ ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కింది. ఓని సేన్ దర్శకత్వంలో రూపొందిన ఈ ఆరు ఎపిసోడ్ల సిరీస్ ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతుండగా ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. అయితే తాజాగా ఈ సిరీస్‌లోని ఒక సన్నివేశంపై ఆర్మీ వెటర్నరీ అధికారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది.

సిరీస్‌లో భాగంగా వీరమరణం పొందిన స్క్వాడ్రన్ లీడర్ అజయ్ అహుజా (సిద్ధార్థ్ నటించిన పాత్ర) భౌతికకాయంపై జాతీయ జెండాను కప్పిన విధానంపై భారత ఆర్మీ వెటరన్, శౌర్యచక్ర అవార్డు గ్రహీత కల్నల్ వెంబు శంకర్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర అభ్యంతరం తెలిపారు. 'ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా' నిబంధనల ప్రకారం శవపేటికపై త్రివర్ణ పతాకాన్ని తప్పుగా కప్పారని ఆయన పేర్కొన్నారు. శవపేటికపై జెండాలోని ఆకుపచ్చ భాగం కనిపించేలా తప్పుగా ప్రదర్శించారని, నిబంధనల ప్రకారం కాషాయ రంగు తల వైపు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ పొరపాటును సర్వీస్ హెడ్‌క్వార్టర్స్, మిల్యూటరీ అడ్వైజర్లు ఎలా విస్మరించారని ఆయన విస్మయం వ్యక్తం చేశారు. మేకర్స్ వెంటనే ఈ తప్పును డిజిటల్‌గా సరిదిద్దాలని, అప్పటివరకు నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సిరీస్ ప్రసారాన్ని నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతేకాకుండా, ఈ పొరపాటుపై మేకర్స్ మెయిన్‌స్ట్రీమ్ మీడియాలో బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కల్నల్ వెంబు శంకర్ కోరారు.

